


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



విశాఖపట్నం

శుక్రవారం 18 ఆగస్టు 2017 | 16

విచారణకు గడువు కోరాం



- మరో 2 నెలలు అవసరం
- రేపోమాపో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు
- 'ఆంధ్రజ్యోతి'తో సిట్ ముఖ్య అధికారి వినీత్ బ్రిజ్‌లాల్
- రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, ప్రభుత్వ భూముల కబ్జాపై 337 ఫిర్యాదులపైనే దర్యాప్తు
- ఇప్పటివరకూ 112 ఫిర్యాదులపై విచారణ పూర్తి
- 450 ఎకరాల వివరాలు రాబట్టగలిగాం
- మరో 100 ఎకరాల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం

-వార్త 7వ పేజీలో...

వైద్యానికి ప్రథమ ప్రాధాన్యం



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 50 పడకల విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కామినేని. మంత్రి అయ్యన్న

- ఆర్థిక లోటు ఉన్నప్పటికీ తగినన్ని నిధుల కేటాయింపు
- వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 50 అదనపు పడకల విభాగం ప్రారంభం
- నర్సీపట్నం-తాళ్లపాలెం రోడ్డు విస్తరణ పనులకు మంత్రి అయ్యన్న శ్రీకారం
- అంచనా వ్యయం రూ.31 కోట్లు
- ఏడాదిలో పూర్తి చేయాలని లక్ష్యం

-వివరాలు 16, 7వ పేజీల్లో..



కూల్ కాటేజ్

డల్లాపల్లిలో కూల్ కాటేజీలు

- లంబసింగిలో రూ.5 కోట్లతో రిసార్ట్స్, రెస్టారెంట్
- టెండర్లు ఖరారు... నెలాఖరులో పనులు ప్రారంభం
- యారాడ, మంగమారిపేట, రుషికొండ బీచ్‌ల అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్
- రూ.17 కోట్లు విడుదల.. పర్యాటక ప్రాజెక్టులకు మోక్షం

-వార్త సెంటర్‌స్ప్రెడ్‌లో..

ఇసుకాసురులపై ఉక్కుపాదం



కోటవురట్ల మండలంలో వరాహనదికి వెళ్లే దారికి గండి కొడుతున్న దృశ్యం

- అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు
- అనధికార ఇసుక క్వారీల నిర్వాహకుల గురించి ఆరా
- తవ్వకాల కట్టడికి పక్కా చర్యలు
- దాడులు చేయాలని రెవెన్యూ, పోలీస్, భూగర్భ గనుల శాఖలకు ఆదేశాలు
- ఇసుక వాహనం తొలిసారి పట్టుబడితే రూ.50 వేలు జరిమానా

జిల్లాలో పెద్దఎత్తున ఇసుక అక్రమ వ్యాపారం జరుగుతున్నది. ఒక్క క్వారీకి కూడా అధికారికంగా అనుమతి లేకపోయినా తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్న ధోరణిలో దందా సాగుతున్నది. దీనిని అడ్డుకొనేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో మాదిరిగా కాకుండా ఇకముందు ఇసుక తవ్వకాలు, రవాణాపై కొత్త విధివిధానాలను అమలులోకి తేనుంది.

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం) జిల్లాలో ఇసుకాసురుల ఆగడాలను అడ్డుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసు శాఖలతో ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇకపై ఇసుక రవాణా చేస్తూ పట్టుబడితే

..మిగతా 6వ పేజీలో..

కత్తి పోట్లు



- కుటుంబంలో ఘర్షణ..
- ఇద్దరిపై చురకత్తితో దాడి
- దాడి చేసింది ఇంటి పెద్ద
- క్షతగాత్రులు కేజీహెచ్‌కు తరలింపు

10

- మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్యపై హత్యాయత్నం
- నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న బాధితురాలు

10



మన్యంలో ముసురు


- పలు మండలాల్లో వర్షం
- ఖరీఫ్ పంటలకు అనుకూలమని రైతుల ఆనందం

3



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



విశాఖపట్నం

శుక్రవారం 18 ఆగస్టు 2017 | 20

విచారణకు గడువు కోరాం



- మరో 2 నెలలు అవసరం
- రేపోమాపో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు
- 'ఆంధ్రజ్యోతి'తో సిట్ ముఖ్య అధికారి వినీత్ బ్రిజ్‌లాల్
- రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, ప్రభుత్వ భూముల కబ్జాపై 337 ఫిర్యాదులపైనే దర్యాప్తు
- ఇప్పటివరకూ 112 ఫిర్యాదులపై విచారణ పూర్తి
- 450 ఎకరాల వివరాలు రాబట్టగలిగాం
- మరో 100 ఎకరాల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం

-వార్త 7వ పేజీలో...

వైద్యానికి ప్రథమ ప్రాధాన్యం



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 50 పడకల విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కామినేని. మంత్రి అయ్యన్న

ఆర్థిక లోటు ఉన్నప్పటికీ తగినన్ని నిధుల కేటాయింపు

వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 50 అదనపు పడకల విభాగం ప్రారంభం

నర్సీపట్నం-తాళ్లపాలెం రోడ్డు విస్తరణ పనులకు మంత్రి అయ్యన్న శ్రీకారం

అంచనా వ్యయం రూ.31 కోట్లు

ఏడాదిలో పూర్తి చేయాలని లక్ష్యం

-వివరాలు 16, 7వ పేజీల్లో..



డల్లాపల్లిలో కూల్ కాటేజీలు

లంబసింగిలో రూ.5 కోట్లతో రిసార్ట్స్, రెస్టారెంట్

టెండర్లు ఖరారు... నెలాఖరులో పనులు ప్రారంభం

యారాడ, మంగమారిపేట, రుషికొండ బీచ్‌ల అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్

రూ.17 కోట్లు విడుదల.. పర్యాటక ప్రాజెక్టులకు మోక్షం

-వార్త సెంటర్‌స్ప్రెడ్‌లో..

ఇసుకాసురులపై ఉక్కుపాదం



కోటవురట్ల మండలంలో వరాహనదికి వెళ్లే దారికి గండి కొడుతున్న దృశ్యం

అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ఠ చర్యలు

అనధికార ఇసుక క్వారీల నిర్వాహకుల గురించి ఆరా

తవ్వకాల కట్టడికి పక్కా చర్యలు

దాడులు చేయాలని రెవెన్యూ, పోలీస్, భూగర్భ గనుల శాఖలకు ఆదేశాలు

ఇసుక వాహనం తొలిసారి పట్టుబడితే రూ.50 వేలు జరిమానా

జిల్లాలో పెద్దఎత్తున ఇసుక అక్రమ వ్యాపారం జరుగుతున్నది. ఒక్క క్వారీకి కూడా అధికారికంగా అనుమతి లేకపోయినా తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్న ధోరణిలో దందా సాగుతున్నది. దీనిని అడ్డుకొనేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో మాదిరిగా కాకుండా ఇకముందు ఇసుక తవ్వకాలు, రవాణాపై కొత్త విధివిధానాలను అమలులోకి తేనుంది.

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

జిల్లాలో ఇసుకాసురుల ఆగడాలను అడ్డుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసు శాఖలతో ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇకపై ఇసుక రవాణా చేస్తూ పట్టుబడితే

..మిగతా 6వ పేజీలో..



కుటుంబంలో ఘర్షణ..

ఇద్దరిపై చురకత్తితో దాడి

దాడి చేసింది ఇంటి పెద్ద

క్షతగాత్రులు కేజీహెచ్‌కు తరలింపు

10

కత్తి పోట్లు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్యపై హత్యాయత్నం

నర్సీపట్నంలో చికిత్స పొందుతున్న బాధితురాలు

10



మన్యంలో ముసురు

పలు మండలాల్లో వర్షం

ఖరీఫ్ పంటలకు అనుకూలమని రైతుల ఆనందం

3

చెరకు సాగులో అధిక దిగుబడులే లక్ష్యం

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ వేణుగోపాలరావు



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీఆర్ డాక్టర్ వేణుగోపాలరావు

అనకాపల్లి అగ్రికల్చర్ : చెరకు సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు విస్తరణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తున్నట్టు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎన్.వేణుగోపాలరావు తెలిపారు. పరిశోధన స్థానంలో గురువారం చోడవరం సహకార చక్కెర కర్మాగారం క్షేత్ర సిబ్బందికి చెరకు సాగుపై ఏర్పాటైన రెండు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధిస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ రైతులు పాటించే పద్ధతులపై కూడా ఫ్యాక్టరీల క్షేత్ర సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పిస్తామని వివరించారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.భరతలక్ష్మి మాట్లాడుతూ యాంత్రీకరణ, అంతరపంటలు, డ్రిప్ సాగు ద్వారా చెరకులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచే సాగు పద్ధతులపై విస్తృత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రైతులు అంతర పంటల ద్వారా 40శాతం అధిక ఆదాయం సాధిస్తున్నారన్నారు. చోడవరం ఫ్యాక్టరీ ప్రధాన వ్యవసాయాధికారి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఒంటికన్ను చెరకు నారు మొక్కలను వేయడం వలన మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ ఏడాది ఏడున్నర లక్షల నారు మొక్కలను ఫ్యాక్టరీ రైతులు నాటినట్టు చెప్పారు. 25 నుంచి 50 లక్షల నారు మొక్కల అవసరం ఉందని వివరించారు. క్షేత్ర సిబ్బంది ప్రతినిధి మధు మాట్లాడుతూ నీటి ఎద్దడిని తట్టుకొని మంచి కార్సి పంటనిచ్చే చెరకు వంగడాలను రూపొందించాలని కోరారు. పీఎస్‌పేటలో 97ఏ 85 రకం చెరకు చనిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం చెరకు సాగులో ఆధునిక పద్ధతులపై శాస్త్రవేత్తలు కేవీ రమణమూర్తి, ముకుందరావు, కిశోర్‌వర్మ, చారుమతి, చిత్కాళదేవి, భవానీ తదితరులు శిక్షణనిచ్చారు.

ఇగ్నో కోర్సుల ప్రవేశాలకు నేటితో గడువు పూర్తి

విశాఖపట్నం, ఆగస్టు 17:

ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) మాస్టర్స్, పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సులలో జూలై-2017 సెషన్ ప్రవేశాల గడువు శుక్రవారంతో ముగుస్తుందని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ ఎస్.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి, యానాం నివాసితులు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కాగా బీఏ, బీకాం, బీఎస్సీ, బీటీఎస్, బీఎస్‌డబ్ల్యు కోర్సులలో చేరాలనుకునే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎటువంటి ప్రవేశ రుసుములో చెల్లించనవసరం లేదని, రాయితీ కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థులు పూర్తి సమాచారం కోసం విశాఖలోని ఉషోదయ జంక్షన్‌లో వున్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని కానీ విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, గాజువాక, విజయనగరం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, అమలాపురం, రాజాం, తుని, అనకాపల్లిలలోని ఇగ్నో అధ్యయన కేంద్రాలను గాని సంప్రదించవచ్చని తెలిపారు. లేదా Website:https://onlin-eadmis-sion.igno.uac.in/admission సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 0891-2511200/300/400, 8499084428 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.



మత్స్య సంపదను విక్రయిస్తున్న మహిళలు

మత్స్యకార గ్రామాల్లో మహిళలే మహరాణులు. ఎందుకంటే ఇక్కడ కుటుంబ భారం పురుషులకు ఎంత ఉంటుందో.. అంతకు రెండింతలు ఆ ఇంటి గృహిణులు భుజాన వేసుకుంటారు. వేట సాగకపోయినా.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా.. చివరకు వేట నిషేధం విధించినా ఇంటిల్లిపాదినీ పోషించేది ఒకవిధంగా ఈమే. ఇంతలా శ్రమిస్తున్న ఈ ఇంటి దీపాలు తమ కంటి వెలుగులపట్లా చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. భర్త వేట నుంచి తెచ్చే మత్స్య సంపదను వీధుల్లో విక్రయించేందుకు వెళ్లేముందు తమ పిల్లల బాగోగులు, ఇంటిపని, వంటపని పూర్తి చేసుకున్న తరువాతనే నెత్తిన బుట్టపెడతారు. అయితే ఇటీవల కాలంలో వేట అంతగా కలిసి రాకపోవడంతో కొందరు మహిళలు సమీపంలోని సంస్థల్లో చేరి ఉపాధి పొందుతున్నారు.

మత్స్యకార కుటుంబాల్లో మణిదీపాలు

- అన్నీ తామై ఇంటిని చక్కదిద్దుతున్న అతివలు
- భర్త వేటాడి తెచ్చిన సంపదను విక్రయించడంలోనూ కీలక పాత్ర
- వేట సాగని రోజుల్లో వీరి రెక్కల కష్టంతోనే పూట గడిచేది

తరుణి



వివిధ సంస్థలలో విధులకు వెళ్తున్న మహిళలు

అచ్యుతాపురం : పూడిమడక.. అచ్యుతాపురం మండలంలో అతిపెద్ద గ్రామం. ఇక్కడ నివాసం ఉండేది 98 శాతం మత్స్యకారులే. ఈ కుటుంబాల పోషణలో మహిళలదే ఎక్కువ పాత్ర. పురుషులు వేటకు వెళ్లి చేపలను తెస్తుంటారు. ఇక్కడితో వారి పని అయి పోతుంది. తిరిగి మర్నాడు ఉదయం వేటకు వెళ్లే వరకు తమపని తమదే.

అన్ని పాత్రలూ వారివే!

ఈ కుటుంబాల్లో మత్స్యకార మహిళల పాత్రవేరు. ప్రతిరోజూ ఉదయాన్నే వంటచేసి, పిల్లలను బడికి పంపి తాను కూడా కూలి పనికి వెళ్తుంది. మరికొందరు మత్స్యకార మహిళలు గ్రామాల్లో తిరిగి పచ్చి/ఎండు చేపలు విక్రయిస్తుంటారు.

ఇంకొందరు మహిళలు గ్రామాల్లో ఉప్పును విక్రయిస్తారు. ఇలా మత్స్యకార మహిళలు ఖాళీగా ఉండకుండా ఏదో ఒక పనికి వెళ్తుంటారు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చి వంట వండుతారు.

చేప చిక్కకపోతే వీరి కష్టంతోనే కూడు

వేటకు సముద్రంలోకి వెళ్లిన పురుషులు చాలా సందర్భాల్లో వేట సాగక ఉత్తి చేతులతో తిరిగి వస్తుంటారు. కానీ మహిళలు మాత్రం ప్రతి రోజూ ఎంతోకొంత సంపాదిస్తారు. వేట నిషేధం సమయంతో పాటు తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాల వేళల్లో చేపల వేట సాగని సమయాల్లో మహిళల ఆదాయంతోనే వీరికి పూట గడుస్తుంది.



విక్రయానికి చేపలు సిద్ధం చేస్తున్న మహిళలు



బ్రాండిక్స్‌లో పనులకు వెళ్తున్న మహిళలు

ఉపాధి చూపిన బ్రాండిక్స్

బ్రాండిక్స్ కర్మాగారం మత్స్యకార మహిళలకు మంచి ఉపాధి చూపింది. కేవలం ఏడో తరగతి చదివితే చాలు వారికి కుట్టులో శిక్షణనిచ్చి ఉద్యోగాలను కూడా కల్పించింది. పూడిమడకలో కడపాలెం, కొండపాలెం, పెద్దూరు, పల్లిపేట, జాలారి పాలెం, ఎస్సీ కాలనీ శివారు గ్రామాలు. వీటిలో 14 వేలు జనాభా నివాసం. వీరిలో ప్రస్తుతం వెయ్యిమంది వరకు బ్రాండిక్స్ కర్మాగారంలో ఉద్యోగాలు చేస్తున్నారు. నెలకు రూ. 6 వేల నుంచి రూ.16 వేల వరకు జీతం పొందుతున్న మహిళలు కూడా ఉన్నారు. భర్త చనిపోయిన వారు ఈ కర్మాగారంలో పనిచేసి తమ పిల్లలను చదివించుకుంటున్నారు. అలాగే తలిదండ్రులు చనిపోయినవారు కూడా ఈ కర్మాగారంలో పనిచేసి తమ తోబుట్టువులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రతిరోజూ వీరు బస్సులపై విధులకు వెళ్లి తిరిగి ఆ వాహనాలపైనే ఇళ్లకు చేరుతున్నారు.

ఉప్పు గల్లీలు పోవడంతో ఉపాధికి దెబ్బ

పూడిమడకలో సుమారు 600 ఎకరాల్లో ఉప్పు పండించేవారు. ఉప్పు పంటలో మత్స్యకార మహిళలదే ప్రధాన పాత్ర. ఉప్పు మడులు తయారు నుంచి ఉప్పుపండిన తర్వాత కళ్లాల్లోకి చేర్చిన వర కు వీరు లేకుండా ఏ పనీ జరిగేది కాదు. దీంతో మత్స్యకార మహిళకు ఏడాదిలో ఎనిమిది నెలల నిరంతరాయంగా కూలి దొరికేది. అయితే ఉప్పుమడులు గల భూములన్నీ ప్రభుత్వానికి చెందినవే. లీజుకి తీసుకొని సాగుచేసేవారు. ప్రభుత్వానికి సక్రమంగా లీజు చెల్లించక పోవడంతో నాలుగేళ్ల నుంచి ఉప్పు తయారీని ఆపేసారు. దీంతో మత్స్యకార మహిళలకు ఉపాధి కరవైంది. అక్కడక్కడా ఈ గల్లీల ద్వారా నాలుగు రాళ్లు సంపాదిస్తున్నారు. వేట సరిగా సాగక, ఉప్పు గల్లీలు లేక ఇప్పుడు చాలా మంది మహిళలు ప్రత్యేక ఆర్థిక మండలిలో నిర్మించే కర్మాగారాల్లో చేరారు.



ఆధ్యాత్మికం

పంచామృతాభిషేకం పుణ్యప్రదం

ఉపమాక దేవస్థానం అర్చకుడు కృష్ణమాచార్యులు



ఏకాదశి తిథుల్లో పలు రూపాల్లో కొలువైన శ్రీహరి రూపాన్ని, క్షేత్రాలను దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని పండితులు చెబుతుంటారు. విశాఖ జిల్లా ఉపమాక క్షేత్రంలో కల్కి అవతారంలో గరుడాద్రి పర్వతంపై వేంకటేశ్వరస్వామి ఏకశిలపై స్వయంవ్యక్తమయ్యారు. అందువల్ల ఉపమాక వెంకన్న ఆలయంలో కొండపై నిత్యం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునే భక్తులు పంచామృతాభిషేకాలు చేయించుకోవడం వల్ల విజయాలు సిద్ధిస్తాయని వివరించారు. అందులోనూ ఏకాదశి పర్వదినాల్లో స్వామికి పంచామృతాలతో అభిషేకం చేస్తే ఆయన వరాలు కురిపిస్తారని చెప్పారు. ఉపమాక వేంకటేశ్వరుడి మొక్కులు చెల్లించుకునే భక్తులు కొండపై నున్న మూల విరాట్‌ను దర్శించుకోవడం ఎంతో మంచిదన్నారు. ఇక్కడ స్వామివారు షడ్భుజాలు, పంచాయుధాలతో అశ్వారూఢుడై వెళ్తున్నట్టుగా వెలిశారన్నారు. ఉపమాక క్షేత్రంలో ఆశ్వీయుజమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు తిలకిస్తే ఎంతో పుణ్యప్రదమన్నారు. బ్రహ్మోత్సవాలు, క్షీరాబ్ధిద్వాదశి నాడు తెప్పోత్సవం, ధనుర్మాసోత్సవాలు, వార్షిక కల్యాణోత్సవాలు, శ్రావణమాసం తిరువీధి సేవలతో పాటు పలు తిరునక్షత్రాలు ఇతర విశేషపూజా కార్యక్రమాలు ఉపమాక క్షేత్రంలో జరగడం వల్ల ఈ క్షేత్రాన్ని దర్శించుకున్న భక్తులకు పుణ్యం లభిస్తుందన్నారు.

- నక్కపల్లి

ఈ ఏడాది 12 వేల హెక్టార్లలో కాఫీ మొక్కలు

సాగు ప్రాంతానికి సమీపంలో నర్సరీలు
మన్యంలో మలేరియా తీవ్రత తగ్గింది
పాడేరు ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి


కిన్నెర్లలో కాఫీ మొక్కల నర్సరీని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి

చింతపల్లి: ఏజెన్సీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12 వేల హెక్టారుల్లో కాఫీ మొక్కలు, 15 వేల హెక్టారుల్లో కాఫీ తోటలకు నీడనిచ్చే మొక్కల పెంపకం చేపడుతున్నట్టు ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి తెలిపారు. ఆయన గురువారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో పర్యటించారు. తొలుత కిన్నెర్ల, అంతర్ల గ్రామాల్లో కాఫీ, నీడనిచ్చే మొక్కల నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎప్పటికప్పుడు నాటేలా చర్యలు చేపడతామన్నారు. గతంలో మాదిరిగా కాకుండా, ఎక్కడికక్కడ నర్సరీలను ఏర్పాటు చేసి, కాఫీ మొక్కలు, నీడనిచ్చే చెట్ల మొక్కలను పెంచి, రైతులకు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల రవాణా ఖర్చు ఆదా అవుతుందని, ఒక్క మొక్క కూడా వృథాకాదని ఆయన తెలిపారు.

మలేరియా తీవ్రత తగ్గింది

ఏజెన్సీలో మలేరియా అదుపులోకి వచ్చిందని ఐటీడీఏ పీవో తెలిపారు. చింతపల్లి సామాజిక ఆరోగ్యం కేంద్రాన్ని సందర్శించారు. వార్డుల్లో, నవజాత శిశు సంరక్షణ కేంద్రం అందుతున్న వైద్యసేవలు, అందుబాటులోనున్న మందుల గురించి అడిగారు. ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జూన్, జూలైలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యాయని, ప్రస్తుతం బాగా తగ్గాయని చెప్పారు. పిన్‌పాయింట్ కార్యక్రమాన్ని పక్కాగా అమలుచేయడంతోపాటు, సిబ్బంది ఖాళీలను భర్తీచేయడం వల్ల సకాలంలో వైద్యసేవలందుతున్నాయన్నారు. చింతపల్లి ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నారని, వైద్యులు స్థానికంగా నివాసం వుంటే, రోగులకు 24 గంటలూ వైద్య సేవలు అందుతాయని ఆయన అన్నారు. నూతనంగా నిర్మించిన వైద్యుల నివాస సముదాయానికి ప్రహరీ గోడ నిర్మించాలని ఈ సందర్భంగా వైద్యులు ఆయనను కోరారు.

ఈ కార్యక్రమంలో డీసీఎస్ టి.మహేశ్వరరావు, వైద్యాధికారులు రఘురామ్, సువర్ణ, వరప్రసాద్, మణమ్మ, కాఫీ ప్రాజెక్టు ఏడీ రాధాకృష్ణ, ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్, టీడబ్ల్యు డీఈ డీవీఆర్ఎం రాజు పాల్గొన్నారు.

సదా మీ సేవలో... ఆంధ్రజ్యోతి

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు.
మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

• అనకాపల్లి • కశింకోట 9985411812	• యలమంచిలి • అచ్యుతాపురం • రాంబిల్లి 9542278400	• పాయకరావుపేట • నక్కపల్లి • అడ్డరోడ్డు 9948611774	• నర్సీపట్నం • పెదబొడ్డేపల్లి • మాకవరపాలెం 9985411534
• చింతపల్లి • కె.డి.పేట 9491620354	• చోడవరం • వడ్డాది • మాడుగుల 8919021155	• సబ్బవరం • కె. కోటపాడు • టిడికాడ 9704538446	• పాడేరు • అరకు 9494370095

ఇట్లు
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్

కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించాలి

మంత్రి కామినేని శ్రీనివాస్‌కు పీఆర్‌టీయూ నేతల వినతి


మంత్రి కామినేనికి వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నేత డి.జి.నాథ్

నర్సీపట్నం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం లభించేలా చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.జి.నాథ్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌ను కోరారు. గురువారం ఇక్కడ ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చిన ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. అపోలో, కేర్ వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద వైద్యసేవలు అందించేందుకు నిరాకరిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని పరిశీలించి తగుచర్యలు తీసుకుంటామని మంత్రి కామినేని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పీలాతో అభిప్రాయభేదాలు లేవు

-ఎంపీ ముత్తంశెట్టి



అనకాపల్లి: ఎమ్మెల్యే పీలా గోవిందతో తనకు ఎటువంటి అభిప్రాయభేదాలు లేవని ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, ఎమ్మెల్యే, తాను నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు. తమ మధ్య అభిప్రాయభేదాలు రావడానికి కారణాలంటూ ఏమీ లేవన్నారు. తనకు ఎవరితోనూ ఎటువంటి విభేదాలు లేవని, పీలా గోవింద సత్యనారాయణతో అసలే లేవని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా తమ మధ్య అభిప్రాయభేదాలు సృష్టించాలని ప్రయత్నిస్తే వారి ప్రయత్నాలు ఫలించవన్నారు. తమ మధ్య మంచి అవగాహన ఉందని ఆయన పేర్కొన్నారు.

జగ్గారావుకు జీవన సాఫల్య పురస్కారం

అనకాపల్లి: ప్రముఖ పిలాటలిస్టు(పోస్టల్ స్టాంపుల సేకరణ) కాండ్రేగుల జగ్గారావుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి 'జీవన సాఫల్య పురస్కారం' లభించింది. ఎనిమిది పదుల వయస్సున్న ఆయన 1947 నుంచి 1981 మధ్య కాలంలో విడుదలైన స్టాంపులను సేకరించారు. అలాగే 15-8-1947న జైహింద్ తొలికవర్ మొదలుకొని 29-1-1981న 5వ ప్రపంచ కప్ హాకీ క్రీడల సందర్భంగా ఆవిష్కరించిన కవరు వరకు సేకరించారు. సుమారు 700లకుపైగా వివిధ సందర్భాల్లో ఆవిష్కరించిన పోస్టల్ స్టాంపులను కూడా సేకరించారు. ఈయన కృషిని గుర్తించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు.



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందజేసిన పత్రం. (ఇన్‌సెట్‌లో) అప్పారావు

ANDHRA JYOTHI CLASSIFIEDS

BUSINESS OFFER
LOANS
★ DHPPL NBFC Company registered by RBI .Provides Agriculture, Business, Project, Personal, Education, Mortgage Loans, Contact:7087000606
AJH_281

REAL ESTATE
PLOTS FOR SALE
☞ విజయవాడ, బెంజిసర్కిల్‌కి కేవలం 6 కి.మీ. దూరంలో అవనిగడ్డ బైపాస్‌రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్ దగ్గర ప్లాట్లు చ.గ. రూ. 4,900/-, 8,200/- మీ సొంతం. సెల్ : 93906 65999
AJB_424

ప్రభుత్వంచే గుర్తించి 20 సంIIలు 5 రాష్ట్రాలలో AP లో 200 బ్రాంచీలు కలిగిన YMMC వివిధ గ్రేడులలో పనిచేయుటకు 10th,ఇంటర్,డిగ్రీ చదివిన 50 స్త్రీ/పు ఉచిత శిక్షణలో 5500+ఫ్రీ రూం తరువాత ASM,BM గా 20,000+2 వీలర్ కలదు.ఇంటర్వ్యూ:ఈరోజు,రేపు. 9000700524
AJS

పాఠకులకు సూచన:
క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు.
ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.
బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.
పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్

For Classifieds Contact :
9985411644

మన్యంలో ముసురు

పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం ● ఖరీఫ్ పంటకు మేలు చేస్తుందంటున్న గిరిజన రైతులు


అరకులోయలో భారీ వర్షం...

పాడేరు: ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో ఏజెన్సీ ప్రాంతంలో గురువారం ముసురు తరహా వాతావరణం నెలకొంది. గత రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతంగా వుండగా, గురువారం నిరంతరాయంగా చినుకులు పడ్డాయి. మధ్యాహ్నం తరువాత వర్షం ఎక్కువైంది. దీంతో రహదారులపై జన సంచారం బాగా తగ్గిపోయింది. జన సంచారంతో రద్దీగా ఉండే అంబేడ్కర్ కూడలి, మెయిన్ రోడ్డు సైతం నిర్మానుష్యంగా మారాయి. పట్టణంలోని రహదారులు చిత్తడిగా మారాయి. ఏజెన్సీలోని అన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు ఖరీఫ్ పంటలకు ఎంతో మేలు చేస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు అంటున్నారు.

డుంబ్రిగుడలో భారీవర్షం

డుంబ్రిగుడ: మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. గురువారం భారీ వర్షం పడింది. మండల కేంద్రంలో వీధులన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో వర్షపు నీటితో కాలువలు నిండిపోయి రోడ్లపై ప్రవహించాయి. కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు వర్షం ఎంతో మేలు చేస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి, సామ, చోడి, వేరుశనగ పంటలకు మంచి అదనులో వర్షం పడిందని, దీంతో దిగుబడులు పెరిగే అవకాశం వుందని అంటున్నారు.


డుంబ్రిగుడలో పచ్చగా కళకళలాడుతున్న పంట పొలాలు

మబ్బులు కమ్ముకున్న పాడేరు


అరకులోయలో.....

అరకురూరల్: అరకులోయలో గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11.30 గంటల వరకు భారీ వర్షం పడింది. సుమారు రెండున్నర గంటలపాటు ఏకధాటిగా వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గెడ్డల్లో వరద నీరు ప్రవహించింది. మధ్యాహ్నం తరువాత ముసురు వాతావరణం నెలకొంది. సాయంత్రం వరకూ జల్లులు పడుతూ వుండడంతో పట్టణంలో జన సంచారం బాగా తగ్గిపోయింది. పంట పొలాల్లో పుష్కలంగా నీరు చేరడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెదబయలులో....

పెదబయలు: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు తిరిగి గ్రామాలకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. గెడ్డలు పొంగడంతో మారుమూర గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. పంట పొలాల్లో నీరు చేరడంతో ఖరీఫ్‌కు ఇబ్బంది వుండదని రైతులు అంటున్నారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, ఉత్సవాలు... తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి

విలేకరుల ఫోన్ నంబర్లు

అరకులోయ	94408 67497	డుంబ్రిగుడ	94918 02681
అరకు రూరల్	94401 13448	హుకుంపేట	8500097775
అనంతగిరి	73828 27555	ముంచంగిపుట్టు	94928 19993
అనంతగిరి రూరల్	94411 79874	పెదబయలు	94923 44301

ఇలా మొదలు పెట్టి.. అలా ముగించేశారు

డుంబ్రిగుడ మండల సర్వసభ్య సమావేశం ● అధికారుల డుమ్మాతో ప్రజా ప్రతినిధుల ఆగ్రహం



సమావేశ మందిరంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఖాళీ కుర్చీలు



ఒంటిగంటకు సమావేశం మొదలైన సమావేశ దృశ్యం

డుంబ్రిగుడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం ఈసారి తూతూ మంత్రంగా ముగించేశారు. గురువారం స్థానిక ఎంపీపీ వి.జమున అధ్యక్షతన ఒంటిగంటకు మొదలు పెట్టి ప్రజా సమస్యలు చర్చించకుండానే 'మమ' అయిందనిపించారు. ఈ సమావేశానికి స్థానిక ఎంపీడీవో సిబ్బంది ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమావేశం నిర్వహిస్తున్నట్టు ముందుగా సమాచారం అందించాల్సి ఉంది. అయితే ఇక్కడి ఎంపీడీవో సిబ్బంది నిర్వాకంతో ఎవరికి ఎటువంటి సమాచారం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి పొరపాట్లు రాబోయే సమావేశంలో పునరావృతం చేయరాదని ప్రజాప్రతినిధులు కొందరు మండిపడ్డారు. ఉదయం 10 గంటలకు సమావేశం మొదలు పెట్టి మధ్యాహ్నం 12 గంటలకు ముగించాల్సిన సమావేశం మధ్యాహ్నం ఒంటి గంట కావస్తున్నా ప్రారంభం కాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సమావేశానికి పాల్గొన్న కొందరు ప్రజాప్రతినిధులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. మరికొన్ని శాఖ అధికారులు డుమ్మా కొట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఎం.కుజ్జమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ తహసీల్దార్ జయ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజుపాక గ్రామంలో స్ప్రేయింగ్

దోమల నివారణకు చర్యలు

అనంతగిరిరూరల్: వర్షాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో దోమల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది. ప్రతీ ఏటా మూడు దఫాలుగా నిర్వహించే మలాథీన్ స్ప్రేయింగ్ పర్యవేక్షణ బాధ్యతను పంచాయతీలకు ఈఏడాది అప్పగించడంతో రెండు శాఖల మధ్య సమన్వయం లోపించి మొదటి విడత స్ప్రేయింగ్ సక్రమంగా చేపట్టలేదు. దాంతో గ్రామాల్లో దోమల బెడద విపరీతంగా పెరిగి జ్వరాల తీవ్రత పెరిగింది. ఈ నేపథ్యంలో స్ప్రేయింగ్ బాధ్యతను మలేరియా నిర్మూలనా అధికారులకే అప్పగించారు. దాంతో రెండో విడత స్ప్రేయింగ్ పనులు మండలంలో ముమ్మరం చేస్తున్నారు. మండలంలోని పినకోట, అనంతగిరి, భీమవరం, లుంగపర్తి పీహెచ్‌సీల పరిధిలో మలేరియా సబ్‌యూనిట్ అధికారులు స్ప్రేయింగ్‌ను ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రతీ ఒక్కరు ఇంటిలోపల సైతం స్ప్రేయింగ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిలిచిన బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు

ముంచంగిపుట్టు/పెదబయలు: ముంచంగిపుట్టు, పెదబయలు పరిసర ప్రాంతాలలో గురువారం బీఎస్ఎన్ఎల్ సమాచార వ్యవవస్థ మూలకు చేరుకుంది. దీంతో సెల్‌వన్, బ్రాడ్‌బ్యాండ్, ఇంటర్నెట్ సేవలు మూగనోము దాల్చాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ తరచూ అంతరాయం ఏర్పడుతోంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. మీ సేవ కేంద్రాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ పనులు కొనసాగకపోవడంతో గిరిజనులు నిరాశతో వెనుదిరిగారు. తరచూ బీఎస్ఎన్ఎల్ సమాచార వ్యవస్థ మూగనోము దాలుస్తున్నా ఆ శాఖ అధికారులు శాస్వత పరిష్కారం చేపట్టడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. అలాగే సమాచార వ్యవస్థ స్తంభించడంతో 108 సేవలు దూరమవుతున్నారు. ఈ నేపథ్యలో ఆ శాఖ అధికారులు గాఢ నిద్రను వీడి సమాచార వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

జీఎస్టీ విధానంతో బడాబాబులకే మేలు

● ఉత్తరాంధ్ర ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ అజశర్మ



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర ప్రజా ఆరోగ్యవేదిక కన్వీనర్ అజశర్మ

అరకురూరల్, ఆగస్టు 17: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీఎస్టీ విధానం బడాబాబులకు మాత్రమే అనుకూలంగా ఉందని ఉత్తరాంధ్ర ప్రజా ఆరోగ్య వేదిక కన్వీనర్ అజశర్మ అన్నారు. మరోవైపు సామాన్య ప్రజలు, చిరు, మధ్య తరగతి వ్యాపారులకు తీవ్ర నష్టం తెచ్చే విధంగా ఉందని వ్యాఖ్యానించారు.

గురువారం సాయంత్రం స్థానిక గిరిజన్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో మాత్రమే అమల్లో ఉన్న ఈ వస్తుసేవల పన్నును.. అత్యధిక పేద, మధ్యతరగతి ప్రజానీకం, వర్తకులుండే మనదేశంలో అమలు చేయడం సరైన విధానం కాదన్నారు. జీఎస్టీ వల్ల సామాన్య ప్రజానీకం నిత్యం వినియోగించే నిత్యవసర సరుకులు, దుస్తులు, ఇతర దినుసులపై పన్నుభారం అధికంగా మోపారన్నారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే మద్యం, పెట్రోల్, డీజిల్‌పై మాత్రం జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే సీపీఎం కేంద్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు సీతారాం ఏచూరి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో జీఎస్టీ ప్రభావం సామాన్య, మధ్య తరగతి వారిపై ఏ విధంగా నష్టదాయకంగా ఉందో సభ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. అత్యధిక ప్రజానీకం వినియోగించే వాటిపై పన్ను మినహాయింపులు ఇవ్వాలని సూచించారని తెలిపారు. ఇందుకు అన్ని వర్గాల వారు ఏకతాటిపై వచ్చి పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ఈ సదస్సుకు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి రఘునాథ్ అధ్యక్షత వహించగా అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అమ్మన్న, గాసి, మహేష్, సత్యనారాయణ, ప్రజాసంఘాల ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, బాలదేవ్, రామారావు, వర్తక సంఘం ప్రతినిధులు బేతా రాజారావు, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు

మంత్రి ఆదినారాయణరెడ్డి గిరిజనులకు క్షమాపణ చెప్పాలి: వైసీపీ డిమాండ్

డుంబ్రిగుడ: గిరిజనుల పట్ల అనుచిత వ్యాఖ్యాలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డి గిరిజనులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని వైసీపీ డిమాండ్ చేసింది. ఈ విషయమై పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి శెట్టి వినయ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కమ్మిడి ఆశోక్‌కుమార్ గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఉన్న దేశం పార్టీ ప్రజాప్రతినిధులు గిరిజన ప్రజల పట్ల మంత్రి ఆదినారాయణరెడ్డి చేస్తున్న అనుచిత వ్యాఖాలను ఖండించాలని అన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే గిరిజనులకే గిరిజన శాఖ మంత్రి పదవీ ఇచ్చి ఉండేవారన్నారు. గిరిజన సంపద దోచుకోవడానికే అరకులోయ మండలం పెదలబుడుని చంద్రబాబు దత్తత తీసుకుని సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుల శెట్టి వెంకటరావు, భీమరాజు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణానికి మేలు

పాడేరు: వనం-మనం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలను నాటడం వల్ల పర్యావరణానికి మేలు చేకూరుతుందని ఇన్‌చార్జి జిల్లా మలేరియా నివారణ అధికారి కుమార్ అన్నారు. స్థానిక డీఎంవో కార్యాలయ ఆవరణలో గురువారం వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న సుమారు అర ఎకరం ప్రదేశంలో వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం డీఎంవో మాట్లాడుతూ, అవకాశం ఉన్న మేరకు అధిక సంఖ్యలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా అందరూ కృషి చేయాలని కోరారు. అలాగే తమ కార్యాలయ ఆవరణలో నాటిన మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించాలని సిబ్బందికి ఆయన సూచించారు.

త్వరలో ఆశ్రమ విద్యార్థులకు బూట్లు

పాడేరు: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ఈ ఏడాది బూట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్పొరేట్ విద్యాలయాల తరహాలో ఉండాలనే ఆలోచనతోనే విద్యార్థులకు బూట్లను ఇవ్వాలని యోచించింది. అదే జరిగితే మన్యంలోని 37 వేల మందికి లబ్ధి చేకూరుతుంది.

ఏజెన్సీలోని 11 మండలాల్లో 122 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యాలయాల్లో సుమారు 37 వేల మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వారికి భోజన, వసతులతో పాటు చెప్పులు, పుస్తకాలు, యూనిఫారాలు, కాస్మోటిక్స్ వంటివి ప్రస్తుతం అందిస్తున్నారు. తాజాగా బూట్లు కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామం.

ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు సైతం కార్పొరేట్ తరహా అనుభూతికి కలిగించాలనే లక్ష్యంతో ఈ ఏడాది ఒక జత బూట్లను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం కాన్వెంట్‌లు, కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులు బూట్లు వినియోగిస్తున్నారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల్లోని విద్యార్థులకు వాటిని అందిస్తే వారు ఆనందం, ఉత్సాహంగా ఉండటంతో పాటు తల్లిదండ్రులు సైతం తమ బిడ్డలు చక్కని వస్త్రధారణతో ఉన్నారని గర్విస్తారనేది అధికారుల భావన.

పుట్టిన రోజు, షష్టిపూర్తి, స్వదేశాగమనం, వర్ధంతి, శ్రద్ధాంజలి
సందర్భం ఏదైనా... మీ బంధువులకు, మిత్రులకు త్వరితగతిన సమాచారాన్ని అందించాలంటే 'ఆంధ్రజ్యోతి' లో ప్రకటన ఇవ్వండి!
94917 64122



దెబ్బతిన్న ముంతగుమ్మి కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



పెద్దాపుట్టు కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

గిరిజనులకు తప్పని రవాణా కష్టాలు

చినుకుపడితే రహదారులు జలమయం ● కల్వర్టులు అధ్వానం

ముంచంగిపుట్టులో 166 గ్రామాలు 'జల దిగ్భంధం'

అంబులెన్సులూ వెళ్లలేని దుస్థితి ● కొన్ని సందర్భాలలో నడవాలన్నా కష్టమే

ముంచంగిపుట్టు: మండల కేంద్రం మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు చినుకు పడితే చాలు చెరువులుగా మారిపోతున్నాయి. ప్రధాన రహదారులపై పలు చోట్ల కల్వర్టులపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే వరదనీటి ఉధృతికి కల్వర్టులు రూపుమారిపోయి అధ్వానంగా మారుతున్నాయి. దీంతో మండల పరిధిలో పలు గ్రామాల ప్రజలు వర్షాకాలంలో ప్రతీ ఏడాది సుమారు నాలుగు నెలలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు తమకేమీ పట్టదన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చినుపడితే చాలు సుమారు 166 గ్రామాల ప్రజల రాకపోకలకు అవరోధం ఎదురవుతోంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు మండల కేంద్రం మీదుగా కుమడ వెళ్లే మార్గం మధ్యలో గల పెద్దాపుట్టు, డేగలపుట్టు, కరిముక్కిపుట్టుతో పాటు లబ్బూరు నుంచి లక్ష్మీపురం వెళ్లే మార్గం మధ్యలో గల లబ్బూరు, కర్లాపొదర్, ముంతగుమ్మి, బరడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల కల్వర్టులపై నుంచి వరదనీరు చెరువులను తలపిస్తూ ఉధృతంగా ప్రవహిస్తుండడం సాధారణ అంశంగా మారింది. దీంతో అటుగా వాహన రాకపోకలు సాగించడం కష్టంగా మారుతోంది. కల్వర్టులపై నుంచి వరదనీరు ప్రవహించడం, వరదనీరు ఉధృతికి కల్వర్టులు దెబ్బతినడంతో పాదచారులు సైతం కల్వర్టులు దాటలేని దుస్థితి నెలకొంది. ప్రతీ ఏడాది వర్షాకాలం వచ్చిందంటే చాలు వందలాది గ్రామాల ప్రజల గుండెల్లో దడమొ



లబ్బూరు సమీపంలో చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి (ఫైల్)

దలవుతోంది. ఏ చిన్నపాటి అవసరానికైనా ప్రమాదభరిత ప్రయాణం సాగించాల్సిన దుస్థితి నెలకొంటుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టులపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో పాటూ మత్స్యగెడ్డ పాయలపై నూతన కల్వర్టుల నిర్మాణం పనులు ప్రజాప్రతినిధులు, అధికారుల వాగ్దానాలు దాటి ముందుకు సాగడంలేదు. పర్యవసానంగా చిన్న పాటి చినుకుపడితే గిరిజనులు ఇళ్లకే పరిమితం అవ్వాల్సిన దుస్థితి నెలకొంది. గెడ్డలు దాటడమే కష్టంగా ఉంటున్న తరుణంలో కల్వర్టులపై నుంచి ప్రవహిస్తున్న వరదనీటిని దాటడం గోరుచుట్టుమీద రోకలిపోటుగా ఉంటుందని గిరిజనులు వాపోతున్నారు. వర్షాలు పడితే నిత్యావసర సరకులకు, వారపు సంతలకు, ఇతర పనుల నిమిత్తం పంచాయతీ, మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు. 108 అంబులెన్స్ వంటి అత్యవసర సేవలకూ దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల కల్వర్టులపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో గిరిజనులు రాకపోకలు స్తంభించిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లక్ష్మీపురం సమీపంలోని ముంతగుమ్మి కల్వర్టు దెబ్బతినడంతో సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలకు అవరోధం ఏర్పడిందన్న విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు ఆ కల్వర్టును స్వయంగా పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరలో జరిగే విధంగా చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వాగ్ధానం త్వరితగతిన అమల్లోకి వచ్చే విధంగా చూడాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు. అలాగే దెబ్బతిన్న కల్వర్టుల బాగోగులపై అధికారులు శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

వనిత కార్డులతో ప్రయాణంలో రాయితీ

ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్

పాడేరు రూరల్: వనితా కార్డుల వల్ల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి పది శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ఆర్టీసీ డీఎం కె.రమేష్ తెలిపారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితాలను సేకరించి ఆర్టీసీ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కుటుంబంలో ఉన్న సభ్యులు అందరికీ వనితా కార్డును అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంటి యజమానికి రూ.100కు వనితాకార్డును అందించడంతో పాటు కుటుంబంలో ఉన్న మరో నలుగురు సభ్యులకు రూ.20కే కార్డును ఇస్తామన్నారు. వనితా కార్డు పొందిన సభ్యులకు రెండేళ్ల పాటు పది శాతం రాయితీపై తెలుగు వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు.

రెండో రోజుకు తపాలా ఉద్యోగుల సమ్మె

అరకురూరల్: అరకులోయలో తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె రెండవ రోజూ కొనసాగింది. సబ్ పోస్టాఫీస్ ఎదుట తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఈ నిరవధిక సమ్మె ఆపేది లేదని తపాలా ఉద్యోగుల ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను ప్రభుత్వం గుర్తించాలని, పే కమిటీ నివేదికను అనుసరించి తమ జీతాలు పెంచాల్సిందేనని పేర్కొంటున్నారు. ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం న్యాయం కాదని, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని



నినాదాలు చేస్తున్న తపాలా సిబ్బంది

కోరుతున్నారు. ఈ నిరసనలో అరకు సబ్‌పోస్టాఫీస్ పరిధిలో పనిచేసే బీపీఎంలు ఎస్.త్రినాథ్‌రావు, కొర్రా ప్రసాద్, బి.బుచ్చయ్య, ఆర్.చంద్ర, ఎల్‌బీ భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ దూర విద్య ప్రవేశాలు

అరకురూరల్: ఏయూ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డిగ్రీ, పీజీ అడ్మిషన్స్ జరుగుతున్నాయని ఆయా కోర్సులపై ఆసక్తి ఉన్న వారు ప్రవేశాలకు పాల్గోవాలని అరకులోయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలు రాసిన అభ్యర్థుల ఇళ్లకే అడ్మిషన్ అప్లికేషన్ రానున్నదని తెలిపారు. అలాగే ఇంటర్ పాసైన విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి డిగ్రీలో ప్రవేశాలు పొందేందుకు కళాశాలలో సంప్రదించాలన్నారు. డిగ్రీ పాసైనవారు పీజీలో ప్రవేశం పొందేందుకు అప్లికేషన్ ్స అందుభాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ విషయాలను గుర్తించి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు డిస్టెన్స్ ఎడ్యుకే షన్ కో-ఆర్డినేటర్ కె.బాలరాజు, టి.రాంబాబులను సంప్రదించాలన్నారు. సెల్ నెంబర్లు 9494376648, 7382122469 లను సంప్రదించాలన్నారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు

● 59 మంది అభ్యర్థుల హాజరు



అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

అనంతగిరి: అర్హులకే రుణాలు మంజూరు అయ్యేలా చర్యలు చేపడతామని ఎంపీపీ గుజ్జెల పైడితల్లి అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో గల పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఇంటర్వ్యూలను గురువారం నిర్వహించారు. ఎస్సీ, బీసీ, ట్రైకార్ ఎస్టీ అబ్యర్థులు అందరికీ ఎస్‌బీఐ మేనేజర్ శ్యాంసుందర్, ఎంపీడీవో రమేష్‌రామన్ ఇంటర్వ్యూ చేశారు. ట్రైకార్ రుణాలకు 40 మంది అభ్యర్థులు, బీసీ రుణాలకు 10, ఎస్సీ రుణాలకు 9 మంది హాజరయ్యారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించిన బ్యాంకు మేనేజర్, ఎంపీడీఓ తుది జాబితాను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శిరగం దేముడు, గ్రామీణ విస్తరణ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి: ఎంపీడీవో

అనంతగిరి: పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఎంపీడీఓ రమేష్ రామన్ సూచించారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో మనగ్రామం మనవిశాఖ కార్యక్రమంలో భాగంగా



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

గురువారం.. కాశీపట్నం గ్రామంలో కలియ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామంలో ఆరోగ్య పరిస్థితులు పై ఆరా తీశారు. మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కాగా తాగునీరు సరిపడా రావడంలేదని ట్యాంకు కెపాసిటీ పెంచాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్థానికంగా గుర్తించిన సమస్యలపై సంబందిత అధికారులకు నివేదికలు పంపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శిరగందేముడు, కార్యదర్శి ప్రసాద్, వీఆర్‌వో అప్పలస్వామి, ఏఎమ్‌సీ డైరెక్టర్ పుష్పానందం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు మీజిల్స్- రుబెల్లా టీకాలు

డుంబ్రిగుడ, ఆగస్టు 17: మండలంలోని స్థానిక పీహెచ్‌సీ పరిధిలో మీజిల్స్(తట్టు), రుబెల్లా వ్యాధులకు సంబంధించి ఎంఆర్ టీకాలను గిరిజన చిన్నారులకు గురువారం వేశారు. కొర్రా, కితలంగి పంచాయతీ కేంద్రాలతో పాటు కొర్రా పంచాయతీ పరిధిలో ఉన్న బుడుమలపుట్టు గ్రామాల్లోనూ.. టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి శాంతికిరణ్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క చిన్నారులకు తప్పకుండా వారివారి తల్లిదండ్రులు ఈ టీకాలను వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ శాంతమణి, హెల్త్ ఆసిస్టెంట్‌లు ఎస్.స్వామి, కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఇసుకాసురులపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

చట్టపరమైన చర్యలు మరింత కఠినతరం చేయాలని నిర్ణయించారు. గతంలో అనుమతి లేకుండా రవాణా చేస్తూ పట్టుబడిన ట్రాక్టర్ యజమానికి రూ.5వేల వరకు జరిమానా విధించి ఒక్కరోజు విరామంలో వాహనాన్ని వదిలేసేవారు. ఇప్పుడు కొత్తగా అమలు జరుగుతున్న విధానంతో ఇసుక వాహనం మొదటిసారి పట్టుబడితే పది రెట్లు అదనంగా జరిమానా చెల్లించేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. రెండోసారి, మూడోసారి పట్టుబడితే మరింతగా జరిమానా విధించాలని నిర్ణయించారు. అంతేకాకుండా పట్టుబడిన వాహనం లైసెన్సులను రద్దు చేసేందుకు సిఫార్సు చేసేలా నిబంధనలు అమలులోకి తేనున్నారు. ఇప్పటికే రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయకృష్ణ రంగారావు ఈ మేరకు మంత్రివర్గంలో చర్చించి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు జరిగేలా విధివినానాలు రూపొందించారు.


ప్రభుత్వ నిర్మాణాల ముసుగులో...

జిల్లాలో పాఠశాలలు, అంగన్‌వాడీ, పంచాయతీ భవన నిర్మాణ పనులు అన్ని మండలాల్లో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఆయా నిర్మాణాలకు ఇసుక స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుకోవచ్చనే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. దీనికిగాను ఇసుక ఎంత అవసరమో, ఆ మేరకు నిల్వలు రవాణా చేసుకొనేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు అనుమతి ఇవ్వవచ్చు. దీన్నే కొందరు ఇసుకాసురులు తమకు అనుకూలంగా చేసుకొన్నారు. ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుక రవాణా ముసుగులో బయట అమ్మకాలు జరుపుతూ జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వం గతేడాది ఉచిత ఇసుక పాలసీని అమలులోకి తేవడంతో జిల్లాలో శారదా, వరహా, తాండవ, కోనాం, పెద్దేరు, సర్పా, బొడ్డేరు, గోస్తని నదుల పరివాహక ప్రాంతాల్లో ఇసుక నిల్వలు కొరత ఉందని భూగర్భ గనుల శాఖ ప్రకటించింది. ఈ కారణంగా జిల్లాలోని 43 మండలాల్లో ఎక్కడా ఇసుక తవ్వకాలకు ఏ ఒక్కరికీ అనుమతి ఇవ్వలేదని ఆశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా, ఇసుక నుంచి కాసులు పిండుకోడానికి అలవాటు పడిన కొందరు ఇసుకాసురులు మాత్రం అనుమతులు లేకపోయినా క్వారీలు ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా తవ్వకాలు, రవాణా కొనసాగిస్తున్నారు. శారదా నది ప్రాంతంలో శీలానగర్, దిబ్బపాలెం, తుమ్మపాల, ఎంకుపాలెం, మూలపేటల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అదేవిధంగా వరహానది పరిసర గ్రామాలైన ఉప్పలం, దొర్లపూడి, సోముదేవుపల్లి, పెనుగల్లు, చోడవరం పరిసరాల్లోని భోగాపురం, గౌరీపట్నం, గజపతినగరం, లక్కవరం, రామరాజుపేట, వడ్డాది, మాడుగుల పరిసరాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు అధికారులకు సమాచారం ఉంది. ఆయా ప్రాంతాల్లో తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం ఎంతో ఉదాత్త ఆశయంతో అమలులోకి తెచ్చిన ఉచిత ఇసుక పథకం అమలు అంతంత మాత్రమే కావడం, దీనికితోడు ప్రభుత్వానికి పైసా ఆదాయం రాకపోగా ఇసుక మాఫియా సొమ్ము చేసుకొంటోంది.

ఇకపై చర్యలు తీవ్రం...

ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వ ఆదేశంతో జిల్లా అధికారులు దృష్టి సారించారు. ఇకపై ఇసుక మాఫీయాపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా అక్రమాలను అడ్డుకోవాలని నిర్ణయించారు. విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, కేసులు నమోదు చేయాలని రెవెన్యూ, పోలీసు, భూగర్భగనుల శాఖ విజిలెన్స్ విభాగం అధికారులను జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఇకపై నిర్మాణ స్థలంలో కాకుండా ఖాళీస్థలాల్లో ఇసుక పోగులు వేసుకొని నిల్వ చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ నిల్వలపై నిఘా పెట్టి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదుతోపాటు గతం కంటే పదిరెట్లు జరిమానా అధికంగా విధించనున్నారు. గ్రామీణ మండలాల్లో గతంలో రూ.5 వేలు జరిమానా విధిస్తే ఇకముందు రూ.50 వేల వరకు జరిమానా విధిస్తారు. జిల్లాలో అనకాపల్లి, చోడవరం నుంచి విశాఖకు ఇసుక రవాణా ఛార్జీల పేరుతో భారీ మొత్తంలో ఇసుక రవాణాదారులు గుంజుతున్నారు. పట్టుమని పది కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన అవసరం లేకపోయినా రవాణా ఖర్చుల పేరుతో పిండుతున్నారు. ట్రాక్టరు లోడ్ ఇసుకకు రూ.6 వేలు, లారీలోడుకి రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు గుంజుతున్నారు. దీంతో ప్రైవేటు భవన నిర్మాణాలు చేపట్టేవారికి ఇసుక ఉచితంగా వస్తున్నా రవాణా ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నది. ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందజేస్తున్నా లబ్ధిదారులకు చేతిచమురు వదిలించుకోవడం తప్పడం లేదు. ప్రస్తుతం ఇసుక రవాణకు అయ్యే ఖర్చులను బట్టి అధికారులే గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం ఉండేలా ధర నిర్ణయించి అమలులోకి తేనున్నారు. కొద్దిరోజుల్లోనే అమలులోకి రానున్న కొత్తవిధానంతో ఇసుక రవాణాకు అధిక మొత్తం చెల్లించుకోవాల్సిన అవసరం ఉండదని, ఇసుక రవాణా చేస్తూ పట్టుబడితే అధిక మొత్తం జరిమానా చెల్లించుకోవాల్సి ఉండడంతో రవాణాదారులు వెనకడుగు వేస్తారానే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.













విచారణకు గడువు కోరాం

'ఆంధ్రజ్యోతి'తో సిట్ ముఖ్య అధికారి వినీత్ బ్రిజ్‌లాల్

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

విశాఖ భూకుంభకోణంపై దర్యాప్తునకు మరో రెండు నెలల సమయం అవసరమని, ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం వున్నదని సిట్ ముఖ్య అధికారి వినీత్‌బ్రిజ్ లాల్ తెలిపారు. ఆయన గురువారం ఏలేరు అతిథిగృహంలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. సిట్‌కు అందిన ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలిస్తున్నామన్న ఆయన ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు.

ప్రశ్న: విచారణ ఎలా సాగుతోంది..?

జవాబు: ప్రభుత్వం సిట్‌కు రెండు నెలల గడువు ఇచ్చింది. ఈనెల 28తో ఆ గడువు ముగుస్తుంది. నాతోపాటు మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు, జేసీ సిట్‌లో భాగస్వాములుగా వున్నారు. ఫిర్యాదులోని ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలనేది నా ఉద్దేశం. రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, ప్రభుత్వ భూముల కబ్జాకు సంబంధించి కలెక్టర్‌కు, నేరుగా సిట్‌కు అందిన 337 ఫిర్యాదులను మాత్రమే ముందుగా విచారణకు తీసుకున్నాం. అన్ని శాఖలకు చెందినవారూ పూర్తిగా సహకారం అందిస్తున్నారు. ఇప్పటివరకు 112 ఫిర్యాదులపై విచారణ పూర్తిచేశాం. మరికొన్ని కేసులు ఈ వారంలో పూర్తవుతాయి.

ప్ర: విచారణకు మరికొంత గడువు ఇచ్చే అవకాశం ఉందా...

జ: కలెక్టర్‌కు, సిట్‌కు వివిధ రకాల భూసమస్యలపై ఒక్క విశాఖ నగర పరిధిలోనివే కాకుండా జిల్లాలోని 32 మండలాల నుంచి సుమారు 2,750 ఫిర్యాదులు అందాయి. వాటిలో 337 ఫిర్యాదులను మాత్రమే సిట్ విచారిస్తోంది. అందిన అన్ని ఫిర్యాదులను పరిశీలించి, అంశాల వారీగా విభజించేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బందికి నెల రోజులు సమయం పట్టింది. ఈ నేపథ్యంలో ఇచ్చిన రెండు నెలల సమయం సరిపోదని ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాశాం. మరో రెండు నెలలు సమయం ఇస్తూ ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశం వుంది.

ప్ర: ఎన్‌వోసీల జారీ విషయంలో ఐఏఎస్‌ల పాత్రపై ఆరా తీస్తున్నారంటున్నారు?

జ: సిట్ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తుంది. మాజీ సైనికుల పేరుతో భూముల కేటాయింపునకు సంబంధించి 24 ఫిర్యాదులపై విచారణ పూర్తిచేశాం. ఈ సందర్భంగా ఎన్‌వోసీల జారీలో ఐఏఎస్‌ల పాత్రపై వివరాలు సేకరిస్తున్నాం. అందిన ఫిర్యాదులపై విచారణ మాత్రమే సిట్ చేస్తుంది. ఏ ఒక్కరిపై నేరుగా కేసులు పెట్టదు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల వారీగా రెవెన్యూ సిబ్బందితో కలిసి సిట్ పనిచేస్తుంది. ఐఏఎస్‌లను సిట్ ఇప్పట్లో ప్రశ్నించే అవకాశం లేదు.

ప్ర: ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమిని పక్కదారి పట్టించినట్టు గుర్తించారు?

జ: విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం, పెందుర్తి మండలాల్లో ఇప్పటివరకు సిట్ నిర్వహించిన విచారణలో సుమారు 450 ఎకరాల ప్రభుత్వ భూమి వివరాలు రాబట్టగలిగాం. మూడు వేర్వేరు క్రిమినల్ కేసులను నమోదు చేయించడం ద్వారా ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు. మాజీ సైనికుల పేరుతో జారీ అయిన ఎన్‌వోసీలపై విచారణ జరిపి మరో వంద ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే అవకాశం వుంది. మరికొన్ని ఫిర్యాదులపై విచారణ కొనసాగుతున్నందున అదనంగా మరికొన్ని ఎకరాలు వచ్చే అవకాశం వుంది.

ప్ర: మెడ్‌టెక్, ముదపాక భూములపై విచారణ ఎంతవరకు వచ్చింది?

జ: పెదగంట్యాడ మెడ్‌టెక్ భూముల విషయంలో విచారణ కొనసాగుతోంది. ప్రత్యేక బృందాన్ని కేటాయించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వివరాలు సేకరిస్తున్నాం. అర్హత లేని వ్యక్తుల పేరుతో కొందరు ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై సిట్ బృందం భిన్న కోణాల్లో విచారణ సాగిస్తోంది. కొద్దిరోజుల్లో విచారణ పూర్తవుతుంది. పెందుర్తి మండలం ముదపాక భూములపై సిట్ ఏర్పాటు కాకముందే వివాదం నడుస్తోంది. దీనిపై నగర సీపీ ఇప్పటికే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్ర: గ్రామీణ ప్రాంత మండలాల నుంచి అందిన ఫిర్యాదులపై విచారణ ప్రారంభించినట్టు లేదు?

జ: ముందుగా నగర పరిధిలో ఫిర్యాదులపై విచారణ సాగుతోంది. నర్సీపట్నం, అనకాపల్లి రెవెన్యూ డివిజన్ల నుంచి సిట్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. వాటిలో ఇప్పటికే రావికమతం, ఎలమంచిలి, బుచ్చెయ్యపేట, పాయకరావుపేట మండలాల్లో కొన్ని ఫిర్యాదులపై సిట్ బృందాలు వివరాలు సేకరిస్తున్నాయి. విచారణకు మరింత గడువు వస్తుంది. అన్ని ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ సాగిస్తాం. అందులో ఎటువంటి సందేహం లేదు.

గణేష్ భార్యను విచారించిన సిట్

మరొక మహిళను కూడా...

సర్వే ఇన్‌స్పెక్టర్, అతని కుమారుడిపై కోడలి ఫిర్యాదు

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): భూ సర్వే రికార్డుల తారుమారు, నకిలీ రెవెన్యూ రికార్డుల తయారీ ఆరోపణలపై అరెస్టయిన సర్వే ఇన్‌స్పెక్టర్ గేదెల గణేశ్వరరావు భార్య సరితను సిట్ అధికారులు గురువారం ఏలేరు అతిథిగృహంలో విచారించినట్టు తెలిసింది. గణేశ్వరరావు అక్రమ సంపాదనతో కూడగట్టిన ఆస్తులు ఆమె పేరున వున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అధికారులు ఆమెను ప్రశ్నించినట్టు సమాచారం. గతంలో గణేశ్వరరావుతో సత్సంబంధాలు నెరిపిన మరో మహిళను కూడా సిట్ అధికారులు విచారించి అనేక విషయాలను సేకరించినట్టు తెలిసింది.

గణేశ్వరరావు, ఆయన కుమారుడు విజయశేఖర్ అక్రమ సంపాదన, వేధింపులపై కోడలు సిట్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కాకినాడకు చెందిన ఆమె వివాహం అయిన ఆరు నెలలకే విజయశేఖర్ నుంచి విడాకులు తీసుకున్నట్టు సమాచారం. తండ్రీ కొడుకుల మాయాజాలంపై ఆమె గురువారం ఏలేరు అతిథిగృహంలో సిట్ అధికారులకు కలిసి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

నర్సీపట్నం-తాళ్లపాలెం రోడ్డు విస్తరణతో

రైతులు మరింత అభివృద్ధి



రోడ్డు విస్తరణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి అయ్యన్న



లబ్ధిదారులకు ఎన్టీఆర్ పక్కా ఇంటి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

మాకవరపాలెం, ఆగస్టు 17:

నర్సీపట్నం నుంచి తాళ్లపాలెం వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ఈ ప్రాంత రైతులు మరింత అభివృద్ధి చెందుతారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. రూ.31 కోట్లతో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు గురువారం తామరం హైస్కూల్ వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, రోడ్డు విస్తరణ జరిగితే ఈ ప్రాంతంలో భూముల విలువ మరింత పెరుగుతుందని, పరిశ్రమలు, కంపెనీలు వస్తాయని, ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. శెట్టిపాలెం నుంచి నర్సీపట్నం వరకు సిమెంటు రోడ్డు వేయాలని, దీనికి అవసరమైతే మరో ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేస్తానన్నారు. నర్సీపట్నం నియోజకవర్గానికి 2,200 ఎన్‌టీఆర్ గృహాలు మంజూరు అయ్యాయని, వీటిలో 992 ఇళ్లు మాకవరపాలెం మండలానికి కేటాయించామన్నారు. గతంలో అసంపూర్తిగా నిర్మించిన ఇళ్ల పనులు పూర్తి చేయడానికి ఒక్కో ఇంటికి రూ.25 వేలు ఇస్తున్నట్టు చెప్పారు. నీరు-చెట్టు పథకం కింద ఈ ఏడాది రూ.12 కోట్లు మంజూరు చేశామన్నారు. పోలవరం ఎడమ కాలువపై తాళ్లపాలెం-జమాదులపాలెం వద్ద ఎత్తిపోతలను ఏర్పాటు చేసి, అక్కడ నుంచి ఎనిమిది మండలాల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. దీని నిర్మాణం కోసం రూ.2,142 కోట్లు ఖర్చు చేయడానికి సీఎం చంద్రబాబు అంగీకరించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఏంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు ఎంవీవీఎస్ మూర్తి, పప్పల చలపతిరావు, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామునాయుడు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్డీవో సూర్యారావు, ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కసిపల్లి కుమారి, టీడీపీ నాయకులు రుత్తల శేషుకుమార్, అల్లు రామునాయుడు, సూర్యనారాయణ, తహసీల్దార్ రమామణి, ఎంపీడీవో ఉదయశ్రీ, సర్పంచ్ మాణిక్యం పాల్గొన్నారు.

ఎన్నికలపై మహా సంకటం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో వార్డుల సంఖ్యను 72 నుంచి 81కి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్ అధికారులను గందరగోళానికి గురిచేస్తోంది. జీవీఎంసీలో భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీలను విలీనం చేస్తూ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీచేసింది. అయితే భీమిలికి జీవీఎంసీకి మధ్య వున్న ఐదు పంచాయతీలను విలీనం నుంచి మినహాయించడంతో రెండు ప్రాంతాలకు భౌగోళికంగా సంబంధాలు లేకుండా పోయినట్టయింది. దీనికితోడు కోర్టుల్లో వున్న కేసుల సంగతి కూడా ఉత్తర్వుల్లో ప్రస్తావించకపోవడం అధికారులను అయోమయానికి గురిచేస్తోంది. వీటన్నింటిపైనా స్పష్టత కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలనే యోచనలో అధికారులు వున్నారు.

గత ఐదున్నరేళ్లుగా పాలకవర్గం లేకుండా ప్రత్యేక అధికారి పాలనతో నెట్టుకొస్తున్న జీవీఎంసీకి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో నంబర్ 311ని విడుదల చేసింది. అనకాపల్లి మునిసిపాలిటీతోపాటు అనకాపల్లి-విశాఖ నగరం మధ్యన వున్న సలాపువానిపాలెం, వల్లూరు, తాడి, రాజులపాలెం, కొప్పాక

> **భీమిలి కనెక్టివిటీపై తర్జనభర్జన**
>
> **ఆ ఐదు గ్రామాలను మినహాయించేస్తే పాలనాపరమైన ఇబ్బందులు**
>
> **జీవీఎంసీ అధికారుల వాదన**
>
> **ఆనందపురం, వేములవసల, గంభీరం గ్రామాలైనా కలపాలని ప్రతిపాదన**
>
> **కోర్టు కేసులపైనా అయోమయం**
>
> **ప్రభుత్వానికి లేఖ రాసే యోచన**

పంచాయతీలను కూడా జీవీఎంసీలో విలీనం చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే భీమిలిని విలీనం చేస్తున్నట్టు పేర్కొంటూనే నగరానికి భీమిలికి మధ్య వున్న కాపులుప్పాడ, చేపలుప్పాడ, జేవీ అగ్రహారం, నిడిగట్టు, నగరపాలెం పంచాయతీల విలీనంపై అభ్యంతరాలు వున్నందున వాటిని మినహాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఐదు గ్రామాలను మినహాయించేయడం వల్ల భీమిలికి జీవీఎంసీకి మధ్య భౌగోళికంగా అనుసంధానం లేకుండా పోయింది. దీనివల్ల భవిష్యత్తులో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం వుందని జీవీఎంసీ అధికారులు విశ్లేషిస్తున్నారు. పైగా బుధవారం జారీచేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం కేవలం వార్డుల సంఖ్యను మాత్రమే నిర్ణయించింది తప్పితే తదుపరి చర్యలపై జీవీఎంసీ అధికారులకు ఎలాంటి సూచనలు లేదా ఆదేశాలుగానీ జారీ చేయలేదు. పైగా భీమిలి విలీనానికి వ్యతిరేకంగా కోర్టులో దాఖలైన కేసుల గురించి ఉత్తర్వుల్లో ఎక్కడా ప్రస్తావించలేదు. దీంతో తాము ఎలా ముందుకువెళ్లాలనే దానిపై జీవీఎంసీ అధికారులకు స్పష్టత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో భీమిలి విలీనంపై కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతోపాటు కనెక్టివిటీ గురించి స్పష్టత కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు భావిస్తున్నారు. భీమిలికి నగరానికి మధ్యన వున్న ఐదు గ్రామాలను విలీనం చేయాలని, అలాకాని పక్షంలో గంభీరం, ఆనందపురం, వేములవలస పంచాయతీలను కలిపే అంశాన్ని పరిశీలించాలని కోరాలని భావిస్తున్నట్టు జీవీంఎంసీ అధికారి ఒకరు తెలిపారు. దీనిపై స్పష్టత ఇస్తూనే వార్డుల పునర్విభజనకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ లేఖలో కోరనున్నట్టు సదరు అధికారి వివరించారు. వీటన్నింటిపైనా ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తేనేగానీ ముందుకువెళ్లే అవకాశం లేదని వారు పేర్కొంటున్నారు.

వెంకన్నపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

అడ్డుకున్న వీఆర్వో... హెచ్చరిక బోర్డు ఏర్పాటు

చోడవరం: మండలంలోని వెంకన్నపాలెంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, లేఅవుట్ వేసేందుకు అక్రమార్కులు చేపట్టిన చర్యలకు రెవెన్యూ సిబ్బంది బ్రేక్ వేశారు. ఇక్కడి పాత పెట్రోల్ బంకు వెనుక సర్వే నంబరు 442లో సుమారు 70 సెంట్ల ప్రభుత్వ భూమి వుంది. దీని పక్కనే జిరాయితీ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తులు, ప్రభుత్వ భూమిని కలుపుకుని లేఅవుట్ వేయడానికి సిద్ధమయ్యారు. ప్రభుత్వ స్థలాన్ని యంత్రాలతో చదునుచేశారు. సమాచారం అందుకున్న వీఆర్వో అబ్బులు అక్కడకు వెళ్లి, ప్రభుత్వ స్థలంలో చేస్తున్న పనులను అడ్డుకున్నారు. దీంతో ఆక్రమణదారులు మాటమార్చారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించలేదని, ఇది ప్రభుత్వ స్థలం అని తెలియక మట్టిని పోశామని, రెవెన్యూ సిబ్బంది చెప్పడంతో పనులు ఆపేశామని, తమ స్థలంలోనే లేఅవుట్ వేసుకుంటున్నామని చెప్పారు. ఈ స్థలానే గతంలో ఒకసారి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి లేఅవుట్ వేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి 'ఇది ప్రభుత్వ స్థలం' అంటూ బోర్డులు పెట్టారు. కొంతకాలం తరువాత బోర్డులను తొలగించడంతో అక్రమార్కులు మరోసారి తమ ప్రయత్నాలు ప్రారంభించారు. ఏది ప్రభుత్వ భూమి, ఏది జిరాయితీయో తెలియాలంటే ప్రభుత్వ భూముల్లో వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



వెంకన్నపాలెంలో ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

ఆశ్రమ విద్యార్థులకు కొత్త క్రీడలు

చింతపల్లి: మన్యంలో గిరిజన విద్యార్థులకు ఇంతవరకు పరిచయం లేని క్రీడలను అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి బాక్సింగ్, హాకీ, ఫుట్‌బాల్ క్రీడల తర్ఫీదును ప్రారంభించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) నిర్ణయించింది. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి(డీఎస్‌డీవో) జూన్ రోడ్రిగ్స్ గలియాత్ రూపొందిస్తున్నారు. అలాగే ఆదివాసీ యువత ఇండోర్ క్రీడలు ఆడుకునేందుకు పాడేరులో రూ.కోటి, చింతపల్లిలో రూ.80 లక్షలతో ఇండోర్ స్టేడియంల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

ఏజెన్సీలో ప్రతి గ్రామంలో గిరిజన యువత, విద్యార్థులు వాలీబాల్ ఆడతారు. ఈ ఆటనే ఎక్కువ మంది ఎందుకు ఆడుతున్నారు? ఎందుకు ఇష్టపడుతున్నారు? అన్నది పరిశీలిస్తే.. ఖర్చు తక్కువ కావడమే కారణం. గిరిజన యువత వందలు, వేల రూపాయలు వెచ్చించి క్రీడా సామగ్రిని కొనుగోలు చేసే పరిస్థితి లేదు. దీంతో వాలీబాల్ మినహా మరో క్రీడ ఆడడం తెలియదు. పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన సమయంలో గిరిజన విద్యార్థులు పలు రకాల క్రీడల్లో పాల్గొన్నప్పటికీ స్వగ్రామంలో వాలీబాల్ క్రీడకే పరిమితమవుతున్నారు. అతితక్కువ మంది ఆర్చరీపై(విలువిద్య) ఆసక్తి చూపుతున్నారు. దీంతో గిరిజన విద్యార్థులు, యువత అన్ని రకాల ఇండోర్, ఔట్‌డోర్ క్రీడలు ఆడడానికి సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



చింతపల్లిలో ఇండోర్ స్టేడియం నిర్మించనున్న ప్రదేశాన్ని చదును చేస్తున్న దృశ్యం

వచ్చే నెల ఒకటి నుంచి హాకీ, బాక్సింగ్, ఫుట్‌బాల్‌లో శిక్షణ
ప్రత్యేకంగా కోచ్‌ల నియామకం
పాడేరు, చింతపల్లిలో ఇండోర్ స్టేడియాల నిర్మాణం
ఏడాదిలోగా అందుబాటులోకి....
లంబసింగిలో క్రీడా వసతిగృహం

హాకీ, బాక్సింగ్, ఫుట్‌బాల్

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన గిరిజన విద్యార్థులు హాకీ, బాక్సింగ్, ఫుట్‌బాల్ వంటి క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపికవుతున్నారు. గిరిజన ప్రాంత విద్యార్థుల శరీర దారుఢ్యం ఈ క్రీడలకు అనుగా వుంటుందని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాయి. విశాఖ మన్యంలోని గిరిజన విద్యార్థులకు కూడా ఈ మూడు క్రీడల్లో తర్ఫీదు ఇవ్వడానికి చర్యలు చేపట్టింది. దీనికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారులు రూపొందించారు. గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు హాకీ, బాక్సింగ్, ఫుట్‌బాల్ క్రీడలకు అవసరమైన క్రీడా సామగ్రిని స్పోర్ట్స్ అథారిటీ సరఫరా చేస్తుంది. ఆశ్రమ పాఠశాలల పీఈటీలు, పీడీలు ఆయా క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

పాడేరు, చింతపల్లిలో ఇండోర్ స్టేడియాలు

గిరిజన యువత ఇండోర్ క్రీడలను సాధన చేసేందుకు ప్రభుత్వం పాడేరు, చింతపల్లిల్లో ఇండోర్ స్టేడియంల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. పాడేరులో రూ.కోటి, చింతపల్లిలో రూ.80 లక్షలతో వీటిని నిర్మించనున్నారు. పాడేరు జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియం నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. చింతపల్లిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి బాలుర ఆశ్రమ పాఠశాలకు సమీపంలో రెవెన్యూ శాఖ ఎకరం స్థలాన్ని కేటాయించింది. ఇటీవల స్థలాన్ని చదును చేశారు. టెండర్లు పిలిచి, త్వరలో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

లంబసింగిలో స్పోర్ట్స్ హాస్టల్‌కు ప్రతిపాదన

ఆంధ్ర కశ్మీర్‌గా పేరొందిన లంబసింగిలో ఐటీడీఏ, స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తంగా క్రీడల వసతిగృహం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడలో నిర్వహించి స్పోర్ట్స్ అథారిటీ సమావేశంలో ఆదేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు.



ఇండోర్ స్టేడియంలో ఏముంటాయి....

ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేక సౌకర్యాలు వుంటాయి. ఆడ, మగ క్రీడాకారులక వేర్వేరుగా విశ్రాంతి గదులు, దుస్తులు మార్చుకునే గదులు, వాష్‌రూమ్, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. చుట్టూ స్లాబ్‌తో కూడిన గదులు, మధ్యలో రేకులతో పైకప్పు వుంటుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు నిర్మించనున్నారు.



ఇండోర్ స్టేడియంలో షటిల్, టేబుల్ టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేస్తారు. క్యారమ్స్, చెస్ పరికరాలను అందుబాటులో వుంచుతారు. భవిష్యత్తులో గిరిజన విద్యార్థుల ఆసక్తి మేరకు ఇండోర్ స్టేడియానికి అనుబంధంగా ఇతర క్రీడల మైదానాలు నిర్మిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇండోర్ స్టేడియంల నిర్మాణానికి మాత్రమే నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తయిన తరువాత క్రీడా సామగ్రి కోసం నిధులు కేటాయిస్తుంది.

గిరిజన విద్యార్థుల క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం



జూన్ రోడ్రిగ్జ్ గలియాత్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి

గిరిజన విద్యార్థుల క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఈ ఏడాది హాకీ, బాక్సింగ్, ఫుట్‌బాల్ క్రీడలను పరిచయం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులకు శిక్షణ కోసం అనుభవజ్ఞులైన కోచ్‌లను నియమించనున్నాం.

ఏడాదికి అందుబాటులో ఇండోర్ స్టేడియాలు



డీవీఆర్ఎం రాజు, డీఈఈ, టీడబ్ల్యు, చింతపల్లి.

ఇండోర్ స్టేడియాలు 2018 ఆగస్టు నాటికి అందుబాటులోకి రానున్నాయి. పాడేరులో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. చింపతల్లిలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేశాం. టెండర్లు ప్రక్రియ పూర్తిచేసి నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తాం.

డల్లాపల్లిలో పూల్ కాటేజీలు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం) పర్యాటక ప్రాజెక్టులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఏజెన్సీలోని లంబసింగి, డల్లాపల్లి గ్రామాల్లో రిసార్ట్స్ నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. ఇంకా యారాడ, మంగమారిపేట, రుషికొండ బీచ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.17 కోట్లు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

రూ.5 కోట్లతో లంబసింగిలో రిసార్ట్స్

చింతపల్లి మండలం లంబసింగిలో రూ.5 కోట్లతో రిసార్ట్స్ నిర్మించనున్నారు. లంబసింగిలో సదుపాయాలకు భారీ ప్రణాళికలు వేసినా తొలివిడతగా రూ.5 కోట్లు మంజూరయ్యాయి. తాజాగా విడుదల చేసిన ఐదు కోట్లతో పది వరకు కాటేజీలు, రెస్టారెంట్, పార్కింగ్, యాంపీ థియేటర్, వ్యూపాయింట్, సమావేశ మందిరం నిర్మించనున్నారు. కాటేజీలు పూర్తిగా వెదురు, కలపతో నిర్మిస్తారు. నిర్మాణాలకు సంబంధించి టెండర్ ఖరారుచేసిన పర్యాటక శాఖ నెలాఖరులోగా పనులు చేపట్టాలని నిర్ణయించింది. వచ్చే జనవరికల్లా కనీసం రెస్టారెంట్, టాయ్‌లెట్లు సిద్ధం చేయాలని భావిస్తోంది.

డల్లాపల్లిలో పూల్ కాటేజీలు

పాడేరు సమీపంలోని డల్లాపల్లిలో తొలివిడత కాటేజీల నిర్మాణానికి ప్రభుత్వం మూడు కోట్లు మంజూరుచేసింది. టెండర్లు ఖరారుచేసిన అధికారులు నెలాఖరులో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కేరళలో మాదిరిగా డల్లాపల్లిలో పూల్ కాటేజీలు నిర్మించాలని ప్రతిపాదించారు. ప్రతి కాటేజీకి ఒక స్విమ్మింగ్‌పూల్ నిర్మిస్తారు. డల్లాపల్లిలో పది పూల్ కాటేజీలు ప్రతిపాదించినా ప్రస్తుతం మంజూరుచేసిన నిధులతో రెండు నుంచి మూడు మాత్రమే నిర్మించవచ్చు. ఇంకా రెస్టారెంట్, పార్కింగ్ ఏరియా, స్విమ్మింగ్ పూల్ నిర్మించనున్నారు. ఆర్కిటెక్టు ప్రతిపాదనల మేరకు అన్ని నిర్మించాలంటే రూ.15 కోట్లు అవసరం.

ఇంకా రుషికొండ బీచ్‌లో మిగిలిన పనులకు, పార్కింగ్ ఏరియా విస్తరణ, బీచ్ ఫ్రంట్ పరిరక్షణకు రెండున్నర కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు పార్కింగ్‌గా వున్న ప్రాంతాన్ని రోజువారీ కార్యక్రమాలకు కేటాయిస్తారు. అలాగే యారాడలో ఐదెకరాల విస్తీర్ణంలో బీచ్‌ఫ్రంట్ నిర్మిస్తారు. కేఫ్‌టేరియా, టాయ్‌లెట్లు, పర్యాటకులు కూర్చునేందుకు సదుపాయాలు కల్పిస్తారు. మంగమారిపేటలో రెండు కోట్లతో బీచ్‌ఫ్రంట్ అభివృద్ధి చేస్తారు. పర్యాటకులు తీరంలో పర్యటించేలా సదుపాయాలు కల్పిస్తారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధి సంస్థ పరిధిలో వున్న కాటేజీల మరమ్మతు, స్థలాల పరిరక్షణకు మరో మూడు కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు పనులు వెంటనే చేపట్టాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు.



లంబసింగిలో రిసార్ట్స్ నమూనా

మా మట్టి గణపయ్య

● జన చైతన్యంతోనే పర్యావరణ హితం **మట్టి వినాయకులు వాడాలని నిపుణుల సూచన**


(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం) వినాయక ఉత్సవాలు సమీపిస్తున్నాయి. వీధికో మండపం ఏర్పాటుకు నిర్వాహకులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఎటువంటి విగ్రహాలు వాడాలన్న దానిపై చర్చ ప్రారంభమైంది. ఇటీవల రెండు మూడేళ్ల నుంచి మట్టి విగ్రహాలపై పర్యావరణ హితులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మట్టి గణపయ్యతోనే మేలని సూచిస్తున్నారు. ప్రజల్లో ఇది కొంత మార్పుకు కారణమవుతున్నా అనుకున్న స్థాయి మార్పు ఇంకా రాలేదు. ముఖ్యంగా భారీ విగ్రహాల విషయంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఆధిపత్యమే కొనసాగుతోంది. దీనివల్ల పర్యావరణానికి జరుగుతున్న ముప్పుపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినాయక ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు మళ్లీ ఈ చర్చ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో జరిగే కీడు, మట్టి విగ్రహాలతో కలిగే మేలుపై నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

గాలి...నీరు...మట్టి కలుషితం

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు, వాటికి అందం వచ్చేందుకు వినియోగించే రంగుల వల్ల గాలి, నీరు, మట్టి కూడా కలుషితం అవుతుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగవు, మట్టిలో కలిసిపోవు. కాబట్టి ఇవి నీటిలో ఉన్నా, మట్టిలో ఉన్నా రెండింటిలోనూ విషం చేరుతుంది. రంగు విగ్రహాలు మండపంలో ఉన్నంత వరకు వాటిపై వేసిన రంగులు గాలిలోని ఆక్సిజన్, ఇతర వాయువులతో సంయోజనం చెందిన గాలిని కలుషితం చేస్తుంటాయి. గ్రామాల్లో వీటిని సాధారణంగా చెరువులు, బావులు, నదుల్లో నిమజ్జనం చేస్తారు. విశాఖ వంటి తీర ప్రాంత వాసులు సముద్రంలో నిమజ్జనం చేస్తారు. సముద్రంలో నిమ్జనం కంటే చెరువులు, బావుల్లో నిమజ్జనం మరింత ప్రమాదకరం. ఎందుకంటే సముద్రంలో నిమజ్జనం చేసినా విశాలమైన తీరంలో వీటి ప్రభావం కొద్దిగా ఉంటుంది. నదుల్లో నిమజ్జనం చేస్తే దిగువకు కొట్టుకుపోయి చివరికి సముద్రంలో కలిసిపోతాయి కావున ప్రభావం తక్కువ. కానీ చెరువులు, కుంటలు, బావుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల నీరు కలుషితమై నేరుగా ప్రజలపై ప్రభావం చూపుతుంది. అలాగే ఇవి అడుగుభాగంలో మట్టిలో చేరడం వల్ల కాలక్రమంలో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.




విశాలమైన ప్రపంచంలో మనిషి దృష్టికోణాన్ని అత్యంత వేగంగా ఆకర్షించేది గుడి, అందులోని విగ్రహాలే. విగ్రహం నిగ్రహాన్నిస్తుంది. దాన్ని చూడగానే ఆధ్యాత్మిక వాదుల చేయి దానంతట అదే లేచి స్మరణ చేస్తుంది. అందుకే దేవుని విగ్రహానికి అంత పవిత్రత. వినాయక ఉత్సవాల్లో వీధికో మండపం వెలుస్తుంది. పలు రకాల విగ్రహాలు కొలువుదీరుతాయి. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్న నిర్వాహకుల మధ్య పోటీతో అందం, ఆకర్షణ, భారీ సైజు విగ్రహాలు ఆయా మండపాలపై కొలువుదీరుతాయి. అంతా బాగానే ఉన్నా వాడుతున్న విగ్రహాలతోనే సమస్యంటున్నారు నిపుణులు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ స్థానంలో మట్టి విగ్రహాల వాడకం మేలని సూచిస్తున్నారు.



పని సులభమని...

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసే విగ్రహాలు వినియోగించడం వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నా వీటికే డిమాండ్ అధికంగా ఉండడానికి కారణం అందం, ఆకర్షణీయంగా కనిపించడం. రెండోది తయారీదారులకు వీటిని తయారు చేయడం సులువు. గతంలో ఎంతటి భారీ విగ్రహాన్నైనా కర్ర, గడ్డి, మట్టిని వినియోగించి మాత్రమే తయారు చేసేవారు. వాటికి సంప్రదాయమైన రంగులు అద్దేవారు. కొన్నాళ్లుగా మట్టి స్థానంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ చేరింది. ప్రస్తుతం దీని వినియోగం ఎక్కువైంది. ఇటీవల ఒకటి రెండేళ్ల నుంచి మట్టి వినియకుల వాడకంపై వివిధ సంస్థలు చేస్తున్న ప్రచారం పుణ్యాన గృహాలు, చిన్నచిన్న మండపాల్లో వినియోగించే విగ్రహాల విషయంలో మార్పువచ్చినా భారీ విగ్రహాల విషయంలో ఇంకా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఆధిపత్యమే కొనసాగుతోంది. ముఖ్యంగా నగరాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల ఆధిపత్యమే కొనసాగుతోంది. విగ్రహాల మన్నిక, నాణ్యత వంటి కారణాలతోపాటు తయారుచేసే వారికి కూడా సులభంగా ఉండడమే వీటి డిమాండ్‌కు కారణం. పైగా ఈ విగ్రహాలు దృఢంగా ఉండడం వల్ల సుదూర ప్రాంతాలకు తీసుకువెళ్లినా ఇబ్బందులు తలెత్తవు. అదే మట్టి విగ్రహాలైతే కొద్దిదూరం వెళ్లేసరికే దెబ్బతినే అవకాశం ఉంది. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకునే నిర్వాహకులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో సమస్య అని తెలిసినా వాటికే ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌కు దూరంగా ఉండాలని వేడుకోలు
రంగుల హంగుల్లో విషపూరిత రసాయనాలు
గాలి, నీరు, నేలను కలుషితం చేసే పదార్థాలివి
ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం
భవిష్యత్తు తరాలకు పొంచివున్న ఇబ్బందులు
జలచరాల ప్రాణాలకు ముప్పు



ఆందోళనకు ఇవీ కారణాలు

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వినియోగించడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై నిపుణుల ఆందోళనకు ఇవీ కారణాలు.

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వినియోగించడం వల్ల పర్యావరణంతోపాటు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. భూగర్భజలాలు కలుషితం అవుతాయి.
- ఈ విగ్రహాలకు వినియోగించే రంగుల వల్ల పలు రకాల నష్టాలు ఉన్నాయి. రంగుల్లోని జిప్సం, ఐరన్, హైడ్రోకార్బన్, సీసం, పాదరసం, జింక్, కాడ్మియం వంటి రసాయనాలు స్వల్పమోతాదులో వినియోగించడం వల్ల కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవుతాయి.
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌కు నీటిలో కరిగే గుణం లేకపోవడం వల్ల నిమజ్జనం చేసినా దాని స్థితి మారదు.
- ప్రధానంగా హైడ్రో కార్బన్‌ల వల్ల, ఆమ్లజని స్వభావం కలిగిన రంగుల వల్ల జలచరాలకు హాని జరుగుతుంది.
- విగ్రహాలను నిమజ్జనం చేసిన చెరువులు, బావుల్లోని నీటిని తాగడం వల్ల నేత్ర, చెవి, ముక్కు, గొంతు, శ్వాస కోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- అదేవిధంగా కాడ్మియం వల్ల మూత్రపిండాలు, కాలేయం కుంచించుకుపోయి సమస్యలు ఉత్పన్నం కావచ్చు. సీసంలోని లెడ్ క్లోరైడ్, బ్రోమైడ్‌లు ఎర్ర రక్తకణాలకు హానిచేస్తాయి. దీనివల్ల రక్తహీనత బారిన పడే ప్రమాదం ఉంది.
- పాదరసం వల్ల నాడీ మండలం దెబ్బతినడం, కళ్లు, కాలేయానికి హాని కలగవచ్చు.
- నూనెలు, ప్లాస్టిక్ వస్తువులు, లోహ సంబంధమైన పదార్థాలు విచ్ఛిన్నంకాక ఇబ్బందులు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు.



- వినాయక పూజకు ఒండ్రుమట్టితో చేసిన వినాయకుడి ప్రతిమను మాత్రమే వినియోగించాలని పెద్దలు చెబుతారు. ఇందుకు కారణం ఉంది.
- ఒండ్రుమట్టిలో కొన్ని ఔషధ గుణాలు ఉన్నాయి. ఇవి మనిషి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉపయోగపడతాయి.
- సాధారణంగా ఈ సీజన్‌లో జలాశయాలన్నీ పూడికతో నిండివుంటాయి. బంకమట్టి కోసం జలాశయాల్లో దిగి మట్టిని తీయడం వల్ల పూడిక తీసినట్టు అవుతుంది. నీళ్లు తేటపడతాయి.
- మట్టిని కలపడం, దానితో బొమ్మను చేయడం వల్ల మట్టిలోని మంచి గుణాలు ఒంటికి పడతాయి.
- ఒండ్రుమట్టిలో నానడం ఒంటికి మంచిదని ప్రకృతి వైద్యులు చెబుతున్నారు. ప్రకృతి చికిత్సకు ఒండ్రుమట్టిని వాడడం అన్నది ఈ మంచి సుగుణాల కోసమే.

ఇవీ ప్రయోజనాలు

- పది రోజులపాటు పూజలు చేసిన వినాయక విగ్రహాన్ని పదకొండో రోజున మేళతాళాలతో జల నిమజ్జనం చేయడంలో ఒక వేదాంత రహస్యం దాగి ఉందని పెద్దలు చెబుతారు.
- పాంచభౌతికమైన ప్రతి ఒక్క పదార్థం అంటే పంచ భూతాల నుంచి జన్మించిన ప్రతి ఒక్క సజీవ, నిర్జీవ పదార్థం మధ్యలో ఎంత వైభవంగా, విలాసంగా గడిపినా అంతిమంగా మట్టిలో కలిసిపోవాల్సిందే.
- అందుకే ప్రకృతికి దేవుడైన వినాయకుని విగ్రహాలను మట్టితోనే తయారు చేస్తారు.
- అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలుచేసి నైవేద్యాలు సమర్పించి నీటిలో నిమజ్జనం చేస్తారు.
- తయారుచేసే సమయంలో తగలని మట్టి నిమజ్జనం సమయంలో ఒంటికి తగలడం వల్ల కూడా మంచి జరిగేందుకు అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.
- అదే సమయంలో విగ్రహం వేగంగా నీటిలో కరిగిపోయి పర్యావరణ ఇబ్బందులు కలిగించదు.

బావిలో పడి వివాహిత మృతి


బావిలో తేలిన మృతదేహం

రాంబిల్లి: కృష్ణంపాలెం గ్రామంలో వివాహిత బావిలో పడి మృతి చెందిందని ఎస్ఐ కుమారస్వామి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన లాలం లలిత (34) పదేళ్లుగా మానసిక సమస్యలతో బాధ పడుతున్నది. బుధవారం సాయంత్రం ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రించిన లలిత, తెల్లవారేసరికి కనిపించలేదు. గురువారం ఉదయం అదే గ్రామానికి ఒక మహిళ తాగునీటి కోసం గ్రామ సమీపంలోని బావికి వెళ్లగా, అక్కడ మహిళ శవం తేలి ఉన్నట్టు గమనించి విషయాన్ని గ్రామస్థులకు తెలిపింది. మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా లలితగా గుర్తించారు. మృతురాలు తమ్ముడు శివాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కాలువలో పడి మరొకరు...


మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

మునగపాక: మండల కేంద్రంలోని ములబందగోడి ప్రాంతానికి చెందిన కస్పా రాము (37) గురువారం ప్రమాదవశాత్తూ కాలువలో జారి పడి మరణించాడు. తోటాడ నుంచి మునగపాక వచ్చే అనకాపల్లి ఆవ కాలువ వద్దకు గురువారం ఉదయం రాము కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మరణించాడు. రాముకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ దొర తెలిపారు.

రెవెన్యూ సిబ్బందిపై ఇసుక మాఫియా దాడి కేసులో..

ఎనిమిది మందికి జైలు

ఏడాది శిక్ష.. రూ.2,800 జరిమానా

చోడవరం: ఇసుక తవ్వకాలు అడ్డుకోవడానికి వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై దాడి చేయడంతో పాటు వారి వాహనాన్ని ఢీకొట్టిన కేసులో ఎనిమిది మంది నిందితులకు జైలు శిక్ష విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి బి.శివరాంప్రసాద్ గురువారం తీర్పు చెప్పారు. ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 2,800 రూపాయల జరిమానా విధించారు. అనకాపల్లి మండలం ఊడేరు ప్రాంతంలో 2013 జూన్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అప్పటి ఆర్ఐ వేలూరి శేషబాబు, వీఆర్వో టి.నరేష్‌తో పాటు తలయారీలు వెళ్లారు. ఊడేరు వెళ్లేసరికి ఇసుక లోడుతో తరలిపోతున్న లారీలను ఆపి, అందులో తలయారీలను ఎక్కించి అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. తలయారీలను లారీలలో ఎక్కించిన ఆర్ఐ, వీఆర్వోలు మరో కారులో వెంబడిస్తుండగా, లారీ డ్రైవర్లు హఠాత్తుగా దారి మళ్లించడంతో రెవెన్యూ సిబ్బంది కారులో వెంబడించారు. చోడవరం మండలం వెంకన్నపాలెం సమీపంలో ఇసుక వ్యాపారులు రెవెన్యూ సిబ్బంది వచ్చిన కారును ఢీకొట్టడంతో పాటు సిబ్బందిపై దాడి చేసి పారిపోయారు. ప్రస్తుత కలెక్టర్ అప్పటి జేసీ ప్రవీణ్ కుమార్ దీన్ని సీరియస్‌గా పరిగణించి ఎస్పీతో మాట్లాడి నిందితులపై ప్రత్యేకంగా కేసు నమోదు చేయించారు. గురువారం ఈ కేసులో జడ్జి శివరాంప్రసాద్ తీర్పు ఇస్తూ రెవెన్యూ సిబ్బంది విధులకు ఆంటకం కలిగించడంతో పాటు వారి వాహనాన్ని ఢీకొట్టి దాడికి పాల్పడిన కేసులో చోడవరం మండలం గంధవరం గ్రామానికి చెందిన మొల్లి నగేష్, మురళీ, నానాజీ, గంగాజీ, నాగేశ్వరరావు, సత్యారావు, కోటేశ్వరరావు, సింహాచలంలకు పై విధంగా తీర్పు ఇచ్చారు.

రెండు బైకులు ఢీ: ముగ్గురికి గాయాలు

కోటవురట్ల: తంగేడు కాటా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కోటవురట్ల ఐసీడీఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ కిరణ్‌కుమార్ గురువారం బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, ఎదురుగా బైక్‌పై వస్తున్న మాకవరపాలెం మండలం రాచపల్లి శివారు కొత్తపాలెం గ్రామానికి చెందిన పొలిశెట్టి రమణ తంగేడు కాటా వద్ద ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని నర్సీపట్నం 150 పడకల ఆస్పత్రికి తరలించేందుకు వైద్య సిబ్బంది ప్రయత్నించగా, 108 వాహనం సకాలంలో రాలేదు. దీంతో హుటాహుటిన ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

గంజాయితో ముగ్గురు మహిళల అరెస్టు


గంజాయితో పట్టుబడిన మహిళలతో ఎక్సైజ్ పోలీసులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17: గంజాయి తరలిస్తూ గురువారం ముగ్గురు మహిళలు అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో పట్టుబడ్డారు. ఎక్సైజ్ శాఖ పోలీసులు వారి వద్ద నుంచి దాదాపు 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా వున్నాయి. తమిళనాడు రాష్ట్రం సేలం సమీపంలోని బుధసంద గ్రామానికి చెందిన వేములపావ (45), వేముల కళ (50), అంబిగ (35) విశాఖ ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేశారు. చెన్నై వెళ్లేందుకు అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చారు.

నిందితులు తమిళనాడు వాసులు

ఈ విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ సిబ్బందితో స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే ప్లాట్‌ఫారంపై ముగ్గురు మహిళలు ఐదు బ్యాగులలో గంజాయితో రైలు కోసం నిరీక్షిస్తున్నారు. వారిపై అనుమానం వచ్చి బ్యాగులు సోదా చేయగా 30 ప్యాకెట్ల గంజాయి బయటపడింది. దాదాపు 60 కిలోలు వున్న ఈ గంజాయి విలువ లక్షన్నర రూపాయలు వరకు వుండవచ్చని సీఐ రవికుమార్ తెలిపారు. కాగా, తమిళనాడు నుంచి వ్యాపారులు ఏదో సరుకు వుందని చెబితే వచ్చామని, గంజాయి అన్న విషయం తమకు తెలియదని మహిళలు చెప్పారు.

కుటుంబంలో ఘర్షణ

ఇద్దరిపై చురకత్తితో దాడి చేసిన ఇంటి పెద్ద

క్షతగాత్రులు కేజీహెచ్‌కు తరలింపు



నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామం సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఒక కుటుంబం జరుపుకున్న శుభకార్యంలో వివాదం చెలరేగింది. చివరకూ అది కత్తిపోట్లకు దారి తీసింది. ఇద్దరిపై ఒక వ్యక్తి చురకత్తితో హత్యాయత్నం చేశాడు. దీంతో గాయపడ్డ ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ పి.సింహాచలం అందించిన వివరాలిలా వున్నాయి.

తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరుకు చెందిన షేక్ మస్తానుకు ఇటీవల వివాహమైంది. ఆయనకు నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామంలో బంధువులు వున్నారు. దీంతో చినదొడ్డిగల్లు గ్రామంలో సత్తెమ్మ తల్లి అమ్మవారి మొక్కు తీర్చుకోవడానికి మస్తాను కుటుంబీకులు గురువారం వచ్చారు. మధ్యాహ్న సమయంలో కుటుంబ సభ్యుల మధ్య వివాదం చెలరేగింది. దీంతో షేక్ మస్తాను తండ్రి షేక్ నాగూర్ సాహెబ్ (నాగేశ్వరరావు) మేకలను కోసే సురకత్తితో ఒక్కసారిగా బంధువులపైకి దాడికి పాల్పడ్డాడు. దీంతో షేక్‌మదీనాబీబీ(28), షేక్ నాగూర్ సాహెబ్ (46) గాయపడ్డారు. అక్కడున్న వారు అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

బాధితురాలు మదీనాబీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్ఐ సింహాచలం చెప్పారు. క్షతగాత్రులను నక్కపల్లి 30 పడకల ఆస్పత్రిలో చేర్చగా, ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు.

భార్యపై హత్యాయత్నం

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని అఘాయిత్యం


కత్తితో పోట్లకు గాయపడిన దేవి

రావికమతం: ముందు కోసం డబ్బులు ఇవ్వలేదనే ఆగ్రహంతో భార్యపై హత్యాయత్నం చేశాడు ఓ ప్రబుద్ధుడు. కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. మత్సవానిపాలెం గ్రామంలో గురువారం జరిగిన ఈ ఉదంతానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

మత్సవానిపాలెం గ్రామానికి చెందిన మడగల రాజిబాబు, రాములమ్మల కుమారుడు చిరంజీవి (36) తన మేనమామ కుమార్తె దేవి(32)ని 12 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. చిరంజీవి మొదటి నుంచి జులాయిగా తిరుగుతూ తల్లిదండ్రులు, భార్య దేవి సంపాదనతో జీవిస్తున్నాడు. నెల రోజులుగా నాటుసారా పూటుగా తాగుతూ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. బుధవారం సాయంత్రం మద్యానికి డబ్బులు ఇవ్వాలని దేవిని అడగ్గా, ఆమె నిరాకరించింది. దీంతో ఆగ్రహించిన చిరంజీవి దేవిని కత్తితో పొడిచి గాయపరిచాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శేఖరం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దేవిని నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు. పరారైన నిందితుడి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనానికి కుళ్లిన గుడ్లు



సీలేరు: మధ్యాహ్న భోజన పథకం కోసం ధారకొండ జీయూపీ పాఠశాలకు సరఫరా చేసిన గుడ్లలో అధిక శాతం కుళ్లిపోయాయి. ఈ గుడ్లలో పురుగులు కూడా బయటకు వస్తూ విపరీతమైన కంపు కొడుతున్నాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో వారానికి మూడు గుడ్లు సరఫరా చేయాలి. ఈ బాధ్యతలను ఒక సంస్థకు అప్పగించడంతో వారు ఒకేసారి రెండు, మూడు వారాలకు సరిపడా గుడ్లను ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఇలా సరఫరా చేసిన వాటిలో నాణ్యతపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో తెచ్చిన వాటిలో సగానికిపైగా గుడ్లు కుళ్లిపోతున్నాయి. అంతేకాకుండా కొన్ని గుడ్లు పగిలిపోయి ఉంటున్నాయి. దీంతో విపరీతంగా దుర్వాసన వస్తూ, పురుగులు కూడా పడుతున్నాయని పాఠశాలల సిబ్బంది, భోజన పథకం నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సర్పంచ్ రాజుఏసువరరావు ఫిర్యాదు చేవారు. అలాగే పిల్లలకు నాణ్యమైన గుడ్లను సరఫరా చేయాలని కోరారు.

నాలుగు ఇసుక లారీలు సీజ్

గవరవరం రూట్లో జోరుగా ఇసుక రవాణా


పోలీసులు సీజ్ చేసిన లారీలు ఇవే..

చోడవరం: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు లారీలను పోలీసులు సీజ్ చేశారు. గవరవరం మార్గంలో బుధవారం అర్ధ రాత్రి వీటిని పట్టుకున్నారు. మండలంలోని గవరవరం, లక్కవరం ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రోజూ రాత్రి వేళల్లో వంద లారీలకు పైగా ఇసుక రవాణా అవుతుండడంతో చోడవరం-దేవరాపల్లి రహదారిలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. బుధవారం రాత్రి గవరవరం రూట్లో రెండు ఇసుక లారీలు రోడ్డుపక్కన దిగబడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసి వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి నాలుగు ఇసుక లారీలను సీజ్ చేశారు. వాటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కె.కోటపాడులో మరో లారీ..

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ శారదానది పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేశామని ఎస్ఐ డి.రాము తెలిపారు. చౌడువాడ నుంచి వెంకన్నపాలెం ఇసుక తరలిస్తుండగా మార్గమధ్యంలో పట్టుకున్నామన్నారు. లారీ డ్రైవర్ నంబారు దేముళ్లను అరెస్టు చేసి, లారీని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

గంజాయి స్మగ్లర్లపై టాస్క్‌ఫోర్స్

అనంతగిరిరూరల్: మన్యం నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్మగ్లర్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరా తీస్తున్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోట కేంద్రంగా అనంతగిరి మండలానికి చెందిన కొంతమంది యువకులు కొంతకాలంగా గంజాయి రవాణా చేస్తున్నారనే ఆరోపణలకు ప్రస్తుత పరిస్థితి నిజమేనన్న సంకేతాలు వెలువరిస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం విజయనగరం జిల్లా నరవ గ్రామంలో సుమారు ఐదు వందల కిలోల గంజాయి ఒక మ్యాక్స్ పికప్ వాహనంలో తరలిస్తూ పట్టుబడింది. ఈ ఘటనలో మండలానికి చెందిన చిలకలగెడ్డ పంచాయతీ సర్పంచ్ భర్త అప్పారావు పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ వ్యవహారంతో ఆయన్ను విచారిస్తున్న పోలీసులు తీగలాగడం ప్రారంభించారు. మండలంలో గంజాయి ముఠా గుట్టు రట్టు చేసేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలో అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని సమాచారం.

శివలింగపురం గ్రామానికి చెందిన హుస్సేన్, అరకులోయ మండలం లోతేరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని సమాచారం. గంజాయి అక్రమ రవాణాపై ఇటీవల ఆంధ్రజ్యోతి లో 'కోట కేంద్రంగా గంజాయి అక్రమరవాణా' అనే శీర్షికన వార్త ప్రచురితం అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు. ఇదే క్రమంలో శివలింగపురానికి చెందిన ఇద్దరిని, టోకూరుకు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకొని.. విజయనగరం జిల్లా గంట్యాడలో వివరాలు సేకరిస్తున్నారని వినికిడి

అదుపులో ఆరుగురు అనుమానితులు?

నిరుద్యోగ యువకులకు ప్రలోభాలు

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే అనంతగిరి మండలంలో ఇటీవల కాలంలో గంజాయి రవాణాకు స్థానికంగా ఉండే నిరుద్యోగ యువతను ప్రలోభ పెట్టి అక్రమ రవాణా రొంపిలోకి దించుతున్నారు, ఇప్పటికే పలు కేసుల్లో మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇప్పుడు పోలీసులు మండలంలోని గంజాయి ముఠాపై ప్రత్యేక దృష్టి సారించడంతో స్మగ్లర్లకు ముచ్చెమటలు పడుతున్నాయి.

తేలని చర్చలు.. కొనసాగుతున్న ప్రతిష్టంభన

● అన్నవరం కల్యాణ మండపం నిర్మాణంపై తెలుగుదేశం, వైసీపీ నాయకుల మధ్య వివాదం



పంచాయతీ కార్యాలయంలో అన్నవరం వివాదంపై కొనసాగుతున్న చర్చ


చోడవరం: పట్టణ శివారు అన్నవరం గ్రామంలో కళ్యాణ మండపం నిర్మాణంపై అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసీపీనేతల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. బుధవారం కళ్యాణ మండపం నిర్మాణం శంకుస్థాపనకు స్థానిక సర్పంచ్ సిద్ధమైన నేపథ్యంలో ఇరుపక్షాల మధ్య ఘర్షణ నెలకొని పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసుల సూచన ప్రకారం ఇరుపక్షాల నుంచి పదేసి మంది కూర్చుని చర్చించుకోవాలని నిర్ణయించారు.

ఈ క్రమంలో గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సమక్షంలో ఇరువర్గాలకు చెందిన నాయకులు సమావేశమయ్యారు. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం మధ్యాహ్నం రెండు గంటల వరకూ కొనసాగినా.. ఇరుపక్షాలు ఎవరి వాదనకు వారు కట్టుబడి ఉండడంతో వ్యవహారం ఎటూ తేలకుండానే మిగిలింది. కల్యాణమండపం నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పాటు, అన్ని అనుమతులు ఉండడంతో తాము నిర్మాణం ప్రారంభిస్తామని నిర్మాణం అడ్డుకోవడం సరికాదని టీడీపీ నాయకులు వాదించారు. అయితే.. నిధులు ఎప్పుడో మంజూరు చేసినా ఇంతవరకూ కల్యాణ మండపం ఎందుకు కట్టలేదని, తాము నిధులు తెచ్చుకుంటే పంచాయతీ అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం దేనికని వైసీపీ నాయకులు ప్రతివాదనకు దిగారు. రెండుపక్షాలు ఎవరి వాదనకు వారు కట్టుబడి ఉండడంతో ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదరలేదు. అయితే వ్యవహారం ఎటూ తేలకపోవడంతో మెజారిటీ ప్రజల అభిప్రామాలను కాదని బలవంతంగా కళ్యాణమండపం కట్టాలని చూస్తే అంగీకరించేది లేదని చెపుతూ వైసీపీ నాయకులు సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చేశారు. ఈ చర్చల్లో ఎమ్మెల్యే రాజుతో పాటు, స్థానిక పంచాయతీ ఈవో చంద్రశేఖర్, టీడీపీ నాయకులు డి.గిరి పాల్గొన్నారు. కాగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనుల్లో వివాదాలు అనవసరం: ఎమ్మెల్యే రాజు

అభివృద్ధి పనుల్లో వివాదాలు గొడవలు అనవసరమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు అన్నారు. అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణం అంశమై గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. అన్ని రకాల సాంకేతిక అనుమతులతో రూ.20లక్షలతో నిర్మించే నిర్మాణానికి అందరూ ముందుకు వచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ ఉపయోగపడేలా ఈ మండపాన్ని నిర్మించేందుకు అవసరమైన పాలనాపరమైన అనుమతులతో పాటు, పంచాయతీ తీర్మానం వర్క్ ఆర్డర్ కూడా సిద్ధంగా ఉందన్నారు. ఇక పనులు ప్రారంభించాలనుకున్న సమయంలో.. ఎంపీ నిధులు మంజూరయ్యాయంటూ వైసీపీ నాయకులు హడావిడి చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మండపం నిర్మాణం నిర్వహణ బాధ్యత స్థానిక డ్వాక్రా మహిళలకే అప్పగిస్తామన్నారు. మండపం నిర్మాణానికి వైసీపీ నాయకులు నిధులు తెస్తే స్వాగతిస్తామని, ఆ నిధులు కూడా కల్యాణ మండపంలో ఇతర సౌకర్యాలకు వినియోగించవచ్చని సూచించారు.

కనకమహాలక్ష్మి పూజలు



విశాఖపట్నం: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణమాసోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలతో శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. లక్ష్మీహోమం, పూర్ణాహుతి జరిపారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో అమ్మవారికి పంచామృతాభిషేకాలు జరిపారు.

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్

అనకాపల్లిటౌన్: స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం రైల్వేస్టేషన్‌లో అధికారులు, సిబ్బంది స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఫ్లాట్‌ఫారాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే కాకుండా ఫ్లాట్‌ఫారాలపై ఉన్న మొక్కల్లో వ్యర్థపదార్థాలను తొలగించి పరిశుభ్రంగా తయారు చేయించారు. అలాగే స్టేషన్ ఆవరణలో కూడా స్వచ్ఛభారత్ నిర్వహించారు. సమీపంలో ఉన్న విద్యా సంస్థలో స్టేషన్ సూపరింటెండెంట్ కొమ్ముశెట్టి పార్థసారథి, ఆర్‌పీఎఫ్ సిఐ చంద్రశేఖర్‌లు స్వచ్ఛభారత్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు, టీసీలు పాల్గొన్నారు.



ఫ్లాట్‌ఫారాలను పరిశుభ్రం చేయిస్తున్న అధికారులు

బయోమెట్రిక్ తప్పక పాటించాలి

ఉపాధ్యాయులు, విద్యార్థులకు డిప్యూటీ డీఈవో రేణుక సూచన



మాట్లాడుతున్న రేణుక

ఎలమంచిలి: విద్యా రంగంలో ప్రభుత్వం తీసుకువస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా అందరూ విధులు నిర్వర్తించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి సీవీ రేణుక అన్నారు. ఎలమంచిలి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు స్కూలులో బయోమెట్రిక్ అమలు విధానంపై 19 మండలాల కో ఆర్డినేటర్స్‌కు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధ్యాపకులు, విద్యార్థులు ఈ బయోమెట్రిక్ విధానాన్ని పాటించాలని అన్నారు. బయోమెట్రిక్ హాజరును శత శాతం సాధించేలా అధ్యాపకులు కూడా తమ వంతు కృషి చేయాలని కోరారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల బయోమెట్రిక్ హాజరు విధానం అమల్లో ఎలమంచిలిని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని తగు చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె అన్నారు. ఈ విధానం ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు ముఖ్యమంత్రి డాష్ బోర్డుకు అనుసంధానమై ఉంటుందన్నారు. అనంతరం బయోమెట్రిక్ అమలు విధి విధానాలపై జిల్లా కోఆర్డినేటర్ సుసర్ల సూర్యప్రకాశరావు, రాష్ట్ర రిసోర్సు పర్సన్‌లు గొట్టేటి రవి, సీహెచ్, సత్యన్నారాయణ శాస్త్రి, మండల విద్యాశాఖ అధికారి మూర్తి, స్థానిక హెచ్‌ఎం సాయిబాబు, 19 మండలాల అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులుపెడితే ఉపేక్షించం

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సన్యాసిరావు



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసిరావు

అనకాపల్లి రూరల్: రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఎస్సీ, ఎస్టీలపై తప్పుడు కేసులు పెడితే ఉపేక్షించేదిలేదని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సన్యాసిరావు చెప్పారు. స్థానిక కె.గోవిందరావు భవనంలో మాల మహానాడు సమావేశం గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామానికి చెందిన దళితుడు కంకణాల శ్రీనివాసరావుపై దురుద్దేశ్యంతో, కొందరి ప్రోద్భలంతో రౌడీషీట్ ఓపెన్ చేశారని, అయితే దానిపై మాల మహానాడు తరపున పోరాడి దానిని ఎత్తివేయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికైన ఇటువంటి పనులు మానుకోవాలని కోరారు. అనంతరం మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోడి వెంకటరావు, అనకాపల్లి పట్టణ అధ్యక్షునిగా గుడాల తాతబాబులను నియమిస్తున్నట్లు సన్యాసిరావు ప్రకటించారు. ఈ సమావేశంలో మాలమహానాడు నాయకులు కొరివి సుందరరావు, మర్రా చంద్రశేఖర్, కె.శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు డీడీలు సేకరణ



లబ్దిదారుల నుంచి డీడీలు పొందుతున్న హౌసింగ్ అధికారులు

అనకాపల్లిటౌన్, ఆగస్టు 17: స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో ఇళ్ల స్థలాల లబ్దిదారులు అధికసంఖ్యలో గురువారం హాజరై తమకు అవసరమయ్యే ఇంటికి సంబంధించి డీడీలను గృహ నిర్మాణ శాఖ అధికారులకు అందజేశారు.

ఇక్కడికి సమీపంలోని సత్యనారాయణపురం లేఅవుట్‌లో మూడు విభాగాల్లో ఇళ్ల నిర్మాణాలు జరగనున్న విషయం తెలిసిందే. దీంతో లబ్దిదారులు తమ కంట్రిబ్యూషన్ కింద చెల్లించాల్సిన డీడీలను అధికారులకు అందజేశారు.

Who can approach Insurance Ombudsman?

BANK PO/ CLERKS EXAM SPECIAL

BANKING KNOWLEDGE / FINANCIAL AWARENESS

1. What is PMVVY? Give details.
a) Pradhan MantriVayaVandanaYojana (PMVVY)
b) The scheme is open to people aged 60 years and above
c) For monthly pension, the minimum amount to be invested is Rs.1.5 lakhs and the maximum is Rs.7.5 lakhs. LIC has been given mandate to operate the scheme
d) The scheme is exempt from GST
e) All the above

2. When currency notes of denominations of Rs. 1000 and Rs. 500 (specified bank notes or SBNs), valued at Rs. 15.4 trillion and constituting 86.9 percent of the value of total notes in circulation, were demonetized?
a) 2015 b) November 8, 2016
c) 2014 d) 2012 e) 2011

3. MSM releases will also feature salient facts, data and tables that are germane to the topic. What is MSM (in RBI)?
a) Money Street Memos
b) Mint Street Memos
c) Many Street Memos
d) Most Stressed Memos
e) None of these

4. Current Account and Saving Account (CASA) deposits are called as what?
a) High cost deposits b) Costly deposits
c) Low cost deposits d) Fixed deposits
e) None of these

5. Pradhan Mantri Jan-DhanYojana (PMJDY) accounts can be linked with which of the following?
a) Aadhar card number and mobile phone number
b) PMSBY or PMJJBY c) APY
d) All the above e) None of these

6. A significant amount of Specified Bank Notes (SBNs) viz., Rs.500 (old) & Rs. 1000 (old) flowed into which of the following special types of accounts in 2016?
a) Basic Saving Bank Deposit Account (BSBDA);
b) PMJDY Accounts; Kisan Credit Card (KCC);
c) Dormant or inoperative accounts; co-operative banks' accounts with SCBs;
d) Bullion trader/jewellers' accounts; and loan accounts.
e) All the above

7. About 85 per cent of the total collections by LIC of India in November 2016 were under which of the following?
a) The 'single premium' policies, which are paid in lump sum
b) Monthly c) Quarterly
d) Annually e) None of these

8. The Reserve Bank's Central Board, at its meeting held recently, approved the transfer of surplus to the Government of India amounting to Rs. 306.59 billion for the year ended________ .
a) June 30, 2017 b) December 2016
c) March 31, 2017 d) April 30, 2017
e) None of these

9. Which type of General Insurance Policies can be purchased online?
a) Motor (2-wheeler & Private car)
b) Health/ Personal Accident/
c) Overseas Mediclaim/ Householder/
d) Shopkeeper/ Pravasi Bhartiya Bima Yojana
e) All the above

10. When a person can renew his general insurance policy?
a) Only from 30 days before the expiry date of policy till the date of expiry
b) Within one year from the date of expiry
c) Within 2 years from the date of expiry
d) Within 5 years from the date of expiry
e) None of these

11. Who are entitled to join PRADHAN MANTRI SURAKSHA BIMA YOJANA?
a) All savings bank account holders in the age 18 to 70 years in participating banks
b) Below 5 years of age
c) Below 10 years of age
d) Below 12 years of age
e) None of these

12. What is the premium per member under PMSBY?
a) Rs.12/- per annum per member
b) Rs.100/- c) Rs.150/-
d) Rs.250/- e) None of these

13. Who is the Master Policy Holder for PMSBY?
a) LIC b) RBI
c) Participating Bank will be the Master policy holder on behalf of the participating subscribers
d) NABARD e) None of these

14. What is "Group insurance"?
a) Insurance for only one person
b) Insurance cover obtained by a group of individuals, either through an employer or otherwise, under a single contract;
c) Insurance for a married couple only
d) Insurance only for unmarried person
e) None of these

15. What is the method of Appropriation of Premium in PMSBY?
a) Insurance Premium to Insurance Company: Rs.10/- per annum per member
b) Reimbursement of Expenses to BC/ Micro/Corporate/Agent : Rs.1/- per annum per member
c) Reimbursement of Administrative expenses to participating Bank: Rs.1/- per annum per member
d) All the above e) None of these

16. Insurance Ombudsmen are appointed by the Governing Body and are empowered to entertain which type of complaints in respect of personal line insurances?
a) any partial or total repudiation of claims by an insurer
b) Any dispute in regard to premium paid or payable in terms of the policy
c) any dispute on the legal construction of the policies in so far as such disputes relate to claims
d) delay in settlement of claims; and non-issue of any insurance document to customers after receipt of premium
e) All the above

17. Who can approach Insurance Ombudsman?
a) Any aggrieved individual who has taken an insurance policy on persona lines
b) if deceased the legal heir(s) under such policy
c) Both (a) and (b) d) Supreme Court
e) None of these

18. Is there any time limit to approach the insurance ombudsman?
a) Within one year of the rejection by the insurer of the representation of the complaint or the insurer's final reply to the representation
b) Within 2 years c) Within 4 years
d) Within 5 years e) None of these

19. When the accident cover for the member shall terminateand nobenefit will be payable, under PMSBY?
a) On attaining the age of 50 years
b) On attaining age 70 years (age nearest birth day).
c) On attaining the age of 40 years
d) On attaining the age of 30 years
e) None of these

20. Aninsurance Ombudsman shall be appointed for a term of how many years? Give details?
a) 3 years
b) Shall be eligible for reappointment provided that no person shall hold office as an Ombudsman after he has attained the age of seventy years.
c) Both (a) and (b)
d) After the age of 75 years
e) None of these

21. "Health insurance business" means the effecting of contracts for which of the following ?
a) For sickness benefits
b) Medical, surgical or hospital expense benefits, whether in-patient or out-patient travel cover and
c) Personal accident cover
d) All the above e) None of these

22. No policy of life insurance shall be called in question on any ground whatsoever after the expiry of how many years from the date of the policy? (i.e., from the date of issuance of the policy or the date of commencement of risk)
a) three years b) 4 years c) 5 years
d) 6 years e) None of these

23. A contract of marine insurance is an agreement whereby the insurer undertakes to indemnify the assured, in the manner and to the extent thereby agreed, against which of the following?
a) Marine losses, that is to say, the losses incidental to marine adventure
b) Air cargo c) Railway transport
d) Road transport e) None of these

24. State Bank of India (SBI) has informed that it has introduced 'Work from Home Policy' for whom? Give details?
a) Permanent Officers in the Bank.
b) The facility can be availed occasionally up to 5 days a month or for a longer duration
c) It is subject to approval by the Competent Authority not less than officers in the grade of TEGS-VI i.e. Deputy General Manager/TEGSS-I i.e. Chief General Manager
d) All the above e) None of these

25. Which bank has launched a facility where by its existing customers can avail personal loansupto Rs.15 lakhs at its ATMs?
a) ICICI Bank b) Citi Bank
c) American Express d) SBI
e) None of these

26. The second life insurer in India to go public soonis?
a) SBI Life b) LIC
c) New India Insurance
d) United India Insurance
e) Oriental Insurance

Praturi Potayya Sarma

ANSWERS

1) e	4) c	7) a	12) a	17) c	22) a
2) b	5) d	8) a	13) c	18) a	23) a
3) b	6) e	9) e	14) b	19) b	24) d
		10) a	15) d	20) c	25) a
		11) a	16) e	21) d	26) a

ఉద్యోగాలు

బిఎంఆర్‌సిఎల్

బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బిఎంఆర్‌సిఎల్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్షన్ ఇంజనీర్ పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 20

కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు

విభాగాలు - ఖాళీలు: టెలికం 2, ట్రాక్షన్ 2, ఎఎఫ్‌సి 2, సిగ్నలింగ్ 1, సివిల్ / ఆర్ఎస్ఎస్ 2, సిస్టం డిజైన్ 2, ఇ & ఎం లిఫ్ట్స్ & ఎస్కలేటర్స్ 3, టివిఎస్ & ఇసిఎస్ 2, డిపో 2

వేతనం: నెలకు రూ.35910 + ఇతర అలవెన్సులు

అర్హత: (డిప్లొమా/ బిఇ/ బిటెక్)(మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్/ మెకట్రానిక్స్/ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇండస్ట్రియల్ కంట్రోల్/ టెలి కమ్యూనికేషన్/ అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ డిజిటల్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ నెట్ వర్కింగ్/ పవర్ ఎలక్ట్రానిక్స్/ సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 35 ఏళ్లు మించరాదు

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా

అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని దాని హార్డు కాపీని కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 26

చిరునామా: General Manager(HR), Bangalore Metro Rail Corporation Limited, III Floor, BMTC Complex, K.H.Road, Shanthinagar, Bangalore 560027

వెబ్‌సైట్: www.kannada.bmrc.co.in

అడ్మిషన్స్

ఎస్‌కెఎల్‌టిఎస్‌హెచ్‌యు

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వ విద్యాలయం (ఎస్‌కెఎల్‌టిఎస్ హెచ్‌యు)- ఉద్యాన **బిఎస్సీ (ఆనర్స్)**లో ప్రవేశానికి ఉద్దేశించిన **హార్టిసెట్ 2017**కు దరఖాస్తులు కోరుతోంది.

దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేదీ: ఆగస్టు 31

దరఖాస్తు పంపాల్సిన చిరునామా: ద రిజిస్ట్రార్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్ర నగర్, హైదరాబాద్ - 500030

వెబ్‌సైట్: www.skltshu.ac.in

ఐఐఎఎస్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ (ఐఐఎఎస్)- కింద పేర్కొన్న రీసెర్చ్ విభాగాల్లో **ఫెలోషిప్**లకోసం దరఖాస్తులు కోరుతోంది

రీసెర్చ్ విభాగాలు: సోషల్/ పొలిటికల్ అండ్ ఎకనామిక్ ఫిలాసఫీ/ కంపేరటివ్ ఇండియన్ లిటరేచర్ (యాన్షెంట్/ మెడ్‌లెవల్/మోడ్రన్/ ఫోక్/ ట్రైబల్)/ కంపేరటివ్ స్టడీస్(ఫిలాసఫీ/ రెలిజియన్/ హిస్టరీ-హిస్టరియోగ్రఫీ, ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ)/ ఎడ్యుకేషన్/ కల్చర్/ ఆర్ట్స్ - పర్ఫార్మింగ్ ఆర్ట్స్, క్రాఫ్ట్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్రాబ్లమ్స్ ఆఫ్ లాజిక్ అండ్ మేథమెటిక్స్/ ఫండమెంటల్ కాన్సెప్ట్స్ అండ్ ప్లాబ్లమ్స్ ఆఫ్ నేచురల్ అండ్ లైఫ్ సైన్సెస్/ స్టడీస్ ఇన్ ఎన్విరాన్‌మెంట్/ ఇండియన్ సివిలైజేషన్ ఇన్ ద కాంటెస్ట్ ఆఫ్ ఏషియన్ నైబర్స్/ ప్రాబ్లమ్స్ ఆఫ్ కాంటెంపరరీ ఇండియా ఇన్ ద కాంటెస్ట్ ఆఫ్ నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ నేషన్ బిల్డింగ్

ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.

దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 30

చిరునామా: Secretary, Indian Institute of Advanced Study, Shimla- 171005

వెబ్‌సైట్: www.iias.ac.in

భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?

భూగోళశాస్త్రం

1. 'జాగ్రఫీ' పదాన్ని మొదట ఉపయోగించిన శాస్త్రవేత్త?
   ఎ) హెకాటియస్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
   సి) ఎరటోస్థనీస్ డి) అరిస్టాటిల్
2. భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
   ఎ) రాట్జెల్ బి) హెకాటియస్
   సి) అరిస్టాటిల్ డి) అనాగ్జిమెండర్
3. ఆధునిక భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
   ఎ) ఎరటోస్థనీస్ బి) అల్ఇద్రిసి
   సి) అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ డి) టాలమి
4. భారతదేశ భూగోళశాస్త్ర పితామహుడు ఎవరు?
   ఎ) జెమ్స్ రన్నెల్ బి) సర్‌జాన్ ఎవరెస్ట్
   సి) విలియం లాంబ్టన్ డి) ఎవరూ కాదు
5. రాజకీయ భూగోళశాస్త్ర వ్యవస్థాపకుడు ఎవరు?
   ఎ) అరిస్టాటిల్ బి) ఫ్రెడరిక్ రాట్జెల్
   సి) హెకాటియస్ డి) మెర్కేటర్
6. శాస్త్రీయంగా మొదటి ప్రపంచ పటం తయారు చేసింది?
   ఎ) హెకాటియస్ బి) అల్ఇద్రిసి
   సి) టాలమి డి) అనాగ్జిమెండర్
7. 'అట్లాస్' పదాన్ని తొలిసారి ఉపయోగించింది ఎవరు?
   ఎ) మెర్కేటర్ బి) చైనీయులు
   సి) రాట్జెల్ డి) కార్ల్ రిట్టర్
8. ప్రపంచ పటంలో దక్షిణాన్ని పైభాగంలో చూపింది ఎవరు?
   ఎ) టాలమి బి) అల్ఇద్రిసి
   సి) మెర్కేటర్ డి) హెకాటియస్
9. ఖగోళశాస్త్ర బైబిల్ అని ఏ గ్రంథాన్ని పిలుస్తారు?
   ఎ) ఆస్ట్రాలజి బి) కాల్టొగ్రఫి
   సి) ఆల్మజిస్ట్ డి) ఏదీకాదు
10. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన కోపర్నికస్ ఏ దేశస్థుడు?
    ఎ) పోలెండ్ బి) గ్రీక్ సి) స్పెయిన్ డి) హాలెండ్
11. రోదసీ యాత్రికుడికి బయట ఉన్న ఆకారం ఏ రంగులో కనిపిస్తుంది?
    ఎ) నీలం బి) ఎరుపు సి) తెలుపు డి) నలుపు
12. కింది వాటిలో విశ్వ ఆవిర్భావ సిద్ధాంతం కానిది ఏది?
    ఎ) భూకేంద్రక సిద్ధాంతం బి) బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం
    సి) డోలనా సిద్ధాంతం
    డి) నిరంతరసృష్టి సిద్ధాంతం
13. డోలనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
    ఎ) జార్జ్ అబ్జెలియోటర్
    బి) అలెన్‌శాండెజ్
    సి) హెర్మన్ బాండీ డి) థామస్ గోల్డ్



పర్వతం నాగార్జున
సీనియర్ ఫ్యాకల్టీ

14. వాయు పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
    ఎ) లాప్లాస్ బి) ఇమాన్యూయెల్ కాంట్
    సి) చాంబర్లీన్ & మౌల్టాన్
    డి) రస్సెల్స్
15. గ్రహాల పరికల్పన సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
    ఎ) ఇమాన్యూయెల్ కాంట్ బి) లాప్లాస్
    సి) జీన్స్ & జెఫ్రిన్ డి) చాంబర్లీన్ & మౌల్టన్
16. విశ్వ దీవులు అని వేటిని అంటారు?



    ఎ) గెలాక్సీలను బి) నిహారికలను
    సి) దుమ్ముధూళి కణాలను
    డి) శూన్య ప్రదేశాన్ని
17. పాలపుంతకు సమీపంలో ఉన్న గెలాక్సీ ఏది?
    ఎ) హైడ్రా బి) క్లెస్టర్
    సి) అండ్రొమెడా డి) బెటిర్‌గ్లిక్స్
18. విశ్వంలో అతి పెద్ద నక్షత్రం ఏది?
    ఎ) సూర్యుడు బి) సిరియాస్
    సి) ప్రాక్సిమాసెంటావరి డి) బెటిల్‌గ్లక్స్
19. విశ్వంలో దూరాలను కొలవడానికి ఉపయోగించే అతి పెద్ద ప్రమాణం ఏది?
    ఎ) కాంతి సంవత్సరం బి) అస్ట్రానామికల్ యూనిట్
    సి) పార్‌సెక్ డి) ఏదీకాదు
20. ఒక కాంతి సంవత్సరం =
    ఎ) 9.3×8^{10} km బి) 9.8×10^{12} km
    సి) 9.3×10^{12} km డి) 9.4×10^{12} km
21. దక్షిణ ధృవం వద్ద నుంచి ఆకాశంలో కనిపించే నక్షత్ర సమూహాన్ని ఏమంటారు?
    ఎ) ఉర్సుమెజర్ బి) గ్రెట్‌బేర్
    సి) సప్తర్షి మండలం డి) ఉర్సుమైనర్
22. గెలాక్సీలకు, నిహారికలకు మధ్య గల ఖాళీ ప్రదేశ శాతం ఎంత?
    ఎ) 97% బి) 98% సి) 99% డి) 96%
23. పాలపుంత అనే గెలాక్సీని 'స్వర్గానికి దారులు' అని ఏ దేశస్థులు పిలుస్తారు?
    ఎ) చైనా బి) గ్రీక్
    సి) హిబ్రూ డి) ఎస్కిమోలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

24. చైనా అంతరిక్ష నావికులను ఏమని పిలుస్తారు?
    ఎ) ఆస్ట్రోనాట్స్ బి) కాస్మోనాట్స్
    సి) టైకొనాట్స్ డి) ఏదీకాదు
25. నక్షత్రాలకు జన్మస్థానాలు అని వేటిని అంటారు?
    ఎ) గెలాక్సీలు బి) నిహారికలు
    సి) పాలపుంత డి) శూన్యప్రదేశం
26. కృష్ణబిలాలను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
    ఎ) ఐన్‌స్టీన్ బి) రాస్‌గన్
    సి) స్టీఫెన్ హకిన్స్ డి) ఆల్ఫ్‌వెస్
27. కృష్ణబిలాలపై పరిశోధన చేసిన భారతీయుడు ఎవరు?
    ఎ) సుబ్రమణ్యం చంద్రశేఖర్
    సి) వెంకట్రామన్ రాధాకృష్ణన్
    సి) హరగోవింద్ ఖొరానా డి) ఎవరూ కాదు
28. నక్షత్రాల్లో అధిక శాతం గల వాయువు?
    ఎ) హీలియం బి) నైట్రోజన్
    సి) ఆక్సిజన్ డి) హైడ్రోజన్
29. నక్షత్రాల్లో ఉష్ణోగ్రతను కొలిచే పరికరం?
    ఎ) క్రైమోమీటర్ బి) కాస్మోక్రొనా
    సి) పైరోమీటర్ డి) ఏదీకాదు
30. గ్రహాల జాబితా నుంచి తొలగించిన ప్లూటో గ్రహానికి ఏ నంబర్ కేటాయించారు?
    ఎ) 134340 బి) 144240 సి) 134240 డి) 134342
31. సూర్యుని పరిభ్రమణ కాలం ఎంత?
    ఎ) 250 కాంతి సంవత్సరాలు
    బి) 250 మిలియన్ సంవత్సరాలు
    సి) 27 మిలియన్ సంవత్సరాలు డి) ఏదీకాదు
32. సూర్యుని కాంతి భూమిని చేరడానికి పట్టే కాలం?
    ఎ) 500 సెకన్లు బి) 600 సెకన్లు
    సి) 450 సెకన్లు డి) 550 సెకన్లు
33. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే భాగం ఏది?
    ఎ) ఫ్రోటోస్పియర్ బి) కరోనా
    సి) క్రోమోస్పియర్ డి) ఏదీకాదు
34. ఆకాశంలో ఇంద్రధనస్సు ఏర్పడటానికి కారణం?
    ఎ) కాంతి విక్షేపణం బి) కాంతి పరిక్షేపణం
    సి) కాంతి అవక్షేపణం డి) కాంతి వివర్తనం
35. సూర్యునికి, భూమికి మధ్య ఉండే గరిష్ఠ దూరం?
    ఎ) 147 మిలియన్ కి.మీ.
    బి) 149.5 మిలియన్ కి.మీ.
    సి) 152 మిలియన్ కి.మీ.
    డి) 153 మిలియన్ కి.మీ.
36. సూర్యగ్రహణ సమయంలో సూర్యునిలో కనిపించే భాగం?
    ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
    సి) కరోనా డి) ఏదీకాదు
37. సూర్యునిలో అతి చల్లని ప్రాంతం?
    ఎ) క్రోమోస్పియర్ బి) సూర్యాంకాలు
    సి) కరోనా డి) ఏదీకాదు
38. సూర్యుని గురుత్వాకర్షణశక్తి భూమి కంటే ఎన్ని రెట్లు ఎక్కువ?
    ఎ) 28 రెట్లు బి) 27 రెట్లు సి) 13 రెట్లు డి) 29 రెట్లు
39. సూర్యునిలో అత్యంత వేడిగా ఉండే ప్రాంతం?
    ఎ) ఫొటోస్పియర్ బి) క్రోమోస్పియర్
    సి) కేంద్రం డి) ఏదీకాదు
40. ఉదయం, సాయంత్రం సమయాల్లో సూర్యునిలో కనిపించే రంగులు?
    ఎ) ఎరుపు, నారింజ బి) ఎరుపు, ఆకుపచ్చ
    సి) ఎరుపు, తెలుపు డి) ఎరుపు - పసుపు

సమాధానాలు

1) సి	7) ఎ	13) బి	20) సి	27) ఎ	34) ఎ
2) బి	8) బి	14) బి	21) డి	28) డి	35) సి
3) సి	9) సి	15) డి	22) ఎ	29) సి	36) సి
4) ఎ	10) ఎ	16) ఎ	23) బి	30) ఎ	37) బి
5) బి	11) డి	17) సి	24) సి	31) బి	38) ఎ
6) డి	12) ఎ	18) డి	25) బి	32) ఎ	39) సి
		19) సి	26) సి	33) సి	40) ఎ

ఉద్యోగాలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - రెగ్యులర్ & కాంట్రాక్ట్ స్పెషలిస్ట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 21
రెగ్యులర్ పోస్టులు: డిజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, ఎజిఎం(సైబర్ సెక్యూరిటి) 1, డిఎం(ఐఎస్ ఆడిట్) 5
కాంట్రాక్ట్ పోస్టులు: వైస్ ప్రెసిడెంట్- కస్టమర్ అనలిటిక్స్(ఎసెట్ ప్రోడక్ట్స్) 1, సీనియర్ మేనేజర్(ప్రోడక్ట్ స్పెషలిస్ట్) 2, వైస్ ప్రెసిడెంట్ - కంప్లయింట్స్ మేనేజ్‌మెంట్ 1, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఐఎస్ ఆడిట్) 5, సీనియర్ మేనేజర్ (ఐఎస్ ఆడిట్) 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.sbi.co.in

సిసిఆర్‌హెచ్

సెంట్రల్ కౌన్సెల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి (సిసిఆర్‌హెచ్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన **జూనియర్ రీసెర్చ్ ఫెలో**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
క్యాంపస్‌లు: రీజనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, గుడివాడ క్లినికల్ రీసెర్చ్ యూనిట్, తిరుపతి
వేతనం: నెలకు రూ.25,000 + హెచ్ఆర్ఏ
ఎంపిక: టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఇంటర్వ్యూ: ఆగస్టు 26న
వెబ్‌సైట్: www.ccrhindia.nic.in

ఐఐఎఫ్‌పిటి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ (ఐఐఎఫ్‌పిటి)- కింది పోస్టుల భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
పోస్టులు - ఖాళీలు: రీసెర్చ్ అసోసియేట్ 1, సీనియర్ రీసెర్చ్ ఫెలో 2, జూనియర్ రీసెర్చ్ ఫెలో 4, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 2
దరఖాస్తు ఫీజు: 500 **ఇంటర్వ్యూ:** ఆగస్టు 22న
వేదిక: Indian institute of food processing Technology, pudukkottai road, Thanjavur-613005, Tamilnadu.
వెబ్‌సైట్: www.iifpt.edu.in

ఎన్ఐపిసిసిడి

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ కో ఆపరేషన్ & చైల్డ్ డెవలప్‌మెంట్ (ఎన్ఐపిసిసిడి)- కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 25
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(సైన్స్/ కామర్స్/ సోషల్ సైన్స్) లేదా తత్సమాన అర్హత ఉన్నవారు అర్హులు. పిహెచ్‌డి/ ఎంఫిల్ + ప్రొఫెషనల్ / టెక్నికల్ నాలెడ్జ్ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
వయసు: 65 ఏళ్లకు మించరాదు
వేతనం: నెలకు రూ.45,000
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: www.nipccd.nic.in/vac.html

సిఎస్ఐఆర్ - ఐఎంఎంటి

సిఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటి)- **ప్రాజెక్ట్ స్టాఫ్** భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
ఖాళీలు: 13
అర్హత: బిఎస్సీ(మినరల్ ప్రాసెసింగ్/కెమిస్ట్రీ)/ ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ) / ఎంటెక్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్/ సైన్స్/ మినరల్ ప్రాసెసింగ్/ కెమికల్ ఇంజనీరింగ్/ బయో టెక్నాలజీ)/ (బిఇ/ బిటెక్)(మెటలర్జీ/ కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్)/ డిప్లొమా (మెటలర్జీ/ మెకానికల్/ కెమికల్) పూర్తిచేసి ఉండాలి.
ఇంటర్వ్యూలు: ఆగస్టు 29, 30
వెబ్‌సైట్: www.immt.res.in

బిఆర్ఎయు

డా. బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ - ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 5
విభాగాలు: లా 1, సోషల్ వర్క్ 1, బయో టెక్నాలజీ 1, మేథమెటిక్స్ 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ 1
దరఖాస్తు ఫీజు: రూ.2000
పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 29 **వెబ్‌సైట్:** www.brau.edu.in

ఐడబ్ల్యుఎస్‌టి

బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ & టెక్నాలజీ (ఐడబ్ల్యుఎస్‌టి)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 6
పోస్టులు: స్టెనోగ్రాఫర్ (గ్రేడ్ 2)1, ఎల్‌డిసి 3, ఫారెస్ట్ గార్డ్ 2. అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపుకోవాలి
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
చిరునామా: Director, Institute of Wood Science & Technology, 18 th Cross, PO Malleswaram, Bengaluru- 560003
వెబ్‌సైట్: http://iwst.icfre.gov.in

ఉత్సాహంగా... ఉల్లాసంగా

దివ్యాంగుల క్రికెట్ పోటీలు

ఉక్కు టౌన్‌షిప్, ఆగస్టు 17: ఏపీ నార్త్ జోన్ దివ్యాంగుల క్రికెట్ పోటీలు విశాఖ ఉక్కు స్టేడియంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరిగి ఈ పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. దివ్యాంగులు ఎంతో ఉల్లాసంగా..ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఒక చేతితో బౌలింగ్ చేయడంతో పాటు ఒక చేతితోనే బ్యాటింగ్ చేసి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. ఆద్యంతం దివ్యాంగులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో నాలుగు జిల్లాలకు చెందిన సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వారిని సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తారు. తొలుత ఈ పోటీలను ఉక్కు క్రీడా విభాగాధిపతి ఎంఎస్ కుమర్, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాటం ఎస్.చంద్రరావు ప్రారంభించారు. కార్యక్రమంలో దువ్వాడ సీఐ ఎన్.సాయి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మధుసూధన్ నాయక్, ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అన్వేశ్, క్రీడా విభాగం అధికారులు శ్రీనివాసరావు, క్రాంతికుమార్, స్టీల్‌ప్లాంట్ ఎస్ఐ ఎస్.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగుడి బౌలింగ్...


ఒంటి చేత్తో బ్యాటింగ్!

విశాఖపట్నం, విజయనగరం జట్లు తలపడగా... టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన విజయనగరం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 14.1 ఓవర్లకు 76 పరులు చేసి ఆలౌట్ అయింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 9.3 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 77 పరుగులు చేసి విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లు తలపడగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 13.1 ఓవర్లలో 89 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన తూర్పుగోదావరి జట్టు 10.2 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసి విజయం సాధించింది.

1234...రూ.2.11 లక్షలు!

666...రూ.2.1 లక్షలు

ఫ్యాన్సీ నంబర్లకు పెరిగిన పోటీ

రవాణా శాఖకు రెండవ రోజు రూ.9.2 లక్షల ఆదాయం

ప్రతి నంబర్ వేలం వేసిన అధికారులు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా రెండో రోజు రవాణా శాఖకు రూ.9.2 లక్షల ఆదాయం సమకూరింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రవేశ పెట్టాక తొలిసారి తొమ్మిది నంబర్లకు వేలం వేయడంతో రాజకీయ నాయకుల అనుచరుల కోలాహలం అధికంగా కనిపించింది. జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు, ఇద్దరు మంత్రుల తరపున కొందరు ఫ్యాన్సీ నంబర్ల కోసం కార్యాలయంలో పడిగాపులు కాశారు. గతంలో అయితే.. పోటీకి వచ్చిన వారికి నచ్చజెప్పి కావలసిన నంబరు ప్రజాప్రతినిధులకు దక్కేలే చేసే బాధ్యతను రవాణా అధికారులే తీసుకునేవారు. ఇటీవల కాలంలో ఆ విధానానికి స్వస్తి చెప్పడంతో ఎవరి ప్రయత్నాలు వారు చేసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన ధర చెల్లించి ఫ్యాన్సీ నంబరు సొంతం చేసుకోవడం దాదాపు అసాధ్యంగా మారింది. ఎంపీల తరపున వచ్చిన కొందరు 1234 నంబరుకు పోటీ పడ్డారు. అయితే అదే నంబరుకు నలుగురు ముందుకు రావడంతో ఆక్షన్ తప్పలేదు. ఈ నంబరు కోసం ప్రభుత్వం నిర్దేశించిన ధర కేవలం రూ.పదివేలు కాగా, పోటీ వల్ల రూ.2.11 లక్షలకు చేరుకుంది. రూ.పది వేల నంబరు రూ.లక్షలు పలకడం అరుదుగా జరిగే విషయం. గతంలో ఒకసారి మాత్రమే ఈ విధంగా జరిగింది. ఈ నంబరు గతంలో రూ.15 వేల నుంచి రూ.25 వేల లోపే దక్కించుకునేవారు. అలాగే 666 నంబరుకు పలువురు పైరవీలు చేశారు.

రూ.6,40,360 లక్షల ఆదాయం

తొలిరోజు వివిధ లక్కీ, ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రూ.5.43 లక్షల ఆదాయం రాగా, రెండో రోజు తొమ్మిది నంబర్ల ద్వారా రూ.6.4 లక్షల ఆదాయం లభించింది. ఈ తొమ్మిది నంబర్లతోపాటు వేలానికి వెళ్లిన నంబర్లన్నింటికీ కలిపి ఒక్క రోజులో రూ.9.2 లక్షల ఆదాయం వచ్చింది. ఇందులో అత్యధికంగా ఏపీ 31 డీఎఫ్ 1234 నంబరుకు రూ.2.11 లక్షలు లభించింది. అలాగే 666కు రూ.2.1 లక్షలు, 567కు 71,500, 1818కు రూ.75 వేలు, 1314కు రూ.30 వేలు, 1899కు రూ.42 వేలు, 2277కు రూ.52,200 లభించింది. దాదాపు అన్ని నంబర్లకు పోటీ అనివార్యం కావడంతో మధ్యాహ్నం బిడ్డింగ్ ప్రక్రియను ఇన్‌చార్జి ఆర్టీఏ మాన్‌దాత్ నిర్వహించారు.

ఒకేసారి పెట్టడంతో..

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల వల్ల ఫ్యాన్సీ నంబర్ల వేలం గత ఏడాదిన్నర కాలంగా నిలిచిపోయింది. చాలాకాలం పాటు వేచిచూసిన వాహన యజమానులు విసుగుచెంది ఇతరత్రా నంబర్లతో సరిపెట్టుకున్నారు. ఎట్టకేలకు ఆఫ్‌లైన్‌లో ఆయా నంబర్లను కేటాయిస్తున్నట్టు అధికారులు ప్రకటించడంతో భారీగా వాహనదారులు ఫ్యాన్సీ నంబర్ల కోసం ఎగబడుతున్నారు. శుక్ర, శనివారాల్లోనూ కొన్ని ముఖ్యమైన ఫ్యాన్సీ నంబర్లు వేలానికి రానున్నాయి. వాటి ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం సమకూరనుంది.

నేడు వేలం వేయనున్న నంబర్లు..

0999, 1111, 2222, 3333, 4444, 1116, 3366, 2345, 2727, 2799, 3636, 3699, 4545, 4554, 4567

జైలుశిక్ష పడిన ఉద్యోగికి జీతం!

విధుల్లోను కొనసాగింపు

రెండు నెలల క్రితం ఉద్యోగుల సంఘం ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

ఇది ఓ విచిత్రమైన కేసు. ఓ గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖాధికారులకు దొరికిపోయాడు. ఆ కేసు ఏసీబీ న్యాయస్థానంలో రుజువైంది. రెండు సెక్షన్ల కింద న్యాయమూర్తి రెండేళ్ల చొప్పున జైలుశిక్ష, రూ.2 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రభుత్వ ఉద్యోగికి జైలుశిక్ష పడితే వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాల్సి వుంటుందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. ఈ కేసులో ఆ ఉద్యోగిని జైలుకు తరలించకుండా, తిరిగి మరో ప్రాంతానికి బదిలీ చేసి అక్కడ కొనసాగిస్తూ నెలనెలా జీతాలు ఇచ్చారు. ఈ విషయం ఈ నోట ఆ నోట పాకి బయటకు రావడంతో ఆకస్మికంగా ఆ ఉద్యోగి అదృశ్యమైపోయాడు. దీనిపై ఉద్యోగ సంఘాలు జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి రెండు నెలలైంది. ఇప్పటివరకు ఎటువంటి చర్యలు లేవు.

ఇదీ జరిగింది

పిల్లిగుల్లి సురేశ్ అనే గ్రామ రెవెన్యూ అధికారి రోలుగుంట మండలం కుసర్లపూడిలో పనిచేస్తున్నప్పుడు రూ.2 వేలు లంచం తీసుకుంటూ 2008లో ఏసీబీకి దొరికిపోయాడు. ఈ కేసు ఏసీబీ న్యాయస్థానంలో చాలాకాలం విచారణ జరిగింది. చివరకు ఆయన లంచం తీసుకున్నట్టు రుజువైంది. రెండు సెక్షన్ల కింద వీఆర్ఓ సురేశ్‌కు రెండేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. అంటే నాలుగేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా కట్టాలి. ఈ తీర్పుపై వీఆర్ఓ అప్పీల్‌కు వెళ్లవచ్చు. కానీ వెళ్లలేదు. అంటే శిక్ష అమలు కావాలి. అయితే ఆయన జైలుకు వెళ్లలేదు. విధుల్లోనే కొనసాగాడు. ఈ తీర్పు (26-11-2014) వచ్చినప్పుడు ఆయన కొయ్యూరు మండలంలో పనిచేస్తున్నాడు. వెంటనే అక్కడి నుంచి జి.మాడుగులకు బదిలీ చేశారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. జి.మాడుగులలో 2015 జనవరి నుంచి ఫిబ్రవరి 2016 వరకు జీతం తీసుకున్నాడు. అక్రమంగా విధుల్లో కొనసాగుతున్నాడని బయటకు రావడంతో అక్కడి నుంచి అదృశ్యమైపోయాడు. ఈ వీఆర్ఓ ఉద్యోగ సంఘ నాయకులకు కావలసిన వ్యక్తి కావడంతో వారంతా అతడిని రక్షించడానికి ఈ విధంగా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇవీ లోపాలు

- రోలుగుంట తహసీల్దార్‌కు తీర్పు కాపీ అందించలేదు.
- కొయ్యూరు తహసీల్దార్‌కు కూడా కేసు విషయం తెలియపరచలేదు. అక్కడి నుంచి బదిలీ చేశారు.
- జి.మాడుగుల తహసీల్దార్‌కు కూడా సురేశ్‌పై కేసు వున్న విషయం, శిక్ష పడిన సంగతి తెలియదు. దాంతో విధుల్లో చేర్చుకున్నారు. అక్కడ ఆయనకు సుమారుగా రూ.2 లక్షలకు పైగా జీతం అందించారు.
- ఆకస్మికంగా ఎందుకు విధులు మానేసి వెళ్లిపోయాడో విచారణ కూడా లేదు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.35
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.60
వంకాయలు(తెల్లవి)	రూ.35
వంకాయలు(నల్లవి)	రూ.35
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.30
బీన్స్	రూ.70
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.40
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.40
దోసకాయ	రూ.30
కాకరకాయలు	రూ.40
ఆనపకాయ(చిన్నది)	రూ.15
ఆనపకాయ(పెద్దది)	రూ.20
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.70
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో	
విశాఖపట్నం	362
విజయనగరం	366
శ్రీకాకుళం	366


చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	87.00	85.00
విత్ స్కిన్	122.00	140.00
స్కిన్ లెస్	144.00	150.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3670	4000
రెండో రకం	3210	3800
మూడో రకం	2800	3150

దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 3, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. విద్యా సంస్థల్లో ప్రవేశానికి అనుకూలం. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. కుటుంబసభ్యుల వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లకు అనుకూలం. సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. ఇంటికి అవసరమైన వస్తువులు సమకూర్చుకుంటారు. చర్చలు, ప్రయాణాలు లాభిస్తాయి.



మిథునరాశి: (మే21-జూన్21): బిల్లులు, చెక్కులు అందుకుంటారు. సన్నిహితుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఆర్థిక విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఈ విషయాల్లో కొత్త ఆలోచనలు అమలు చేసేందుకు తగిన సమయం. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): సినీ, రాజకీయ రంగాల వారు లక్ష్యాలు సాధిస్తారు. దీర్ఘకాలంగా వాయిదాపడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. అలజడి తగ్గి మనశ్శాంతి లభిస్తుంది. ఆధ్యాత్మిక దృక్పథం పెరుగుతుంది.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేస్తారు. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. న్యాయ, బోధన, రక్షణ రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): రాజకీయ, బోధన, న్యాయ, రక్షణ రంగాల వారు ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల సహకారం లభిస్తుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం అందుకుంటారు. సంకల్పం నెరవేరుతుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలకు అనుకూలం. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): స్పెక్యులేషన్లు, పెట్టుబడులపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. శ్రీవారు, శ్రీమతి సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): వృత్తిపరమైన సమావేశాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో భాగస్వామి సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. విందులు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సన్నిహితుల ఆరోగ్యం మెరుగుపడుతుంది.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమానుబంధాలు బలపడతాయి. వైద్య, ఇంజనీరింగ్ విద్యార్థులకు శుభప్రదం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

జంబ్లింగ్ వర్డ్స్

1. BONB ▸..................
2. YABB ▸..................
3. TOAC ▸..................
4. CHIR ▸..................
5. ICNH ▸..................

జంతర్‌మంతర్

1. ర్ణయంని ▸..................
2. భఅయం ▸..................
3. దులుస్తు ▸..................
4. రోపక్షం ▸..................
5. యికిరా ▸..................

చెప్పగలరా?

విసుగులో ఉన్నా కానీ
ముసుగులో లేను
జేబులో ఉన్నా కానీ జాబులో లేను
గీతలో ఉన్నా కానీ గీటులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

సమస్త తప్పిదాలకూ కారణం మనసు. దాన్ని సరిగ్గా ఉంచుకుంటే ఎప్పటికీ తప్పులు చేయవు.

- గౌతమ బుద్ధుడు

'ఐక్యూ'లో ఐన్‌స్టీన్‌ను దాటేశాడు!



ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా రాహుల్ అనే కుర్రాడి ఐక్యూ (ఇంటెలిజెంట్ కోషంట్) గురించి గూగుల్‌ను ఎక్కువ శాతం అడుగుతున్నారట. బ్రిటన్‌లోని చానెల్ 4 టీవీలో 'చైల్డ్ జీనియస్' కార్యక్రమం ప్రారంభమైంది. తొలి రౌండ్‌లోనే గట్టోడు అనిపించుకున్న రాహుల్ ఓవర్‌నైట్ హీరో అయ్యాడు. ఈ బుడతడు భారత సంతతికి చెందినవాడు కావటం మరో విశేషం.

రాహుల్ కుటుంబం ఉత్తర లండన్‌లోని బార్నెట్ ప్రాంతంలో నివసిస్తోంది. రాహుల్ తండ్రి మనీష్ ఐటి కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. తల్లి కోమల్ ఫార్మసిస్ట్. రాహుల్ వయసు పన్నెండేళ్లు. బ్రిటన్‌లోని 4 చానల్‌లో ఓ వారం పాటు జరిగిన 'చైల్డ్ జీనియస్' కార్యక్రమంలో రాహుల్ పాల్గొంటున్నాడు. ఈ పోటీ కోసం సదరు కార్యక్రమ నిర్వాహకులు 8-12 ఏళ్లలోపు వయసున్న 20 మందిని ఎంపిక చేశారు. వారే పోటీలో పాల్గొంటారు. తొలి రౌండ్‌లోనే రాహుల్ కత్తిలాంటి కుర్రాడనిపించుకున్నాడు. స్పెల్లింగ్ టెస్ట్‌లో పూర్తి మార్కులు పొందాడు. జ్ఞాపకశక్తి పరీక్షలో 15 ప్రశ్నలకు గానూ 14 ప్రశ్నలకు సరైన సమాధానాలిచ్చాడు. అతని ఐక్యూ లెవల్‌ను 162గా నిర్ధారించారు. ఇది ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ ఐక్యూ లెవల్ కంటే ఎక్కువ కావటంతో రాహుల్ మోస్ట్ పాపులరయ్యాడు. ఇక తదుపరి పరీక్షల తర్వాత ఈ వీకెండ్‌లో విజేతను ప్రకటిస్తారు.



4 చానల్ 'చైల్డ్ జీనియస్' కార్యక్రమానికి హాజరైన చిన్నారులు

లాటిన్ భాషపై ప్రేమ..

"మ్యాథ్స్, జీకే అంటే ఇష్టం. నా ఫేవరేట్ భాష లాటిన్. నాకు తెలిసి నేను మేధావి అనుకుంటా. ఏ విషయాన్నైనా సులువుగా గుర్తుంచుకుంటాను. ఎప్పుడూ అందరికంటే ది బెస్ట్ ఉండాలి.. అనుకునే మెంటాలిటీ నాది" అంటూ రాహుల్ చెప్పుకొచ్చాడు. ఏదైనా రివైజ్ చేసుకోలేకపోతే రాహుల్ బాధపడిపోతాడట. ఆటలాడుకునే ఆడుకునే ఎక్స్ బాక్స్ తన దగ్గర ఉంటే తెగ హ్యాపీగా ఫీలవుతాడట ఈ బాల మేధావి.

మా వాడే విజేత

రాహుల్ జ్ఞాపకశక్తి భేష్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. అన్నట్లు విశేషమేంటంటే రాహుల్ శిక్షణ తీసుకుంది స్వయాన తన తండ్రి దగ్గరే. మొత్తానికి రాహుల్ తలితండ్రులు మాత్రం ఈ పోటీలో తమ కొడుకు విజేతగా నిలుస్తాడని నమ్మకంగా చెబుతున్నారు. ఈ వారాంతంలో జరిగే ఫైనల్‌లో రాహుల్ విజేత కావాలని మనమూ కోరుకుందాం!


టంగ్ ట్విస్టర్స్

1. Who ever slit the sheets is a good sheet slitter.
2. Crush grapes, grapes crush, crush grapes.
3. There was a minimum of cinnamon in the aluminum pan
5. A black bloke's back brake-block broke.


ఔనా!

ఎక్కువ ఐక్యూ (ఇంటెలిజెంట్) ఉన్న వాళ్లకు బ్రెయిన్ యాక్టివిటీ కూడా ఎక్కువే! ఆ కారణంగా వీళ్లు డిప్రెషన్‌కు గురైతే ఆ ప్రభావం మిగతా వాళ్లకంటే వీళ్లపై 3 రెట్లు ఎక్కువగా ఉంటుంది.

బొమ్మ గీయండి



రంగులు




నవ్వుల్ నవ్వుల్

టీచర్ : రోహిత్ కళ్లు మూసుకుని రాస్తున్నావేంటి?
రోహిత్ : పరీక్షల్లో చూసి రాయకూడదని మా అమ్మ చెప్పింది టీచర్.
టీచర్ : !!!

చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



జత పరచండి



జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. NOBB 2. BABY 3. COAT 4. RICH 5. CHIN **జంతర్‌మంతర్ :** 1. నిర్ణయం 2. అభయం 3. దుస్తులు 4. పరోక్షం 5. కిరాయి **చెప్పగలరా? :** విజేత




తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 16 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 16 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 23 నుంచి డిసెంబర్ 16 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఆగస్టు 28 నుంచి నవంబర్ 30 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 2,5,19, 23, 27, 28, 29, 30 అక్టోబర్ 1,7, 14 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : అక్టోబరు 18వ తేదీ ఉన్నాయి.

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,
ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం

APSRTC



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 14859



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కామినేని శ్రీనివాసరావు చిత్రంలో మంత్రి అయ్యన్న



వైద్య సేవలకు సీఎం అధిక ప్రాధాన్యం

- రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా వైద్య శాఖకు పూర్తి నిధులు
- మాతాశిశు మరణాలు తగ్గించినందుకు జాతీయ అవార్డు
- 37శాతం పెరిగిన ఆస్పత్రి ప్రసవాలు, ఓపీ కేసులు
- నర్సీపట్నం సభలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని

నర్సీపట్నం : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రాధాన్యం ఇస్తూ, తగిన నిధులు కేటాయిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాసరావు తెలిపారు. నర్సీపట్నం ప్రాం తీయ ఆస్పత్రిలో అదనంగా మంజూరైన 50 పడకల విభాగాన్ని ఆధునికీకరించిన భవనాలను మంత్రులు కామినేని, అయ్యన్న, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభలో మంత్రి కామినేని మాట్లాడారు. 70 సంవత్సరాలలో జరగని అభివృద్ధి, పురోగతి కేవలం ఒక ట్రెండు సంవత్సరాలలోనే జరిగిందన్నారు. 2014 నాటికి మాతాశిశు మరణాలు అత్య ధికంగా జరిగే రాష్ట్రంగా గుర్తింపుపొందిన ఆంధ్రప్రదేశ్, 2016 నాటికి అతి తక్కువ మాతాశిశు మరణాలు సంభవించే రాష్ట్రంగా మారి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమన్నారు.

ఆస్పత్రుల్లో త్వరలో మదర్‌కిట్‌లు

ప్రభుత్వ ఆస్పత్రులలో సకల సదుపాయాలు, అత్యాధునిక వైద్య సేవలు అందిస్తుండడంతో రాష్ట్రంలో ఆస్పత్రి ప్రసవాలు, ఓపీ కేసులు 37శాతం పెరిగాయని మంత్రి కామినేని వివరించారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగిన అనంతరం ప్రస్తుతమిస్తున్న బేబికిట్‌లు మాదిరిగానే త్వరలో మదర్‌కిట్‌ల పంపిణీ కూడా ప్రారంభమవుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో భాగంగా నిపుణులైన ప్రైవేటు వైద్యులు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి వైద్యసేవలు అందించవచ్చునన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎమ్మెల్సీలు ఎంవీవీఎస్ మూర్తి, పప్పల చలపతిరావు, జెడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. ఏఎస్పీ ఐశ్వర్యరస్తోగి, ఆర్డీవో సూర్యారావు, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సుధా శారదా, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్.సుశీల, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, ప్రాంతీయ ఆస్పత్రి కో-ఆర్డినేటర్ డాక్టర్ నాయక్, డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో అభివృద్ధి పథకాలకు ఆర్థిక సహకారం అందించిన ప్రముఖ వ్యాపారవేత్త కొప్పర్తి రామారావు దంపతులను, నర్సీపట్నం మున్సిపాలిటీకి రూ.10 లక్షల విలువైన మహాప్రస్థానం వాహనాన్ని బహూకరించిన సీఎంఆర్ అధినేతను మంత్రులు సత్కరించారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి : అయ్యన్న

మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ గ్రామీణ జిల్లాలో పది మండలాల ప్రజలకు వైద్యసేవలందించే ప్రాంతీయ ఆస్పత్రిలో అదనపు పడకలు, భవనాల నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరుచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి కామినేనికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర విభాగాల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నర్సీపట్నంలో అన్ని రకాల విద్యా సంస్థల ఏర్పాటుకు కృషిచేసిన అయ్యన్నపాత్రుడు వైద్య కళాశాల ఏర్పాటుకు కూడా కృషి చేయాలని ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరగా, గ్రామీణ ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసిన ఎంపీ శ్రీనివాసరావే వైద్య కళాశాల ఏర్పాటుకు కూడా ముందుకు రావాలని మంత్రి అయ్యన్న కోరారు.



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్న



స్కేటింగ్‌రింక్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

స్కేటింగ్‌రింక్ నిర్మాణానికి శంకుస్థాపన

నర్సీపట్నం : నర్సీపట్నం- చింతపల్లి రూట్‌లో గల రుత్తల లత్సాపాత్రుడు నందనవనంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్కేటింగ్‌రింక్ నిర్మాణానికి గురువారం మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్న మాట్లాడుతూ వుడా నిధులతో నిర్మించనున్న ఈ స్కేటింగ్‌రింక్ నర్సీపట్నం పరిసర ప్రాంతాల యువతీయువకులకు, బాలబాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాసరావు, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎమ్మెల్సీలు, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లతో పాటు మండలాధ్యక్షురాలు సుకల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 6 నుంచి స్పెషల్ డ్రైవ్ పరీక్షలు

విశాఖపట్నం, ఆగస్టు 17: ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు సెప్టెంబరు ఆరో తేదీ నుంచి నగరంలోని బీవీకే కళాశాలలో జరుగుతాయని ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఒక ప్రకటనలో తెలిపింది. పరీక్షల టైమ్‌టేబుల్ aucoe.infoలో లభ్యమవుతుందని, అభ్యర్థులు తమ హాల్ టికెట్లను పరీక్షలకు మూడు రోజులు ముందుగా పరీక్ష కేంద్రం నుంచి తీసుకోవాలని పేర్కొంది. వివరాలకు 0891-2844029 ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

- అచ్చియ్యపేట అనుకూలమని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడి

కొత్తూరు (అనకాపల్లి) : మండలంలోని సుందరయ్యపేట పంచాయతీ పరిధి అచ్చియ్యపేటలో కేంద్రీయ విద్యాలయానికి ప్రతిపాదించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం సాయంత్రం పరిశీలించారు. విద్యాసంస్థ ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉందని ఈ సందర్భంగా వెల్లడించారు.

ఇందులో భాగంగా సీతానగరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 511లో ఉన్న ఈ ప్రాంతానికి వాహనాలు చేరుకునే విధంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద వేసిన మట్టి రోడ్డును కూడా పరిశీలించారు. ఈ రోడ్డు వేసిన స్థలం కశింకోట సీతారామ దేవస్థానానికి చెందినదని ఫిర్యాదులు అందాయని, ఈ విషయమై దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి రహదారి నిర్మాణానికి అనుమతి కోరుతామని వివరించారు. అనంతరం ఈ పాఠశాల ఏర్పాటుకు ప్రత్యామ్నాయంగా కుంచంగి గ్రామంలో ప్రతిపాదించిన 13.2 ఎకరాల స్థలాన్ని కూడా చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్వారీ, క్రషర్లు ఎక్కువగా విస్తరించి ఉన్నందున ఈ స్థలం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఉపయోగపడదన్నారు. అచ్చియ్యపేటలో ప్రతిపాదించిన స్థలం అనుకూలంగా ఉందని పునరుద్ఘాటించారు. అలాగే సంపతిపురంలో ఉద్యానవన



అచ్చియ్యపేటలో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

పరిశోధన కేంద్రానికి కేటాయించిన స్థలం పరిస్థితి ఏమిటని ఆర్డీవో ఎంవీ సూర్యకళను కలెక్టర్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ కుసుమ భాస్కర్, ఏఈ సుంకర అప్పలనాయుడు, డీఐ ఎ.బాబూరావు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, ఎంపీడీవో బీవీ రమణ, మండల సర్వేయర్ లీల, గ్రామ టీడీపీ నాయకుడు రేఖా రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
విలేఖరులు కావలెను
1. కశింకోట, 2. హుకుంపేట
3. చోడవరం టౌన్, 4. నర్సీపట్నం అర్బన్
పైన తెలిపిన ప్రాంతాల్లో వార్తల సేకరణకు విలేఖరులు కావలెను.
అభ్యర్థులు డిగ్రీ / ఇంటర్ చదివి వుండాలి.
తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం,
సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం వుండాలి.
ఆసక్తి కలిగిన అభ్యర్థులు
తేదీ 18-08-2017 (శుక్రవారం)
ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు
ఇంటర్వ్యూకు హాజరు కావలెను.
అడ్రస్: ఆంధ్రజ్యోతి కార్యాలయం
పోర్టు హాస్పటల్ ఎదురుగా, ఎన్.హెచ్-5,
అక్కయ్యపాలెం, విశాఖపట్నం. ఫోన్ : 2516923

నేడు రైతుబజారులో ధర్మ కాటా ప్రారంభం

పాడేరు: ఎన్టీఆర్ రైతు బజార్‌లో శుక్రవారం విని యోగదారుల సంఘం ఆధ్వర్యంలో ధర్మకాటాను ప్రారంభిస్తామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సత్య నారాయణ, సభ్యుడు బి.చిట్టిబాబు తెలిపారు. తూకాల పరంగా గిరిజనుల రైతులు మోసాలకు గురి కాకుండా ఉండాలనే లక్ష్యంతోనే ఈ కాటా ఏర్పాటు చేస్తున్నామ న్నారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



పాఠశాల భవన నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎస్ఈ ప్రసాద్

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఎస్ఈ ప్రసాద్

చింతపల్లి: ఏజెన్సీలో జరుగుతున్న భవనాలు, రహదాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్ తెలిపారు. రాత్రి ఎస్ఈ బసచేసి గురువారం చింతపల్లి, జీకే వీధి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. జాజులపాలెం, లంబసింగి, పెదబరడ. ఆర్‌వీ నగర్, పెద వలస, జీకే వీధి పాఠశాలల భవనాలు, పనసపల్లి, కంపు మానుపాకలు కల్వర్టులను ఆయన తనిఖీ చేశారు. నిర్మా ణాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, బాలుర ఆశ్రమ పాఠ శాలల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి, వసతి గృహాల నిర్మా ణాలను పూర్తిచేయాలన్నారు. నాణ్యతాప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. అలాగే వంచుల-కొత్త పాలెం రహదారి నిర్మించేందుకు రూ.92 లక్షల నాబార్డు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ డీవీఆర్‌ఎం రాజు, జేఈ రఘు, ఏఈఈ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాల ఇంటర్వ్యూలు

148 మంది విద్యార్థుల హాజరు

చింతపల్లి: చింతపల్లి ఆర్ఐటీఐలో ప్రవేశాల కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 148 మంది హాజరయ్యారు. రెండో విడత ఐటీఐ ప్రవేశాలకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించామని ప్రిన్సిపాల్ వి.పరమే శ్వరరావు తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తామని ఆయన చెప్పారు.

'ఉపాధి'ని వినియోగించుకోండి

మన ఊరు-మన విశాఖలో ఎంపీడీవో



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇమ్మానుయేలు

కొయ్యూరు: ఉపాధి పథకం ద్వారా కల్పిస్తున్న పనులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఇమ్మానుయేలు సూచించారు. మండలంలోని కినపర్తి పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన గురువారం మన ఊరు-మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు కూలీలు గతంలో చేసిన పనులకు సంబంధించి వేతనాల చెల్లింపులు జరుగలేదని ఎంపీడీవో దృష్టికి తీసుకు వెళ్లగా, సంబంధిత అధికారులతో మాట్లాడి చెల్లింపులు నిలిచిపోవటానికి కారణం తెలుసుకున్నారు. పోస్టల్ సిబ్బంది సమ్మెలో ఉన్నందున చెల్లింపుల్లో జాప్యం జరిగిందని, ఈ పరిస్థితి అధిగమించే చర్యలు తీసుకుంటామని కూలీలకు ఎంపీడీవో తెలిపారు. కాగా, మన ఊరు-మన విశాఖ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉన్నా, చాలా శాఖల వారు డుమ్మా కొట్టారు. వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వ్యవసాయ శాఖతో పాటు స్థానిక ఉపాధ్యాయులు తప్పితే మిగిలిన వారంతా గైర్హాజరు కావడం విశేషం.

గిరిజనం ఆరోగ్య రక్షణకు 'ఆరోగ్య రథం'

ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి

పాడేరు: ఏజెన్సీలో గిరిజనుల ఆరోగ్య రక్షణకు 'ఆరోగ్య రథం' ద్వారా సేవలు అందిస్తామని ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.45 లక్షలతో సమకూర్చిన 'ఆరోగ్య రథాన్ని' గురువారం సాయంత్రం ఐటీడీఏ ఆవరణలో పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యాధునిక సదుపాయాలు ఉన్న ఈ ఆరోగ్య రథం ద్వారా గిరిజనులకు మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందుతాయన్నారు. ఈ ఆరోగ్య రథం అనంతగిరి కేంద్రంగా ఏజెన్సీ వ్యాప్తంగా సేవలు అందిస్తుందన్నారు. ఈ వాహనంలో ఒక డాక్టర్, ల్యాబ్ టెక్నిషియన్, స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారన్నారు. అలాగే 200 రకాల రోగాలకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని, 150 రకాల మందులు, ఆయింట్‌మెంట్లు, సిరప్‌లు ఉంటాయని ఆయన తెలిపారు. ఈసీజీ, ఆక్సిజన్, నెబ్యులేజర్ వంటి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. అన్ని వయస్సుల వారికి, అన్ని రకాల రోగాలకు మెరుగైన వైద్య సేవలు అందిసేందుకు వీలుగా ఈ ఆరోగ్య రథాన్ని రూపొందించారన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ జనరల్ మేనేజర్ కేవీ.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.





పాడేరు ఐటీడీఏకు చేరుకున్న ఆరోగ్య రథం... సదుపాయాలను పీవోకు వివరిస్తున్న ఏపీఎండీసీ జీఎం

గత ఎంపీడీవోపై ఏసీబీకి ఫిర్యాదు


ఉపాధి పథకం నిధులు స్వాహా..

పింఛన్ల మంజూరులో వసూళ్లు చేశారని ఆరోపణ

కొయ్యూరు: మండల పరిషత్ గత అధికారి ఎన్.సంతోషంపై ఏసీబీకి మండల ప్రజలు ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకం నిధులు స్వాహా చేశారని, అనర్హులకు పింఛన్లు మంజూరు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని తదితర అంశాలను ఆధారాలతో జోడిస్తూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు పత్రాలను అందజేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని ఉపాధి పథకంలో జరిగిన పనుల్లో అప్పటి ఎంపీడీవో సంతోషం ఉపాధి సిబ్బంది కలిసి సుమారు కోటి యాభై లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారు. అలాగే స్వచ్ఛభారత్ మిషన్‌లో కొమ్మిక పంచాయతీలో మంజూరైన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో నిధులు కైంకర్యం చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకంలో మండలానికి నూతనంగా 364 కొత్త పింఛన్లు మంజూరవ్వగా, వాటిలో కొన్నింటికి జన్మభూమి కమిటీ తీర్మానాలు లేకుండా అనర్హులకు, తక్కువ వయస్సు గల వారిని లబ్ధిదారులుగా చేర్చించేలా ఒకొక్కరి వద్ద రూ.3000 వంతున వసూలు చేసినట్టు తెలిసింది. స్థానిక ప్రజాప్రతినిదుల సూచనలకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా పింఛన్‌కు కనీసం దరఖాస్తులు కూడా చేయని వారి వివరాలను వెబ్‌సైట్‌లో ప్రైవేటు నెట్ సెంటర్ల ద్వారా పొందుపరిచినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే మండల పరిషత్‌కు వచ్చే సాధారణ నిధులు, 13వ ఆర్థిక సంఘ నిధులులోనూ చేతివాటం చూపి భారీ అవినీతికి పాల్పడినట్టుగా తెలిసింది.

ఈ భాగోతంపై ఉన్నతాధికారులతో పాటు ఏసీబీకి మండలానికి చెందిన కొంత మంది ప్రజలు పూర్తి ఆధారాలంతో ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 4వ తేదీన విచారణ చేపడతామని ఏసీబీ అధికారులు తెలిపనట్టు ఫిర్యాదుదారులు చెప్పారు.



తేది 10.05.2017, కొయ్యూరు మండలం



మండల ప్రజలు ఏసీబీ అధికారులకు ఆధారాలతో పాటు చేసిన ఫిర్యాదు ప్రతులు ఇవే..

మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణకే అవుట్‌పోస్టులు

చింతపల్లి డీఎస్పీ అనిల్

చింతపల్లి: ఏజెన్సీలో సీపీఐ మావోయిస్టు కార్యకలాపాలు నియంత్రించేందుకే పోలీసు అవుట్ పోస్టులను నిర్మిస్తున్నామని చింతపల్లి డీఎస్పీ పి.అనిల్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బాక్సైట్ తవ్వకాల కోసం అవుట్ పోస్టులు నిర్మిస్తున్నట్టు వస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. బాక్సైట్ తవ్వకాల ఒప్పందాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేశాయని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిని అడ్డుకుంటున్న మావోయిస్టుల కార్యకలాపాలను నియంత్రణలో భాగంగా అవుట్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బాక్సైట్ తవ్వకాల కోసం ఏర్పాటు చేస్తున్నట్టు ఆదివాసీలు అపోహపడతారని భావించి జర్రెల ప్రాంతంలో నిర్మించడం లేదన్నారు. బాక్సైట్ నిక్షేపాలు లేని రాళ్లగెడ్డ, పెదవలస, ధారకొండ ప్రాంతాల్లో వీటి నిర్మాణాలకు ఏర్పాట్లు చేస్తున్నామని డీఎస్పీ వివరించారు. ఏవోబీలో రాళ్లగెడ్డ మూలగరువు కొత్తూరులో అవుట్‌పోస్టు ఏర్పాటు చేయడం వల్ల తారు రోడ్డు వచ్చిందని, ఆర్టీసీ బస్సు కూడా తిరుగుతోందని ఆయన చెప్పారు. మరో నెల రోజుల్లో రాళ్లగెడ్డలో ఏటీఎం కేంద్రం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పోలీసులు రాళ్లగెడ్డ ప్రాంతాల్లో రైతు నేస్తం కింద పంట పొలాలను ట్రాక్టర్‌తో దున్నిస్తున్నారన్నారు. జలధార కింద చేతిపంపులు ఏర్పాటుచేస్తున్నామన్నారు. బడి నేస్తం కిందట రాళ్లగెడ్డ, నిమ్మపాడు, బైలుకించంగి పాఠశాలను ఎస్ఐ సూర్యనారాయణ, రమేష్ దత్తత తీసుకుని పుస్తకాలు, దుస్తులు కూడా పంపిణీ చేస్తున్నారన్నారు. అలాగే అవుట్ పోస్టు వల్ల సెల్ టవర్లు ఏర్పాటు చేయడంతో సమాచార వ్యవస్థ మెరుగు పడుతుందని, ఆదివాసీలు అత్యవసర ఫోన్‌కాల్స్ చేసుకుంటున్నారని చెప్పారు.



అవుట్‌పోస్టుల వల్ల గంజాయి రవాణా జరగదనే ఉద్దేశంతో అసత్య ప్రచారం చేస్తున్నారని డీఎస్పీ అనిల్ తెలిపారు. కొంత మంది గంజాయి స్మగ్లర్లకు మధ్యవర్తులుగా పనిచేస్తున్న వ్యక్తులు బాక్సైట్ తవ్వకాల కోసం అవుట్‌పోస్టులు నిర్మిస్తున్నారనే అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రధానంగా ధారకొండకు చెందిన సుంకరి విష్ణుమూర్తి ఈపాత్రను పోషిస్తున్నాడని డీఎస్పీ తెలిపారు.

ఇంటి పన్ను నిర్ధారణకు జియోటాగింగ్ సర్వే

కొయ్యూరు, ఆగస్టు 17: ఇంటి పన్ను నిర్ధారించేందుకు ఇంటి కొలతలతో ప్రతీ ఇంటిని జియోటాగింగ్ చేస్తామని మండల పంచాయతీ విస్తరణాధికారి(ఈవోపీఆర్‌డి) వరలక్ష్మి తెలిపారు. ఇందుకు నిరుద్యోగులు సహకరించాలని కోరారు. ఇంటిపన్ను నిర్ధారించేందుకు జియోట్యాగింగ్ ప్రక్రియను పంచాయతీలో నిరుద్యోగులకు అప్పగించేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వారు ఈ పనులు నిర్వహణకు వీలుగా ఈ-ఏప్‌ను వారి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని సర్వే చేసేందుకు మందుకు రావాలని కోరారు. ఇందుకు గానూ ప్రతీ ఇంటికి రూ 13 వంతున ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనిపై సాంకేతిక పరమైన అనుమానాలు నివృత్తి చేసేందుకు వీలుగా శిక్షకుడు కొయ్యూరు వస్తున్నందున ఆండ్రాయిడ్ ఫోన్ గల ఈ సర్వే చేసేందుకు ఆసక్తి గల నిరుద్యోగులు కొయ్యూరు వచ్చి అవగాహన కల్పించుకోవాలని సూచించారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	ప్రతిక్షణం

ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో భారీ గొయ్యి

ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



మాడుగుల రూరల్: అటు ఏజెన్సీకి, ఇటు మండలానికి ప్రధానమైన ఘాట్‌రోడ్డు జంక్షన్‌లోని ఆర్ అండ్ బీ రోడ్డు మధ్యలో భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో కొద్దిపాటి వర్షం పడినా ఈ గోతిలో వర్షపు నీరు చేరి మడుగును తలపిస్తోంది. నిత్యం మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీకి, ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి జిల్లా ఉన్నతాధికారులు, ఇతర అధికారులు ప్రయాణిస్తుంటారు. అయినా జంక్షన్ నడిబొడ్డున ఏర్పడిన భారీ గోతిని పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, ముఖ్యంగా రాత్రి సమయంలో అయితే మరీ ఇబ్బందిగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ గోతిని పూడ్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అధ్వానం

- పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలి
- మండల ప్రత్యేకాధికారికి కోనాం గ్రామస్థు వినతి


ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చీడికాడ: కోనాం పంచాయతీలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అధ్వానంగా ఉన్నాయని కోనాం పంచాయతీ సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మతోపాటు మాజీ సర్పంచ్ చలుగు అప్పలనాయుడు, గ్రామస్థులు మండల ప్రత్యేక అధికారి టి.సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. మన గ్రామం-మన విశాఖలో భాగంగా మండలంలోని కోనాంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు హెల్త్ సబ్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. పంచాయతీలో 14 శివారు గ్రామాల వారు ఉంటున్నారని, వీరిలో అధికశాతం గిరిజనులు, హరిజనులేనని మాజీ సర్పంచ్ అప్పలనాయుడు తదితరులు తెలిపారు. ఇద్దరు ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్, ఒక హెచ్‌వీ ఉండాల్సి ఉండగా, ఇక్కడ పూర్తిస్థాయి ఏఎన్‌ఎంలు లేకపోవడంతో మూడు నెలలకు ఒక ఏఎన్‌ఎంని నియమిస్తున్నారని, దీంతో పూర్తిస్థాయిలో వైద్యం అందక ఎస్సీ, ఎస్టీలు ఇబ్బందులకు గురవుతున్నారఇ అన్నారు. ఒక హెచ్‌వీ ఉన్నా ఎప్పుడొస్తారో తెలియదన్నారు. దీన్ని కోనాం పంచాయతీకి పూర్తిస్థాయి ఏఎన్‌ఎంలను నియమించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే విధంగా పనిచేసే చోటే నివాసం ఉంచాలని కోరారు. ప్రతి గురువారం కోనాం సంతలో జరిగే వైద్య శిబిరానికి వైద్యాధికారి వచ్చే విధంగా చూడాలని కోరారు. జాజులపాలెం గిరిజనుడు పొట్టంగి రామారావు మాట్లాడుతూ గుడివాడ నుండి జాజులపాలెంనకు రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు. ఏజెన్సీ గ్రామాలకు మంచినీటి సౌకర్యం, గృహనిర్మాణాలకు బిల్లులు ఇవ్వాలని కోరారు. ఎంపీడీవో ఆర్‌ఎం.గ్లాడ్స్, ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకమ్మ, ఆర్‌ఐ త్రిమూర్తులు, ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మిదేవి, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

360 మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సినేషన్

కె.కోటపాడు: 15 ఏళ్లలోపు వయస్సు గల పిల్లలకు మిజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ వేయించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్ అన్నారు. గురువారం మండలంలోని చౌడువాడ సాయి విద్యావిహార్ స్కూల్‌లో 360మంది పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకూ నాలుగువేల మంది బాలబాలికలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశామని ఆయన చెప్పారు. త్వరలో మరో రెండువేల మందికి వేయనున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు బాధ్యతగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో కేవీ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ వీఎస్‌ఎన్.రాజు పాల్గొన్నారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు

దేవరాపల్లి: బీసీ, ఓసీ, ఎస్టీ, మైనార్టీల నిరుద్యోగులకు సబ్సిడీపై కల్పిస్తున్న రుణాలను ఆయా వర్గాల వారు సద్వినియోగపర్చుకుని స్వయం ఉపాధి పొందాలని ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు కోరారు.

మండలంలోని ఎం.అలమండ ఎస్‌బీహెచ్, యూకో బ్యాంకు పరిధిలో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు రుణాల ఎంపిక కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. యూకో బ్యాంకులో దరఖాస్తు చేసుకున్న వారు తక్కువ మంది ఇంటర్వ్యూకు హాజరు కావడంతో సోమవారం నాటికి వాయిదా వేశారు. ఎస్‌బీహెచ్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్టిఫికెట్లు పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి మహలక్ష్మి, ఎంపీడీవో డి.చంద్రశేఖర్, జన్మభూమి కమిటీ సభ్యుడు శరకాన సూర్యనారాయణ, కిల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు.

వంగకు గిట్టుబాటు ధర కరువు

చీడికాడ: కోనాం సంతకు తెచ్చిన వంకాయలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మధ్యాహ్నం వరకూ చూసి విసిగిపోయిన రైతులు, వ్యాపారులు అడిగిన ధరకు ఇచ్చి వెనుదిరిగారు. కోనాం ఏజెన్సీ దిగువున ఉన్న గుంటు కొత్తూరు, సిరిజాం, చినకోనాం, ఎస్‌ఎన్.పురం, రామ్‌నగర్ గ్రామాల నుంచి పలువురు రైతులు గోంగూర, వంకాయలు, బీరకాయలు వంటి కూరగాయలను సంతకు తీసుకొచ్చారు. గోంగూర, బీరకాయలు తక్కువగా రావడంతో తొందరగా అమ్ముడైపోయాయి. వంకాయలు కాస్త అధికంగా రావడంతోపాటు వ్యాపారులు కుమ్మక్కై గిట్టుబాటు ధర కల్పించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోనాం వంకాయలు నాణ్యమైనవని పేరున్నా వ్యాపారులు ముందుకు రాలేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో తెల్లవంకాయలు కిలో రూ.30 నుంచి రూ.35 ధర ఉన్నా కోనాం సంతలో రూ.15 నుంచి రూ.20 వరకూ గిట్టుబాటు అయింది. మధ్యాహ్నం వరకూ వేచి చూసినా ఎవరూ కొనకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకే అమ్మవలసి వచ్చిందని రైతులు తెలిపారు.


సంతకు గిరిజనులు తీసుకువచ్చిన వంకాయలు, సీతాఫలాలు

ధర పలకని సీతాఫలం

మండలంలోని కోనాం సంతకు తెచ్చిన సీతాఫలాలకు గిట్టుబాటు ధర లేక పలువురు గిరిజనులు ఇబ్బందులకు గురయ్యారు. కోనాం జలాశయం ఎగువనున్న ఏజెన్సీ గ్రామాల నుంచి గిరిజన రైతులు తీసుకు వచ్చిన సీతాఫలాలకు తగిన గిట్టుబాటు ధర రాలేదు. బహిరంగ మార్కెట్‌లో సీతాఫలం ఒక్కోటీ రూ.10 నుంచి రూ.12 వరకూ అమ్ముతుండగా, కోనాం సంతలో మాత్రం రూ.5 నుంచి రూ.7కు రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది.

జంపెనలో మన గ్రామం మన విశాఖ

మాడుగుల రూరల్: మండలంలోని జంపెనలో గురువారం మన గ్రామం-మన విశాఖ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు ముందుగా గ్రామంలో పర్యటించి మండల ప్రాథమిక పాఠశాల, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలను పరిశీలించారు. పాఠశాలలో వంటగది శిథిలావస్థకు చేరుకోవడంతో వంట చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు అదికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పాఠశాల ఎదురుగా చెత్తా చెదారం పారవేస్తున్నారని, ప్రధాన రహదారి పక్కన కొందరు రాతివేళ్ల బహిరంగ మల విసర్జన చేస్తున్నామని గ్రామానికి చెందినకొందరు అధికారులకు తెలిపారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటానని హామీ మీ ఇచ్చారు. సర్పంచ్ తాళపురెడ్డి రాజు, ఈవోపీఆర్డీ కొంకి అప్పారావు, ఎంఈవో బి.దేముడమ్మ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దళితవాడకు పూర్తిస్థాయిలో మంచినీటి సౌకర్యం

సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ

చీడికాడ: కోనాం గ్రామ పంచాయతీలోని పాత దళితవాడకు పూర్తిస్థాయిలో మంచి నీటి సౌకర్యం కల్పించనున్నామని గ్రామ సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా పాత దళితవాడలో ఉన్న స్థలాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.కనకమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు పరిశీలించారు. దళితవాడలో కొన్ని గృహాలు ఎగువ ప్రాంతాన ఉండటం వల్ల తాగు నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు దళితుల విజ్ఞాపన మేరకు గ్రామ పంచాయతీలో తీర్మానం కూడా చేశామన్నారు. పంచాయతీ నిధులు మూడు లక్షలతో మినీ ట్యాంకు నిర్మించనున్నామన్నారు. దీని నిర్మాణానికి వెంటనే అనుమతులు ఇవ్వాలని ఏఈని సర్పంచ్ కోరారు. అదే విధంగా పంచాయతీలోని పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు చలుగు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపల్లిలో పశువైద్య శిబిరం

చీడికాడ: మండలంలోని చెట్టుపల్లిలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ పాతాళం చిన్నంనాయుడు ప్రారంభించారు. 15 పశువులకు తనిఖీలు చేసి ఇంజక్షన్‌లు చేశారు. 30 పెయ్యిలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువైద్యాధికారి ఆల్ఫోన్సా జార్జి, సూపర్‌వైజర్ త్రినాథ్, గోపాలమిత్రలు విశ్వేశ్వరరావు, చలుమూరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	ప్రతిక్షణం

డంపింగ్‌యార్డు కోసం స్థలం కేటాయించండి

- అధికారులకు ఉప సర్పంచ్ వినతి
- రావికమతంలో మన గ్రామం-మన విశాఖ



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రావికమతం: మండల కేంద్రానికి డంపింగ్‌యార్డు స్థలం లేక జనావాసాల మధ్యలో పేరుకుపోతోందని, ఈ దృష్ట్యా అరెకరా స్థలం కేటాయించాలని ఉప సర్పంచ్ గెంజి సూర్యనారాయణ అధికారులను కోరారు. మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ. మండల కేంద్రంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు అవసరమైన స్థలం లేకపోవడంతో జనావాసాల మధ్య, ఎస్సీ కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వినాయకుని గుడి వరకూ గల బీఎన్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని దేశం పార్టీ నాయకుడు గెంజి వెంకటరమణ అధికారులను కోరారు. ఇక్కడ కాలువలు లేక మురుగునీరు, వర్షపునీరు ఏకమై రోడ్డుపై ప్రవహిస్తోందని, దీని వల్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని అన్నారు. మండల కేంద్రంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, 2015 నుంచి దరఖాస్తు చేసుకుంటున్న వారికి జవాబుచెప్పాలని సీఐటీయూ మండల కార్యదర్శి వజ్రపు సత్యవతి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు అధికారులను కోరారు. అర్జీదారులంతా ఇంటి స్థలాలకు అర్హులా, అనర్హులా అన్నది స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒకపక్క ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో ఎంపీడీవో జయప్రకాశరావు, ఈవోపీఆర్‌డీ మహేష్, గృహనిర్మాణశాఖ ఏఈ ఎర్రాపాత్రుడు, మండల ఇంజినీరింగ్ అధికారి సుమతి, సీహెచ్‌వో మోహన్‌రావు, మాజీ సర్పంచ్ కె.జగన్నాథరావు, కార్యదర్శి కృష్ణమోహన్ పాల్గొన్నారు.



పాఠశాల చిన్నారులకు స్కూల్‌బ్యాగులు అందజేస్తున్న శ్రీనివాసరావు

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

చోడవరం: పట్టణంలోని ద్వారకానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు జిల్లా బీసీసెల్ ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాసరావు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. దళిత కులాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వేచలపు ప్రకాష్, పాఠశాల హెచ్‌ఎం జమ్ములమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర్, శ్రీనులకు ఘన సన్మానం



కిషోర్, శ్రీనులను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు


బుచ్చెయ్యపేట : జిల్లా ఉత్తమ టెక్నీషయన్, వీఆర్వోలుగా అవార్డులు పొందిన కిశోర్, శ్రీనులను గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు, ఎంపీడీవో టి.కొండలరావు, తహసీల్దార్ కేవీవీ శివ, ఉపాధి పథకం ఏపీవో ఎస్.అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తమరాన దాసు, జి.శ్రీనివాసరావు, పాతాళ శ్రీను, సుంకర సత్యనారాయణ, బుచ్చెయ్యపేట పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.తాతయ్యలు, దొండా శ్రీను, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

23న చాగంటి ప్రవచనాలు

చోడవరం: స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో ఈ నెల 23న భక్తివైభవం అనే అంశంపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాడి రైతులకు స్టీల్ క్యాన్‌ల వితరణ

బుచ్చెయ్యపేట : ఎల్.సింగవరం ఎంపీసీఎస్ అధ్యక్షుడుగా ఏకగ్రీంగా ఎంపికైన వేపాడ సత్తిబాబు వందమంది సభ్య రైతులకు వితరణగా అందించిన స్టీల్ క్యాన్‌లను గురువారం విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ పంపిణీ చేశారు. కోమళ్లపూడిలో గల అమిరిపురిబాబా ఆశ్రమానికి గంటికొర్లాం గ్రామస్థులు 370 కిలోల బియాన్ని, డెయిరీ డైరెక్టర్ సత్యనారాయణ 10 ప్లాస్టిక్ కుర్చీలను వితరణగా అందించారు.



రైతులకి స్టీల్ క్యాన్‌లను పంపిణీ చేస్తున్న డైరెక్టరు సత్యనారాయణ

ఎంఆర్ వ్యాక్సినేషన్‌పై ఎంపీడీవో సమీక్ష



పీహెచ్‌సీ వైద్యాధికారులతో వాక్సిన్‌లపై సమీక్ష చేస్తున్న ఎంపీడీఓ టి.కొండలరావు

బుచ్చెయ్యపేట : లక్ష్యం మేరకు ఎంఆర్ వాక్సిన్ వేయాలని ఎంపీడీవో టి.కొండ లరావు పీహెచ్‌సీల వైద్యాధికారులకు సూచించారు. గు రువారం వడ్డాది, తురకలపూడి, బుచ్చెయ్యపేట పీహెచ్‌సీల వైద్యాధికారులతో ఎంఆర్ వ్యాక్సినేషన్‌పై సమీక్షించారు. వడ్డాదిలో ఇప్పటి వరకు తొలివిడతలో అందిన 500 వాక్సిన్‌లు వేశామని డాక్టరు కేఎం నాయుడు తెలిపారు. రెండో విడతగా 667 వాక్సిన్‌లు పంపాలని కోరగా, అందిన 200 వాక్సిన్‌లను పిల్లలకి వేస్తున్నామని తెలిపారు. బుచ్చెయ్యపేట పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు 2239 మంది పిల్లలకు వాక్సిన్ వేశామని డాక్టరు రజనీకాంత్ తెలిపారు. తురకలపూడి పీహెచ్‌సీ పరిధిలో 4 వేల మంది పిల్లల్లో 50 శాతం మందికి వ్యాక్సిన్‌లు వేశామని వైద్యాధికారి నీరజ తెలిపారు.

అనారోగ్యంతో ఎనిమిది నెలల గర్భిణి మృతి



మృతిచెందిన గర్భిణి వరలక్ష్మి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రావికమతం: అనారోగ్యానికి గురైన ఎనిమిది నెలల గర్భిణి మృతి చెందిన సంఘటన చిలకవానిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని టి.అర్జాపురం పంచాయతీ శివారు చిలకవానిపాలెం గ్రామానికి చెందిన యాదగిరి వరలక్ష్మి(35) 8వ నెల గర్భిణి. ఈమెకు బుధవారం రాత్రి కడుపు నొప్పి రావడంతో వెంటనే స్థానికంగా ఒక ఆర్‌ఎంపీకి భర్త సత్తిబాబు, కుటుంబ సభ్యులు చూపించారు. అతను చికిత్స చేయడంతో నొప్పి తగ్గిపోయింది. గురువారం ఉదయం యథావిధిగాలేచి తిరగడంతో ఆమెను, 11 ఏళ్ల కుమారుడు గణేష్‌ను ఇంటి వద్ద వదిలి భర్త సత్తిబాబు, కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిపోయారు. వరలక్ష్మి మధ్యాహ్నం భోజనం చేసి పడుకుంది. అంతవరకూ ఆడుకుని వచ్చిన కుమారుడు గణేష్ పడుకున్న తల్లి వరలక్ష్మిని నిద్ర లేపాడు. ఎంత పిలిచినా వరలక్ష్మి లేవకపోవడంతో గణేష్ కేకలు వే శాడు. ఇరుగుపొరుగునవారు వచ్చి చూసే సరికి వరలక్ష్మి మృతి చెందింది. దీంతో గణేష్ పొలంలో ఉన్న తండ్రి సత్తిబాబుకు, తాతమ్మలకు సమాచారం తెలిపాడు. ఆర్‌ఎంపీ ఇచ్చిన మందు వల్ల కడుపులో బిడ్డ చనిపోయి వరలక్ష్మి కూడా చని పోయి ఉండవచ్చని అనుమాని స్తున్నారు.

శాంతియుత వాతావరణ పరిరక్షణలో కమ్యూనిటీ పోలీసులు

ఎస్ఐ మల్లేశ్వరరావు



కమ్యూనిటీ పోలీసులుగా నియమితులైన యువకులతో ఎస్ ఐ మల్లేశ్వరరావు

చోడవరం: గ్రామాల్లో శాంతిభద్రతలు, అసాంఘిక కార్యకలాపాల నిరోధంలో పోలీసుశాఖకు కమ్యూనిటీ పోలీసులు సహకారంగా ఉంటారని ఎస్ఐ పి.మల్లేశ్వరరావు తెలిపారు. మండలంలో కమ్యూనిటీ పోలీసులుగా నియమితులైన వారికి గురువారం ఆయన ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గ్రామాల్లో నేరాలకు ఆస్కారం లేకుండా శాంతియుత వాతావరణం నెలకొనేలా వీరు పోలీసులకు సహకారిస్తారన్నారు. ప్రతి పంచాయతీలో 20 నుంచి 30 మంది యువకులను కమ్యూనిటీ పోలీసులుగా నియమిస్తామని, పెద్ద పంచాయతీ అయితే వార్డుకు పదిమంది చొప్పున వీరిని నియమించనున్నామని తెలిపారు. దొంగతనాల నివారణకు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టంను అమలు చేస్తున్నామని, ఎవరైనా దూర ప్రాంతాలకు వెళితే పోలీసులకు తెలియజేయాలన్నారు.

నేడు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష నాణేల పూజ



చోడవరం: శ్రావణమాసం ఏకాదశి శుక్రవారం సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం లక్ష నాణేల పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు నిర్వహించే ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ



మరిడమ్మ ఘటాలను ఊరేగిస్తున్న దృశ్య

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో గురువారం మరిడిమాంబ పండగ ఘనంగా జరిగింది. శిథిలావస్థకు చేరుకున్న అమ్మవారి ఆలయాన్ని ఇటీవల పునర్నిర్మించారు. ఈ సందర్భంగా భక్తులు ఎండుగ జరిపారు. వందలాది మంది భక్తులు ఘటాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎంపీపీ బత్తుల తాతయ్యబాబు, సర్పంచ్ బత్తుల అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు బత్తుల అనూష, పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి దొండా రాంబాబు, అమిరిపల్లి సత్తిబాబు, ఆది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గంటాను కలిసిన కాపు సమాఖ్య నేతలు



మంత్రిని గంటాను కలిసిన వెంకటరమణ, మోహనరావు

బుచ్చెయ్యపేట : మంత్రి గంటా శ్రీనివాసరావును గురువారం అఖిల భారత కాపు సమాఖ్య రూరల్ జిల్లా అధ్యక్షులు సీతా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి సాలాపు మోహనరావు తదితరులు కలిశారు. వీరిని మంత్రి గంటా శ్రీనివాసరావు అభినందించారు. సంఘం నియమ నింబంధనలకు, ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని ఆయన సూచించారు.

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

మంత్రి ఆదినారాయణరెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



నర్సీపట్నం టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దళితసేన నాయకులు

నర్సీపట్నం:

దేశ స్వాతంత్ర్య దినోత్సవంనాడు దళితులను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి ఆదినారాయణరెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సేన నాయకులు గురువారం నాడిక్కడ నర్సీపట్నం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ ఇటువంటి వ్యాఖ్యలు చేసిన ఆదినారాయణ రెడ్డి మంత్రి పదవిలో కొనసాగడానికి అర్హుడు కాదని, ఆయన వ్యాఖ్యలు కారణంగా అతనిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్లేటి పెంటారావు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నక్కెళ్ల నాగమణి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో మంత్రిపై ఫిర్యాదులు చేయనున్నట్టు వారు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో దళిత సేన డివిజన్ కన్వీనర్ యర్రంశెట్టి పాపారావు, కో-కన్వీనర్ పూడి అర్జున్‌రావు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

కృష్ణాదేవిపేట:

వినాయక చవితి ఉత్సవాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని కొయ్యూరు సీఐ వి.ఉదయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వినాయకచవితి పండగ సందర్భంగా గ్రామాల్లో పేకాట, కోడిపందాలు, వంటి జూదక్రీడలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించామన్నారు. వినాయక చవితి ఉత్సవాలకు మైకులు, సాంస్కృతిక కార్యక్రమాలకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దొంగతనాల నివారణకే ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

నర్సీపట్నం టౌన్:

లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై ప్రతిఒక్కరూ అవగాహనతో ఉంటేనే దొంగతనాల నివారణ సాధ్యపడుతుందనినర్సీపట్నం టౌన్, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.సింహాద్రినాయుడు, ఎల్.దేవతమ్మ అన్నారు. గురువారం శారదానగర్ సాయిబాబా మందిరం వద్ద కాలనీవాసులకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పెరుగుతున్న దొంగతనాల దృష్ట్యా పోలీసు ఉన్నతాధికారులు బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పలువురు యాప్‌నకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. దీనిలో భాగంగా పలువురు కాలనీవాసుల ఇళ్లకు వెళ్లి ఎల్‌హెచ్‌ఎంఎస్ కార్యక్రమానికి సంబంధించి వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చెరుకూరి సత్యనారాయణ, పట్టణ ఎస్‌ఐలు అప్పన్న, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

కృష్ణాదేవిపేట: ఏఎల్‌పురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారిని పాతకృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, కొయ్యూరు, భీమవరం, రత్నంపేట, తదితర గ్రామాల భక్తులు దర్శించుకొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి వీధుల్లో గరగలను ఊరేగిస్తూ గుడి వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ కొబ్బరికాయ, తదితర వాటితో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే భక్తులు చీరలు, తలనీలాలు సమర్పించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, టెంట్‌లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కొయ్యూరు పీవీ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, టీడీపీ జిల్లాకోశాధికారి లగుడు దనాజీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



ఏఎల్‌పురంలో మరిడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

తాగునీటిపై మంత్రికి మహిళల ఫిర్యాదు

మాకవరపాలెం:

తామరంలో నెల రోజులుగా తాగునీరు అందడం లేదని ఆ గ్రామ మహిళలు మంత్రి అయ్యన్నపాత్రుడుకి గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెంటనే స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్‌ను పిలిపించుకొని కారణాలను తెలుసుకున్నారు. నీటి పైపులైన్లు పాడయ్యాయని చెప్పారు. వెంటనే మంత్రి అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ పైపులైన్ మరమ్మతులు పూర్తి చేసి పంచాయతీకి అప్పగించాలని ఆదేశించారు. మంత్రి పక్కనే ఉన్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ జోక్యం చేసుకొని ఎన్ని రోజుల్లో సమస్యను పరిష్కరిస్తారో ఫిర్యాదు చేసిన మహిళలకు చెప్పాలని ఆదేశించారు. దీంతో వారం రోజుల్లో తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ తెలిపారు. అలాగే మూడే ళ్లుగా రాచపల్లి భూములు ఆన్‌లైన్ కావడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల జమీందార్ మంత్రికి ఫిర్యాదు చేశారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి అయ్యన్న

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

నాతవరం:

మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి వి.కృష్ణకుమారి కోరారు. గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జామ, కానుగ, తదితర మొక్కలను మండల అధికారులతో కలసి ఆమె నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులు కూడా మొక్కలు నాటి తమ సామాజిక బాధ్యతను నెరవేర్చడం అభినందనీయమన్నారు. తహసీల్దార్ కనకారావు మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ఒక్క మొక్కను నాటే సంప్రదాయం రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ జి.అశోక్‌కుమార్, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఏపీవో శ్రీనివాస్, హెచ్‌ఎం సుర్ల రామ్మూర్తి, ఏపీయుడబ్ల్యూజే నాయకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని గుడి ప్రారంభం

మాకవరపాలెం:

మండలంలోని అడిగర్లపాలెంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడిగర్ల దేముడు తన సొంత నిధులతో నిర్మించిన శ్రీకృష్ణుని గుడిని గురువారం ప్రారంభించారు. అనంతరం వైసీపీ నాయకులు పెట్ల ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేసి పలు మండలాల నుంచి వచ్చిన భక్తులు భజనలు చేశారు. అలాగే అడిగర్లపాలెం నుంచి అప్పన్నదొరపాలెం, మామిడిపాలెం, జంగాలపాలెం, బూరుగుపాలెం, తూటిపాల, తాడపాల గ్రామాల్లో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. మధ్యాహ్నం గ్రామంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూటిపాల సర్పంచ్ ప్రసాద్, బూరుగుపాలెం సర్పంచ్ రుత్తల సత్యనారాయణ పాల్గొన్నారు.

లింగంపేట పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠ

కృష్ణాదేవిపేట:

ప్రభుత్వ పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం విద్యార్థుల అదృష్టమని లింగంపేట సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు అన్నారు. గురువారం లింగంపేట ప్రభుత్వ పాఠశాలల్లో విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మండపాక రాజు, వరలక్ష్మి దంపతులు ఆర్థిక సాయంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సరస్వతిదేవిని పూజిస్తూ క్రమశిక్షణతో కూడిన చదువులో రాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల యూత్ నాయకుడు పరవాడ కవిశ్వేశ్వరరావు, హెచ్‌ఎం ఎం.దేముడు, స్కూల్ చైర్మన్ నాగేశ్వరరావు, వీఆర్‌వో రమణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



లింగంపేట పాఠశాలలో సరస్వతి విగ్రహం ప్రతిష్ఠించిన దృశ్యం

అయ్యన్న పర్యటనకు ఏర్పాట్లు



సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న మండల స్థాయి అధికార్లు

గొలుగొండ:

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు స్థానిక గురుకుల కళాశాలలో నిర్మించిన డార్మిటరీని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ డార్మిటరీని ప్రారంభించిన తర్వాత బహిరంగ సభ జరుగుతుందన్నారు. అనంతరం మండలంలో 540 మందికి ఎన్‌టీఆర్ గృహనిర్మాణానికి మంజూరు పత్రాలు అందిస్తామన్నారు. ఊరూరా పశుగ్రాస క్షేత్రాల మంజూరు పత్రాలు, 350 మందికి గ్యాస్ కనెక్షన్లు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఎంవీ. సువర్ణరాజు, తహసీల్దార్ పి.అంబేద్కర్, ఉపాధి ఏపీవో సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సెలింగ్

నర్సీపట్నం:

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో పోలీసుల నిఘాను ముమ్మరం చేశారు. ఏఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఎస్.సింహాద్రినాయుడు నేతృత్వంలో సాయుధ పోలీసులు గురువారం రాత్రి నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు జరిపి సుమారు 25 మంది ఆకతాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈవ్‌టీజింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వీరిని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కొద్దిసేపు కౌన్సెలింగ్ నిర్వహించి మొదటి హెచ్చరికగా విడిచిపెట్టారు. ప్రతిరోజూ కాంప్లెక్స్ ఆవరణలో తనిఖీలు ముమ్మరం చేస్తామని సీఐ తెలిపారు.

కొమిరలో మన గ్రామం-మన విశాఖ

గొలుగొండ:

మండలంలోని కొమిర గ్రామములో గురువారం మన గ్రామం -మన విశాఖ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆర్. శ్రీనివాసరావు సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు, అధికారులకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవీ సువర్ణరాజు, ఇరిగేషన్ ఏఈ రుత్తల రామన్నపాత్రుడు, వ్యవసాయాధికారి మధుసూదనరావు, తదితర్లు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

మాకవరపాలెం:

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసిన వారికి గురువారం మండల పరిషత్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉదయశ్రీ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తుచేసిన 300 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని చెప్పారు. మాకవరపాలెం స్టేట్‌బ్యాంకు,నర్సీపట్నం ఏడీబీ,గ్రామీణ బ్యాంకు, ఆంధ్రాబ్యాంకు కోటవురట్ల సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	: 08854 254044
ఎంపీడీవో కార్యాలయం	: 9441953611
తహసీల్దార్ కార్యాలయం	: 9441836336
వెలుగు ఏపీఎం	: 9866074067

సినిమా గైడ్


గౌతమ్ : లై
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మి (ఏసీ) : ఫిదా



ఇదో...విసత్రం!

- నిరుపయోగంగా ఉపమాక ఆలయ సత్రం
- కనీస సౌకర్యాలు లేక భక్తుల అవస్థలు
- నిర్వాహణ లేమితో శిథిలావస్థలో గదులు
- 1969లో అప్పటి రాష్ట్ర విద్యాశాఖామంత్రి పీవీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- చరిత్ర ఉన్న కట్టడంపై యంత్రాంగం చిన్నచూపు

నక్కపల్లి : మండలంలోని ఉపమాక క్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన సత్రం నిరుపయోగంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి వెంకన్న దర్శనానికి, కల్యాణానికి వచ్చే అతిథులు, భక్తులతో పాటు అధికారులకు కూడా ఉపయోగపడాలన్న ఉద్దేశంతో కొన్నేళ్ల క్రితం ఆలయానికి ఎదురుగా దీన్ని నిర్మించారు. ఈ మేరకు 1969లో అప్పటి రాష్ట్ర విద్యాశాఖామంత్రి పీవీ నరసింహారావు దీన్ని ప్రారంభించారు. నాలుగు విశాలమైన పోర్షన్లతో నిర్మించిన ఈ సత్రం అప్పటి నుంచి నిర్వాహణకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. తాగునీరు, వాడుక నీరు, సరైన విద్యుత్ సదుపా యం, మరుగుదొడ్లు లేకపోవడం లేక నిరుపయోగంగా మారింది. గతంలో కొందరు ఆలయ ఉద్యోగులు ఇందులో వున్నప్పుడు సొంత ఖర్చులతో తాత్కాలికంగా మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. ఆ తరువాత ఆలనాపాలనా చూసేవారు లేకపోవడంతో క్రమేపీ అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం సత్రం ఆవరణమంతా దుమ్ము, ధూళితో అపరిశుభ్రంగా కనిపిస్తోంది. స్వామివారి కల్యాణోత్సవాల సమయంలో ఎండోమెంట్స్ పాలనలో అధికారులు బస చేసేందుకు ఇది ఉపయోగపడేది. భక్తులు ఎవరైనా కనీస అద్దెతో ఇందులో వుందామన్నా, కనీస సౌకర్యాలు లేకపోవడంతో రావడం లేదు. టీటీడీ దేవస్థానాన్ని దత్తత తీసుకున్నప్పటికీ ఉత్సవాల సమయంలో డిప్యూటేషన్‌పై వచ్చిన సిబ్బందికి భోజనాలు, టిఫిన్లు తయారు చేసేందుకు మాత్రమే ప్రస్తుతం దీన్ని ఉపయోగిస్తున్నారు. సత్రం స్థానంలో మూడంతస్తుల విశాలమైన కల్యాణ మండపం లేదా డార్మిటరీ నిర్మించాలని ఏడాదిన్నర కిందట టీటీడీ అధికారులు భావించారు. కానీ దీనికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఉపమాక ఆలయానికి విశిష్టమైన తిథులు, ఉత్సవాల సమ యంలో వచ్చే భక్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ మేరకు టీటీడీ అధికారులు సత్రానికి మరమ్మతులు చేసి అన్ని సదుపాయాలు కల్పించాలని, లేదా తొలగించి, ఆ స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై టీటీడీ అధికారి ఒకరిని సంప్రదించగా ఇంకా దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, దశలవారీగా అన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని చెప్పారు.



1969లో పీవీ నరసింహారావు ప్రారంభించిన శిలాఫలకం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

ఎస్.రాయవరం(నక్కపల్లి)/కోటవురట్ల : బ్యాంకుల నుంచి స్వయం ఉపాధికి రుణాలు తీసుకునేటప్పుడు చూపించే శ్రద్ధ, రుణాలు తీర్చడంలోనూ చూపాలని ఎంపీపీ ఏజర్ల వినోద్‌రాజు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నిరుద్యోగులను ఆదుకోవాలన్న ఉద్దేశం తో ముఖ్యమంత్రి చంద్రబాబు కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందజేస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఎంపీడీవో డీడీ స్వరూపారాణి మాట్లాడుతూ బ్యాంకర్ల నుంచి ఆమోదం తెలిపిన తరువాత తమకు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నల్లపురాజు వెంకట్రాజు, సర్పంచులు అమలకంటి పాపారావు, పినపాత్రుని సూర్యనారాయణ, వైవీఎన్ రాజు (ఏడుకొండలరాజు), పాల్గొన్నారు. అలాగే కోటవురట్లలోనూ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలిరోజు 197 మంది హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ ప్రభాకర్, కోటవురట్ల ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసరు చంద్రరావు, ఆంధ్రా బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, డీసీసీబీ మేనేజర్ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

'మంత్రి ఆదిపై చర్యలు తీసుకోవాలి'



నినాదాలు చేస్తున్న వైసీపీ నాయకులు

పాయకరావుపేట : దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆది నారాయణరెడ్డిని ప్రభుత్వం తక్షణమే పదవి నుంచి తొలగించి, చర్యలు తీసుకోవాలని ఎలమంచిలి ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్, వైసీపీ దళిత నాయకుడు లంక సూరిబాబు డిమాండ్ చేశారు. గురువారం వైసీసీ దళిత నాయకులు మంత్రి ఆది వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ 70 ఏళ్లుగా దళితులు రిజర్వేషన్లు అనుభవిస్తున్నా...అభివృద్ధి సాధించలేదని కించపరుస్తూ మాట్లాడడం సరికాదన్నారు. గతంలో సీఎం చంద్రబాబు కూడా దళితులను అవమానించేలా మాట్లాడారని చెప్పారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిని ప్రభుత్వం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బోడపాటి గోవిందు, పండాడ శ్రీను, నెలపర్తి నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వాస్తు బాగాలేదట!

పాయకరావుపేటలోని ప్రభుత్వ కార్యాలయాలకు వాస్తు దోషం

పాయకరావు పేట : పాయకరావుపేట పట్టణంలో తహసీల్దార్, పంచాయతీ కార్యాలయాలకు వాస్తు దోషం ఉందంట. అందుకే అధికారులు వాస్తు నివారణ కోసం ప్రధాన గేట్లను మూసివేశారు. దీంతో సిబ్బందితో పాటు ఆయా కార్యాల యాలకు వస్తున్న ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజుల కిందట బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ పాండురంగా రెడ్డి సూచన మేరకు ఆ కార్యా లయం ప్రధాన ద్వారానికి తాళాలు వేయించారు. దీంతో కార్యాలయ సిబ్బంది, సందర్శకులు పక్కనున్న మరో ద్వారం గుండా రాకపోకలు చేస్తున్నారు. ఇటీవల ఆయన పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఇక్కడ కూడా వాస్తు విరుద్ధంగా ఉన్న ప్రధాన ద్వారాన్ని మూయించాలని, లేకపోతే మంచి జరగదని సలహా ఇచ్చారు. దీంతో పంచాయతీ అధికారులు ఆ గేటును మూసి వేసి పక్కనున్న వాహనాల పార్కింగ్ గేటు ద్వారా రాకపోకలు చేస్తున్నారు. ఈ రెండు భవనాలను కొన్నేళ్ల కిందట నిర్మించారు. ఇప్పటివరకు వీటి వల్ల ఎలాంటి హాని జరగలేదు. కానీ ఇప్పుడు వాస్తు ప్రకారం గేట్లు మూయించడంపై పలువురు విమర్శలు గుప్పి స్తున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు.



మూసి ఉన్న తహసీల్దారు కార్యాలయం ప్రధాన ద్వారం



పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం

అధ్వానంగా కుమారపురం శ్మశానవాటిక

పాయకరావు పేట : మండలంలోని కుమారపురం శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో దహన సంస్కారాలు నిర్వహించే సమయంలో గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. సుమారుమూడు వేల జనాభా ఉన్న ఈ గ్రామంలో ఎకరా స్థలంలో శ్మశాన వాటిక ఉంది. దశాబ్దాలుగా ఇది అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ దహన పేటిక తప్పించి విశ్రాంతి భవ నం, నీటి సౌకర్యం, ఇతర సదుపాయాలేవీ లేవు. శ్మశానానికి వచ్చేవారి కోసం కనీసం షెడ్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షం పడితే అవస్థలు పడుతున్నారు.నీటి సదుపాయం లేకసమీపంలో ఉన్న చెరువు వద్ద స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధి కారులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఈ విష యమై ఎంపీడీఓ సాంబ శివరావు వద్ద ప్రస్తావించగా మండలంలో ప్రస్తుతం నాలుగు పంచా యతీల్లో శ్మశానవాటికలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా తుప్పలు తొలగింపు, ఎత్తు పల్లాలు లేకుండా చదు ను చేయడం, చుట్టూ ప్రహరీ, విశ్రాంతి భవనం, క్రిమిషన్ షెడ్, రన్నింగ్ వాటర్ సదుపాయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో కుమార పురం శ్మశాన వాటికను కూడా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు.



కనీస వసతుల్లేని కుమారపురం శ్మశానవాటిక

మాధవి విద్యా విహార్‌కు ఫ్యాన్లు బహూకరణ

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని విజయరామరాజుపేటలో ఉన్న గుడిలోవ వారి మాధవి విద్యావిహార్ పాఠశాలకు నక్కపల్లి వాసులు గురువారం పది సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. నక్కపల్లి మండలం రేబాక సర్పంచి గొట్టిముక్కల శ్రీహరిరాజు కుమారుడు రవికుమార్‌రాజు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఆయనతో పాటు అతని మిత్రులు ఇంజనీర్లు మురళీ, శ్రీకాంత్, శేఖర్, రాంబాబు, సీతారామయ్య, కృష్ణారెడ్డిల సహకారంతో కొనుగోలు చేసిన పది ఫ్యాన్లను శ్రీహరిరాజు స్కూల్ కరస్పాండెంట్ ఒరుగంటి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూకాల అప్పలరాజుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫ్యాన్లు అందిస్తున్న శ్రీహరిరాజు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

ఎస్.రాయవరం(నక్కపల్లి) : ఎస్. రాయవరంలోని కర్రి వీధిలో సుమారు రూ. 25 లక్షలతో నిర్మించిన దుర్గాంబికా అమ్మవారి దేవాలయాన్ని గురువారం ప్రారంభించారు. ముందుగా పసిడి కలశ స్థాపన, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేలాది మంది భక్తుల సమక్షంలో నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం వేదపారాయణ, పంచగవ్యప్రాశన, హోమాలు, పూర్ణాహుతి, ప్రథమఅర్చన వంటి కార్యక్రమాలు జరిగాయి. ఎస్. రాయవరం సహా పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు బొలిశెట్టి గోవింద్, దాసరి నారాయణరావు, కర్రి వెంకట నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో తేజోవంతమైన అమ్మవారి విగ్రహాన్ని (రూపాన్ని) చూసిన భక్తులు ఆనందపరశం చెందారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. అనంతరం 10 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే బాబూరావు, ఎంపీపీ వినోద్‌రాజు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నల్లపురాజు వెంకట్రాజు ఉన్నారు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ వినోద్‌రాజు

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - లై
తులసీ చిత్రమందిర్ - నేనే రాజు నేనే మంత్రి
పరమేశ్వరి - జయ జానకి నాయక

పల్లెకు పండుగ

- మూడు గ్రామాల్లో అమ్మవారి జాతరలు
- భక్తులతో కళకళలాడిన ఎర్రవరం తిమ్మరాజుపేట, నాగులాపల్లి



ఎర్రవరం పొలిమేరమ్మ ఆలయం వద్ద భక్తులు (ఇన్‌సెట్లో) అమ్మవారు



నాగులాపల్లిలో భక్తుల పూజలు

ఎలమంచిలి/మునగపాక : మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రవరంలో గురువారం పొలిమేరమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. తెల్లవారుజాము 4 గంటల నుంచే ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. గతేడాది కంటే ఈసారి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మునగపాక నానాజీ పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే మునగపాకలోని తిమ్మరాజుపేట, నాగులాపల్లి గ్రామాల్లో మరిడి మహాలక్ష్మి పండగ ఘనంగా జరిగింది. వేకువజామున ఆరు గంటల నుంచే ఆయా గ్రామాల్లో భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు సూరిశెట్టి రాము రాజేశ్వరి, యల్లపు భాస్కరరావు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు ఏర్పాటు చేశారు. తిమ్మరాజుపేటలో భక్తులు శూలాలు ధరించి ప్రదర్శన చేయగా, నాగులాపల్లిలో చెడుగుడు పోటీలు నిర్వహించారు.



తిమ్మరాజుపేటలో ఘటాల ఊరేగింపు



నాగవరంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యకళ

వివాదాస్పద స్థలం పరిశీలన

మునగపాక : రెండు మండలాలు, రెండు గ్రామాల మధ్య వివాదం తలెత్తుతున్న నాగవరం సర్వే నంబరు 382,ఇరువాడ చెరువు ప్రాంతాలను సర్వే చేసి, సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో ఎంవీ సూర్యకళ అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం ఆమె నాగవరంలోని వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల ఈ స్థలం విషయమై సిట్‌కు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ రాంబాబు నివేదిక పంపించారు. అయితే ఆ నివేదికపై ఆర్డీవోను విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు ఆమె స్థలాన్ని పరిశీలించారు. ఆమెతో పాటు తహసీల్దార్ రాంబాబు, వీఆర్వో కృష్ణ ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

అచ్యుతాపురం : ఉగ్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పించన్ పథక ఉద్యోగుల సంఘం మండల శాఖ అధక్ష, కార్యదర్శులు పట్నాల నాగేశ్వరరావు, దోని నూకరాజు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దుపై విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్ కార్యక్రమం వాల్ పోస్టర్లను ఎంఈఓ దేవరాయల్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్న డిమాండ్‌తో వచ్చే నెల 1వ తేదీన విజయవాడలో మిలియన్ మార్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోటూరు త్రినాథ స్వామి, విజయ, సాయి శృతి, అప్పలనాయుడు, పాల్గొన్నారు

మల్లవరంలో కబడ్డీ పోటీలు



గణపర్తి, తిమ్మరాజుపేట మధ్య పోటీ

అచ్యుతాపురం రూరల్ : మల్లవరం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మునగపాక మండలం గణపర్తి జట్టు ప్రథమ స్థానంలోనూ, తిమ్మరాజుపేట, మడకపాలెం, ద్వితీయ, తృతీయ స్థానాల్లోనూ నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానికులు కండిపల్లి శ్రీను, రావి శోభన్ బాబు,చిన్ని శ్రీనివాసరావు, ధూళి గోపాలకృష్ణ, కర్రి రాజు, దూళి శివాజి, కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ

'పర్యావరణాన్ని రక్షిద్దాం'

ఎలమంచిలి : పట్టణంలో గురువారం ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వేగి సత్యనారాయణ,సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో అమూల్యమైనదన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు జోగునాయుడు, రామును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలతో సమావేశం

ఎలమంచిలి రూరల్ : డ్వాక్రా మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏసీ వరప్రసాద్ అన్నారు. గురువారం లైనుకొత్తూరులోని వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలుగు ఏసీ వరప్రసాద్

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

ఎలమంచిలి : ఎలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

తిమ్మరాజుపేటలో పశువైద్య శిబిరం

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం పశు వైద్య శిబిరం జరిగింది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ ఏడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో 111 పశువులకు పరీక్షలు జరిపి, అవసరమైన వాటికి మందులు అందజేశారు. అలాగే 65 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారిణి సౌజన్య, సర్పంచ్ భర్త శరగడం జగ్గారావు, పాల సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు పాల్గొన్నారు.



రైతులకు మందులు అందజేస్తున్న ఏడీ రామచంద్రరావు

కొనసాగుతున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మె

ఎలమంచిలి : పట్టణంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ మేరకు స్థానిక ఎల్‌ఐసీ యూనియన్ నేతలు రామారావు, తదితరులు సంఘీభావం తెలిపారు. సమ్మెలో ఉద్యోగులు రామ అవతారం, జోగినాథం, వెంకటరావు., నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లో గ్రామీణులు

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కూలీలకు బిల్లుల చెల్లింపు నిలిచిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.అలాగే ఉత్త రాల బట్వాడాతో పాటు నిరుద్యోగుల జాబ్ కాల్ లెటర్స్ బడ్వాటా కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.



ఎలమంచిలిలో ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న ఎల్‌ఐసీ యూనియన్ నేతలు

ప్రభుత్వం వారితో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం : అచ్యుతాపురం పోస్టల్ కార్యాలయం వద్ద ఆ శాఖ ఉద్యోగులు గురువారం నుంచి నివధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని, కమలేష్ చంద్ర పే కమిటీ సిఫారుసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది షేక్ లాల్ మహమ్మద్, వీఎస్ విశ్వేశ్వరరావు, ఎల్. లోకేశ్వరరావు, జి. అచ్చిబాబు, జె. జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో నినాదాలు చేస్తున్న పోస్టల్ సిబ్బంది

ఆనంద్‌కు ఘన స్వాగతం



ఆనంద్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

ఎలమంచిలి : అమెరికా పర్యటన అనంతరం గురువారం స్వదేశానికి వచ్చిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కు విశాఖ ఎయిర్ పోర్టులో అభిమానులు ఘన స్వాగతం పలికారు.ఈ మేరకు ఎలమంచిలి నుంచి పెద్దసంఖ్యలో ఆడారి అభిమానులు విశాఖ తరలివెల్లారు. యువత ఆనంద్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీను, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, ఆడారి వెంకట్, కొండబాబు, బొద్దపు రమణ, పాల్గొన్నారు.

రైతు బాంధవుడు గౌ॥ శ్రీ పీలా గోవింద సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు

ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటు ఘనత 'పీలా'దే

అనకాపల్లి టౌన్ : ఉత్తరాంధ్రలో నేటి వరకు ఏర్పాటు కాని ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటు ఘనత ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకే దక్కింది. ఉత్త రాంధ్ర జిల్లాలో రైతులు జీడిమామిడి పం టలు ఎక్కువగా పండిస్తున్నారు. అయితే ఈ పంటలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే నాథుడు అంతగా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు తాడేపల్లి గూడెంలో ఉన్న వైఎస్సార్ ఉద్యానవన యూనివర్శిటీకి పాలకమండలి సభ్యులుగా ఎమ్మెల్యే పీలాను నియమించారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజునే అన కాపల్లిలో ఉద్యానవన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు కూడా చేశారు. ఇందుకు పాలకవర్గం కూడా తీర్మానం చేయడంతో పాటు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నిధులు ఆరు కోట్లరూపాయలు పరిశోధన కేంద్రం ఏర్పా టుకు అవసరమైన స్థలం కొనుగోలుకు నిధులు మంజూరుకాగా నాబార్డు నిధులు 18 కోట్ల రూపాయలు పరిశోధనా కేంద్రం భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు మంజూరయ్యాయి. త్వరలోనే వీటి పనులు ప్రారంభం కానున్నాయి. అంతేకాకుండా నూకాంబిక ఆలయానికి అభివృద్ధిబాట పట్టే విధంగా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. పది కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం నుంచి ఆలయానికి మంజూరు చేయించి ఆలయానికి అవసరమయ్యే స్థలం కొనుగోలులో నిమగ్నమయ్యారు.

ఆలయాన్ని విజయవాడ కనకదుర్గ ఆలయం మాదిరిగా అభివృద్ధిపరిచేందుకు రూపకల్పన చేస్తున్నారు. నియోజకవర్గంలో రూరల్ హౌసింగ్ పథకం కింద 3250, అర్బన్‌లో 5700 ఇళ్ళు మంజూరు చేశారు. అనకాపల్లి జీవీఎంసీలో వంద కోట్ల రూపాయలతో అభివృద్ధిపనులు జరిగేలా కృషి చేశారు.



ఉద్యానవన పరిశోధ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన దృశ్యం













పుట్టిన రోజు, షష్టిపూర్తి, స్వదేశాగమనం, వర్ధంతి, శ్రద్ధాంజలి
సందర్భం ఏదైనా... మీ బంధువులకు, మిత్రులకు త్వరితగతిన సమాచారాన్ని అందించాలంటే 'ఆంధ్రజ్యోతి' లో ప్రకటన ఇవ్వండి!
94917 64122

ఆశ్రమ విద్యార్థులకు బూట్లు

మన్యంలో 122 పాఠశాలలకు అందజేత

37 వేల మంది విద్యార్థులకు లబ్ధి

కార్పొరేట్ తరహాలో ఉండాలని ప్రభుత్వ యోచన

పాడేరు: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ఈ ఏడాది బూట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్పొరేట్ విద్యాలయాల తరహాలో ఉండాలనే ఆలోచనతోనే విద్యార్థులకు బూట్లను ఇవ్వాలని యోచించింది. అదే జరిగితే మన్యంలోని 37 వేల మందికి లబ్ధి చేకూరుతుంది.

ఏజెన్సీలోని 11 మండలాల్లో 122 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యాలయాల్లో సుమారు 37 వేల మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వారికి భోజన, వసతులతో పాటు చెప్పులు, పుస్తకాలు, యూనిఫారాలు, కాస్మోటిక్స్ వంటివి ప్రస్తుతం అందిస్తున్నారు. తాజాగా బూట్లు కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం శుభపరిణామం.


ఈ తరహా బూట్లను విద్యార్థులకు అందిస్తారు..,

కార్పొరేట్ తరహా అనుభూతి కోసమే...

ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థులకు సైతం కార్పొరేట్ తరహా అనుభూతికి కలిగించాలనే లక్ష్యంతో ఈ ఏడాది ఒక జత బూట్లను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం కాన్వెంట్‌లు, కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులు బూట్లు వినియోగిస్తున్నారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల్లోని విద్యార్థులకు వాటిని అందిస్తే వారు ఆనందం, ఉత్సాహంగా ఉండటంతో పాటు తల్లిదండ్రులు సైతం తమ బిడ్డలు చక్కని వస్త్రధారణతో ఉన్నారని గర్విస్తారనేది అధికారుల భావన. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో బూట్ల పంపిణీకి సంబంధించిన టెండర్ ప్రక్రియను పూర్తి చేసి, మరో నెల రోజుల్లో వాటిని విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు సైతం కార్పొరేట్ తరహా లుక్ వస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

20న కోఫోకాన్ కరాటే శిక్షణ శిబిరం

పాడేరు రూరల్: స్టూడెంట్ కోఫోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కోఫోకాన్ కరాటే క్లబ్ బ్లాక్‌బెల్ట్ ఇనస్ట్రక్టర్ వెలుసూరి అప్పన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్లో బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్ వరకు శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కోఫోకాన్ కరాటే జిల్లా చీఫ్ ఇనస్ట్రక్టర్ బాకూరు పాండురాజు హాజరు కానున్నారన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కోఫోకాన్ కరాటే విద్యార్థులంతా హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి సమాచారం కోసం 9490572364, 9490441538 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

యువకుడికి చికెన్ గున్యా

కేజీహెచ్‌కు తరలింపు

పాడేరు రూరల్: నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ యువకుడికి చికెన్‌గున్యా లక్షణాలు ఉన్నట్టు ఏరియా ఆస్పత్రి వైద్యులు గుర్తించారు. దీంతో మెరుగైన వైద్య సేవల కోసం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాలని సూచించారు. పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ కప్పాడ గ్రామానికి చెందిన పాంగి శంకరరావు(28) సోమవారం రాత్రి నుంచి అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు గురువారం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. కాలు, చేతులు పట్టు వదలడం, రక్తం గడ్డ కట్టినట్టు ఉండడం, శరీరం వాచిపోవడం, నడవ లేని దుస్థితికి చేరడంతో శంకరరావుకు వైద్యాధికారి దుర్గరాజ్ సేవలు అందించారు. బాధితుడు చికెన్‌గున్యా వ్యాధి లక్షణాలతో బాధ పడుతున్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్య సేవల కోసం ఆస్పత్రి అంబులెన్స్‌లో శంకరరావును విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

రాయితీ రుణాల కోసం 242 దరఖాస్తులు

పాడేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం గురువారం నిర్వహించిన లబ్ధిదారుల ఎంపికకు 242 మంది నుంచి దరఖాస్తులు అందాయని ఎంపీడీవో ఉబ్బేటి మధుమోహన్‌కుమార్ తెలిపారు. 191 మందికి రుణాలు అందించేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని చెప్పారు. పట్టణంలోని వివిధ బ్యాంకులకు చెందిన అధికారులతో పాటు మండల ప్రత్యేకాధికారి, వెలుగు ఏపీడీ చెండా లచ్చన్న ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. 2017-18 ట్రైకార్, తదితర రాయితీ రుణాలకు నిర్వహించిన ఎంపికలకు ఎస్టీ అభ్యర్థులు 187 మంది, బీసీ అభ్యర్థులు 30, ఎస్సీ అభ్యర్థులు 15, కాపు అభ్యర్థులు ఎనిమిది మంది, మైనార్టీల నుంచి ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో చెప్పారు. అభ్యర్థుల వివరాలను ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. బ్యాంకర్ల ఆమోదంతో అభ్యర్థులకు రుణాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వి.నగేష్, బ్యాంకు క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎం రమేష్

వనిత కార్డులతో ప్రయాణంలో రాయితీ

ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్

పాడేరు రూరల్: వనితా కార్డుల వల్ల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి పది శాతం రాయితీ ఇవ్వనున్నట్టు ఆర్టీసీ డీఎం కె.రమేష్ తెలిపారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితాలను సేకరించి ఆర్టీసీ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కుటుంబంలో ఉన్న సభ్యులు అందరికీ వనితా కార్డును అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంటి యజమానికి రూ.100కు వనితాకార్డును అందించడంతో పాటు కుటుంబంలో ఉన్న మరో నలుగురు సభ్యులకు రూ.20కే కార్డును ఇస్తామన్నారు. వనితా కార్డు పొందిన సభ్యులకు రెండేళ్ల పాటు పది శాతం రాయితీపై తెలుగు వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

అక్రమార్కులపై అధికారులకు ఫిర్యాదు

సీలేరు: సీలేరులో అక్రమాలను పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ కన్వీనర్ కిముడు మోహన్‌బాబు డిమాండ్ చేశారు. గిరిజన హక్కులను తుంగలో తొక్కుతూ, ఇక్కడ విధులు నిర్వహించే వారిపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు, గిరిజన సంఘాల నాయకులకు, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

ట్రైకార్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

జి.మాడుగుల: ట్రైకార్ రుణాల మంజూరు కోసం గురువారం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకు అధికారులు, ఎంపీడీవో అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించారు. మండలంలోని 432 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అలాగే దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాని పక్షంలో ఈ నెల 21వ తేదీన 10 గంటలకు రావాలని ఎంపీడీవో ప్రేమాకరరావు తెలిపారు.

ఆర్టీసీ డిపో స్థలాల పరిరక్షణకు చర్యలు

తహసీల్దార్ దుర్గారవీంద్రనాథ్

పాడేరు రూరల్: పట్టణంలో ఆర్టీసీ డిపోకు చెందిన స్థలాలు అక్రమణలకు గురికాకుండా తగిన చర్యలు చేపడతామని తహసీల్దార్ జె.దుర్గారవీంద్రనాథ్ తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో దుకాణదారులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ఆర్టీసీ స్థలాలను వ్యాపారులు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై ఆర్టీసీ, ఆర్అండ్‌బీ అధికారుల సమక్షంలో స్థల సర్వే నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం ఆర్టీసీ డీఎం కె.రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో ఆర్టీసీకి ఆదాయం సమకూర్చే స్థలాలు స్థానిక డిపోలోనే ఉన్నాయన్నారు. కాంప్లెక్స్ పరిధిలో 26 మంది దుకాణాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. వీరిలో 20 మంది స్థలాలను ఆక్రమించారన్నారు. అలాగే జి.మాడుగుల మండలం కేంద్రంలో ఆర్టీసీ బస్సు షెల్టర్ అన్యాక్రాంతమైనట్టు తెలిసిందన్నారు. అక్కడ షెల్టర్‌కు ప్రహరీ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారని వివరించారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

'వనం-మనం'తో పర్యావరణానికి మేలు

పాడేరు: వనం-మనం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలను నాటడం వల్ల పర్యావరణానికి మేలు చేకూరుతుందని ఇన్‌చార్జి జిల్లా మలేరియా నివారణ అధికారి కుమార్ అన్నారు. స్థానిక డీఎంవో కార్యాలయ ఆవరణలో గురువారం వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న సుమారు అర ఎకరం ప్రదేశంలో వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం డీఎంవో మాట్లాడుతూ, అవకాశం ఉన్న మేరకు అధిక సంఖ్యలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా అందరూ కృషి చేయాలని కోరారు. అలాగే తమ కార్యాలయ ఆవరణలో నాటిన మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో సంరక్షించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ విభాగం సమన్వయకర్త శ్రీనివాస్, ఏఎంవో రామారావు, సూపర్‌వైజర్ సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఇన్‌చార్జి డీఎంవో

జి.మాడుగులలో చోరీ

జి.మాడుగుల: మండల కేంద్రంలో గురువారం పది తులాల బంగారం, నగదు చోరి జరిగినట్టు బాధితులు తెలిపారు. గెమ్మెలి పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా చేస్తున్న కె.ప్రేమకుమారి రామాలయం కాలనీలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి ఇంట్లో లేనని, గురువారం తెల్లవారు జామున వచ్చి చూసేసరికి తాళాలు తెరిచి ఉన్నాయని ఏఎన్ఎం చెప్పారు. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలో ఉన్న పది తులాల బంగారం, రూ.2500 నగదు కనిపించడలేదని తెలిపారు. దీంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె తెలిపారు.

రెగ్యులర్ వీఆర్వో లేక ప్రజల ఇక్కట్లు

సీలేరు: సీలేరు మేజర్ పంచాయతీకి రెగ్యులర్ వీఆర్వో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువపత్రాలకు ఆగచాట్లు పడుతున్నారు. సీలేరుకు రెండేళ్లుగా రెగ్యులర్ వీఆర్వో లేక దుప్పులవాడ వీఆర్వో మంగమ్మను ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె సీలేరులోనే ఉండడంతో సమస్య ఉండేది కాదు. ఇటీవల మంగమ్మకు సీలేరు అదనపు బాధ్యతల నుంచి తొలగించి వేరొకరికి అప్పగించారు. అతను ఇంత వరకూ సీలేరు రాకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంలో అధికారులు స్పందించాలని వారు కోరారు.

పుట్టిన రోజు, షష్టిపూర్తి, స్వదేశాగమనం, వర్ధంతి, శ్రద్ధాంజలి
సందర్భం ఏదైనా... మీ బంధువులకు, మిత్రులకు త్వరితగతిన సమాచారాన్ని అందించా లంటే 'ఆంధ్రజ్యోతి' లో ప్రకటన ఇవ్వండి!
9985409890

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

సంరక్షణ విభాగం జిల్లా ఫీల్డ్ వర్కర్ మనోహర్


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

దేవరాపల్లి: బాలల పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం ఫీల్డ్ వర్కర్ కేఎల్. మనోహర్ అన్నారు. మండలంలోని రైవాడలో సర్పంచ్ చల్లా కృష్ణవేణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమగ్ర బాలల పరిరక్షణ పథకంలో భాగంగా జిల్లాలో 100 గ్రామాలను ఎంపిక చేశారని, కె.కోటపాడు ప్రాజెక్టు పరిధిలోని గవరపాలెం, వారాడ, దేవరాపల్లి మండలంలోని రైవాడ, కాశీపురం గ్రామాలను ఎంపిక చేశారని అన్నారు. 0 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలబాలికల సంరక్షణ, విద్య, శిశువిహారం, రోడ్లపై తిరిగే ఆరేళ్లలోపు అనాథ పిల్లలను గుర్తించి వారికి ఆశ్రయం కల్పించడంతోపాటు వారికి విద్యనందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

బాల్య వివాహాల నిరోధం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికలపై అత్యాచారాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి వారి సంరక్షణ కోసం మూడేళ్లపాటు ప్రతినెలా రూ.500లు ఇవ్వడంతో పాటు సంరక్షణ కోసం అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు.

గ్రామస్థాయిలో సర్పంచ్, కార్యదర్శి, వీఆర్‌వో, అంగన్‌వాడీ బోధకులు సభ్యులుగా ఉండగా, మండల స్థాయిలో ఎస్‌ఐ, ఎంపీడీవో, తహసీల్దార్, సీడీపీవో, డివిజన్‌లో ఆర్‌డీవో, జిల్లా స్థాయిలో ప్రాజెక్టు డైరెక్టర్‌ల పర్యవేక్షణలో ఈ విభాగం నడుస్తోందని అన్నారు. ఈ సమావేశలో ఎంపీటీసీ సభ్యురాలు చల్లా నీరజ, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు కె.స్వర్ణలత, ఏఎన్‌ఎం రాజేశ్వరి, కార్యదర్శులు వై.అప్పలరాజు, కె.రామునాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు లలితా ప్రసాద్, అంగన్‌వాడీ బోధకులు పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

మండల కో-ఆర్డినేటింగ్ అధికారి రమణమూర్తి


గ్రామసభలో మాట్లాడుతున్న రమణమూర్తి... అనంతరం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కె.కోటపాడు : ప్రజలు బాధ్యతగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని మండల కో-ఆర్డినేటింగ్ అధికారి డీవీ రమణమూర్తి అన్నారు. మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గొండుపాలెంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలతోనే స్వచ్ఛ గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో బహిరంగ మలమూత్ర విసర్జనలను నిషేధించాలని, ఇంకా కొనసాగితే జరిమానాలు విధించాలని సూచిచారు. మరుగుదొడ్లను ప్రజలు నిర్మించుకునే విధంగా చైతన్య పరచాలని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంటాకు శ్రీను, వైస్ ఎంపీపీ బండారు మంగపతి, తహసీల్దార్ బీవీ రాణి, ఎంపీడీవో ఆర్.పూర్ణిమాదేవి, ఎంఈవో టి.మధుమూర్తి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చైతన్యయాత్రపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

దేవరాపల్లి: అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు అన్నారు. ఈ నెల 16న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన ఈ చైతన్యయాత్ర సెప్టెంబర్ 15న అనంతపురం చేరుతుందన్నారు. ఈ సందర్భంగా చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్చి 23న అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేందుకు అధికార బృందాన్ని నియమించాలని, రాష్ట్రంలో 19.52 లక్షలు, ఎనిమిది రాష్ట్రాల్లో 32లక్షల మంది ఖాతాదారుల సొమ్ము 7600 కోట్లు వెంటనే ఇప్పించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను ఆత్మహత్యలకు, మరణాలకు గురైన వారి కుటుంబాలకు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ రియల్ ఎస్టేట్‌లో ప్లాట్‌లు కొన్నవారందరికీ వాటిని రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని, యాజమాన్యం కుటుంబ సభ్యుల బినామీ ఆస్తులను జప్తు చేయాలని, బయట ఉన్న నేరస్తులను వెంటనే అరెస్ట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి ధనలక్ష్మి, దొమ్మంగి వెంకటలక్ష్మి, రాయి సింహాద్రప్పడు, ఎం.మరియాదాస్, పెంటయ్య పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

చీడికాడ: మండలంలోని కోనాం శివారు చినకోనాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు కె.రామునాయుడు, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ కె.దేవి గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. చోడవరానికి చెందిన బ్యాంకు ఉద్యోగి ఎంఆర్‌ఎన్.శివకుమార్ ఈ పుస్తకాలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, కె.రమణ, ఆర్.ఈశ్వరరావు, గ్రామ పెద్ద చిన్ని దేముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం : గవిరెడ్డి

చీడికాడ: మండలంలోని అప్పలరాజుపురంలో శుక్రవారం టీడీపీ మాడుగుల నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని మాడుగుల మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గవిరెడ్డి రామానాయుడు తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి నాలుగు మండలాల సమన్వయ కమిటీ సభ్యులు తప్పనిసరిగా రావాలని కోరారు.

రోగులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ


రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మాడుగుల: మాడుగుల మండల కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజె ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగులకు చెందిన ప్రింట్‌మీడియా విలేఖరుల ఆధ్వర్యంలో స్థానిక 30 పడకల ఆస్పత్రిలో రోగులకు బిస్కెట్ ప్యాకెట్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తిరుపతిరావు, స్వప్నప్రియ పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ తహసీల్దార్ అవార్డు పొందిన తహసీల్దార్ పి.శేషశైలజకు మాడుగుల ఫోరం విలేఖరులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు రొబ్బా శ్రీనివాసరావు, తేటకళ్ల జగన్నాథరావు, శివ, అప్పలరాజు, మస్తాన్, సురేష్, వెంకటరావు, బుద్దా జగ్గారావు పాల్గొన్నారు.

టీడీపీ మండల నేతలు భుజాలు తడుముకుంటున్నారు : పైలా ప్రసాదరావు



మాడుగుల: మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నుదన్నుగా నిలుస్తున్నారని, ఆ కార్యకర్తల మనోభావాలను విస్మరించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా టీడీపీ మండల స్థాయి నాయకులు వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఏపీ జన్మభూమి సమన్వయకర్త పైలా ప్రసాదరావు అన్నారు. గురువారం ఈ మేరకు ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. తాను గ్రూపు రాజకీయాలు చేస్తున్నానని పార్టీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. 2019 ఎన్నికల్లో తాను నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఇటీవల పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పానని, ఆ మాత్రానికే మండల నాయకులు భుజాలు తడుముకోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. తాను నియోజకవర్గానికి దూరంగా ఉన్నానన్న మాట వాస్తవమే అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో పార్టీలోకి వచ్చానని తెలిపారు. మాడుగుల నియోజకవర్గంలో 34 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు ఆర్థిక సహాయమందించానని, రాష్ట్రంలో కూడా వేలాది పాఠశాలల్లో తరగతుల ఏర్పాటుకు చేయూతనందించానని తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి పీఆర్‌ఈడీ గ్రాంట్ ద్వారా రూ.2కోట్ల నిధులు మంజూరు అయినప్పటికీ వాటి ఖర్చులను బాధ్యతగా చూడాల్సిన నాయకులు అవినీతి, సొంత లాభాల మూలంగా అభివృద్ధి ఫలాలు ప్రజల చేరలేదని తెలిపారు. ఒకరిపై వ్యాఖ్యలు చేసే ముందు వెనుక ముందులు ఆలోచించడం మంచిదని, స్థాయిని మించి వ్యాఖ్యలు చేయడం సరి కాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌బాబు ఆధ్వర్యంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను నియోజకవర్గంలో నిర్వహించేందుకు సమయం వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధులు దూరం


చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

చీడికాడ: ఎంఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధులు దూరమవుతాయని వి.మాడుగుల ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని కోనాం సబ్‌సెంటర్‌లో చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి టి.సత్యనారాయణ, ఎంపీడీవో ఆర్‌ఎం.గాడ్స్, ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, స్థానిక పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు చలుగు అప్పలనాయుడు సందర్శించారు. సీహెచ్‌వో ప్రసాద్, పీహెచ్‌ఎన్.రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
5
చోడవరం
విశాఖపట్నం। శుక్రవారం 28 ఏప్రిల్ 2017
చోడవరం । బుచ్చెయ్యపేట । రావికమతం । రోలుగుంట

పుట్టిన రోజు, షష్టిపూర్తి, స్వదేశాగమనం, వర్ధంతి, శ్రద్ధాంజలి
సందర్భం ఏదైనా... మీ బంధువులకు, మిత్రులకు త్వరితగతిన సమాచారాన్ని అందించాలంటే 'ఆంధ్రజ్యోతి' లో ప్రకటన ఇవ్వండి!
9985409890

అంకుపాలెం పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సినేషన్


పిల్లలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

చోడవరం: మండలంలోని అంకుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు టీకాలు వేశారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులకు. 30 మంది అంగన్‌వాడీ పిల్లలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. ఎంవీ స్వామి, ఉపాధ్యాయులు ఎంవీ సరస్వతి దేవి, ఎ.మహేశ్వరి, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఆర్.నాగమణి, వైద్య సిబ్బంది కె.చెల్లయ్యమ్మ,ఎ. రమణమ్మ, కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో....


శరభవరంలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

రోలుగుంట : మండలంలోని రోలుగుంట, బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రాల పరిధిలో 497 మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. రోలుగుంటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఇళ్లల్లో పిల్లలు 160 మందికి వ్యాక్సిన్ వేశామని వైద్యాధికారి విజయకుమారి తెలిపారు. బుచ్చెంపేట ఆరోగ్యకేంద్రం పరిధిలో శరభవరం, బీబీ పట్నం, నందిపురం గ్రామాల్లో 335 మంది విద్యార్థులకు వ్యాక్సిన్ వేశామని వైద్యాధికారిని కుసుమ మౌనిక తెలిపారు. మండలంలో నిర్ధేశించిన మేరకు పూర్తిస్థాయిలో పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేస్తామని, బడి బయట ఉన్న పిల్లలకు ఆరోగ్య కేంద్రాలకు వస్తే వ్యాక్సిన్ వేస్తామని ఆమె చెప్పారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


సీతయ్యపేటలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఈ శ్రీదేవి

బుచ్చెయ్యపేట : మండలంలో ఐదు ఎరువుల దుకాణాలను గురువారం అనకాపల్లి వ్యవసాయ శాఖ ఏడీ పి.శ్రీదేవి తనిఖీ చేశారు. సీతయ్యపేటలో నూకయ్య, వడ్డాదిలో పసుమర్తి ఎరువుల షాపులో గల పీఓసీలో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ తేడాల కారణంగా ఎరువుల నిల్వలు నమోదు కాలేదని తనిఖీలో గుర్తించిన శ్రీదేవి ఈ రెండు షాపుల్లో ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. చోడవరం ఎరువుల దుకాణం యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లో వడ్డాది ఎరువుల వివరాలను నమోదు చేసినట్టుగా గుర్తించిన ఏడీఈ వడ్డాది యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లో ఎరువుల నిల్వల నమోదు అయినంతరం ఎరువుల అమ్మకాలు సాగించాలని పసుమర్తి షాపు యాజమానిని ఆదేశించారు. ఈ మేరకు వడ్డాది, సీతయ్యపేట షాపుల యాజమానుల నుంచి రాతపూర్వకమైన హామీ పత్రాలను తీసుకున్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారి శైలజ ఉన్నారు.

డబ్బులిస్తే గాని పనులు చేయరా?

- విద్యుత్ అధికారులపై సభ్యుల మండిపాటు
- రెండు సమావేశాలకు ఏఈఈ గైర్హాజరుపై ఆగ్రహం
- వాడివేడిగా బుచ్చెయ్యపేట మండల సర్వసభ్య సమావేశం


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు


విద్యుత్ లైన్‌మన్ చంద్రశేఖర్‌ను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనాగేశ్వరరావు

బుచ్చెయ్యపేట : డబ్బులిస్తే గాని విద్యుత్ శాఖలో పనులు జరగవా అంటూ విద్యుత్ అధికారులపై పలువురు సభ్యులు విరుచుకుపడ్డారు. గురువారం వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ సూర్యనాగేశ్వరరావు, రాజాం, మల్లాం, పెదమదీనా, చింతపాక, ఆర్.భీమవరం గ్రామ సర్పంచ్‌లతో పాటు ఎంపీటీసీ సభ్యులు నాగులాపల్లి సత్యనారాయణ, గొలగాని శ్రీనివాసరావు, వియ్యపు అనిత, మలిరెడ్డి బాబ్జి, వజ్రపు శ్రీను, గొన్నా బత్తుల శ్రీనివాసరావు తదితరులు అపరిష్కృతంగా విద్యుత్ సమస్యలపై లైన్ ఇన్‌స్పెక్టరు ప్రేమ చంద్రశేఖర్‌ను నిలదీశారు. రెండు సమావేశాలకు ముందు జరిగిన సర్వసభ్య సమావేశంలో వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ మహేష్ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల్లో ఏ ఒక్కటీ ష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హుద్‌హుద్ తుఫాన్‌లో కూలిపోయిన విద్యుత్ స్తంభాలను నేటికీ పునరుద్ధరించలేదని, సమస్య గురించి చెబుదామని ఏఈఈ కార్యాలయానికి వెళితే నిర్లక్ష్యమైన సమాధానాలు చెబుతున్నారన్నారు. పెదమదీనాలో జరిగిన జన్మభూమి కార్య క్రమంలో ప్రాథమిక పాఠశాలపై నుంచి విద్యుత్ సరఫరా వైర్లను తొలగించాలని ఏఈఈని ఆదేశించినా స్పందించకపోవడంపై వైస్ ఎంపీపీ సూర్యనాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులిస్తే గాని సమస్యలను పరిష్కరించారా? అని ఆయన నిలదీశారు. దిబ్బిడిలో చేతులకందేంత కిందకి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తొలగించాలని రెండేళ్లుగా అభ్యర్థిసున్నా ఏఈఈ స్పందించడం లేదని ఎంపీటీసీ సభ్యుడు గొన్నాబత్తుల శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోఓల్టేజ్ సమస్యతో పలు గ్రామాల వారు సతమతమవుతున్నారని, ఎమర్జన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో ఎడా పెడా విద్యుత్ కోతలు తప్పడం లేదని నాగులాపల్లి సత్యనారాయణ, వజ్రపు శ్రీను, వియ్యపు అప్పారావు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశానికి, ఈ సమావేశానికి ఏఈఈ గైర్హాజరు కావడంపై నిరసన వ్యక్తం చేశారు. ఏఈఈకి బదులు ఎల్‌ఐ ప్రేమ చంద్రశేఖర్ సమావేశంలో మాట్లాడడానికి వీల్లేదని, ఆయనను సమావేశం నుంచి పంపివేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ఎంపీడీవో కొండలరావు ఎల్‌ఐని నిలదీశారు. సభ్యులు రాతపూర్వకంగా సమస్యలపై ఫిర్యాదు చేయాలని ఎల్‌ఐ ప్రేమ చంద్రశేఖర్ సూచించారు. అనంతరం గ్రామాల్లో కార్యదర్శుల కొరతపై సభ్యులు చర్చించారు. వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వైద్యం, వెలుగు తదితర శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశానికి సమర్పించారు. ఏవో శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్బలక్ష్మి, మండల ఇంజనీర్ జగన్నాథం, తహసీల్దార్ కేవీవీ శివ, వడ్డాది, బుచ్చెయ్యపేట, తురకలపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎంకే నాయుడు, రజనీకాంత్, నీరజ, ఎంపీటీసీ సభ్యులు దొండా అరుణ, కంతే సుబ్బయ్యమ్మ, రుత్తల రాము తదితరులు పాల్గొన్నారు..

పట్టాదారు పుస్తకాల పంపిణీ

రోలుగుంట : భూమికి సంబంధించిన రికార్డు, ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉంటే వెంటనే పాసుపుస్తకాలను మంజూరు చేస్తామని తహసీల్దార్ పెంటకోట అప్పలనాయుడు అన్నారు. గురువారం ఆయన పలువురు రైతులకు ఈ-పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు మరింత పారదర్శకంగా రెవెన్యూ సేవలను అందించడానికి నూతన విధానంలో పాసుపుస్తకాలను ఇచ్చే ప్రక్రియను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ పట్టాదారు పాసుపుస్తకాలను పొందే రైతులు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే 10 నిమిషాల్లో పాసుపుస్తకం అందేలా ప్రభుత్వ ఏర్పాటు చేసిందన్నారు. ఈ నూతన విధానంలో పట్టాదారు పుస్తకాన్ని పొందాలంటే రైతులు మీసేవా కేంద్రాలకు వెళ్లి రైతు 1బి నెంబర్, చరవాణి నంబర్ చెప్పి వేలిముద్ర వేస్తే పట్టాదారు పుస్తకం వస్తుందన్నారు. ఇప్పటికే మీ ఇంటికి మీ భూమి కార్యక్రమంలో భాగంగా భూసమస్యలను 80 శాతం వరకు పరిష్కరించామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సీవీ చయనులు ఆర్ఐ గణపతిరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్న తహసీల్దార్ అప్పలనాయుడు


ఖండేపల్లిలో పశువైద్య శిబిరం



చోడవరం: మండలంలోని ఖండేపల్లిలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గవరవరం పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 23 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 8 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 27 లేగదూడలకు నట్టల నివారణ మందులు వేశారు. గాలికుంటు వ్యాధి సోకకుండా అన్నింటికీ టీకాలు వేశారు. గవరవరం పశువైద్యకేంద్రం వైద్యాధికారి ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంపై పగలే దేదీప్యమానం

చోడవరం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంపై ఎల్‌ఈడీ దీపం పగలు కూడా వెలుగులు విరజిమ్ముతోంది. పట్టణంలో సాధారణ వీధిదీపాల స్థానంలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. పనిలో పనిగా పంచాయతీ కార్యాలయం పైభాగాన కూడా ఏర్పాటు చేశారు. కూడా రాత్రివేళల్లో వెలగాల్సిన ఈ లైట్లు పట్టపగలు వెలుగుతున్నా, పంచాయతీ సిబ్బంది మాత్రం వీటి సంగతి పట్టించుకోలేదు. ఫలితంగా ఈ లైట్లు రోజంతా అలా వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్ ఆదా కోసం ఏర్పాటు చేసిన ఈ ఎల్‌ఈడీ లైటు పగటి సమయంలో కూడా వెలుగుతుంటే ఇక విద్యుత్ ఎలా ఆదా అవుతుందో పంచాయతీ అధికారులే చెప్పాలి.


పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మధ్యాహ్నం వెలుగులు విరజిమ్ముతున్న లైటు

విద్యార్థులకు స్టీలు కంచాల పంపిణీ

చోడవరం: మండలంలోని గోవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయుడు అనుపోజు శ్రీనివాసరావు స్టీలు కంచాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి.ఆదినారాయణ, ఉపాధ్యాయులు ఎం.చంద్రమౌళి, సీహెచ్ సత్య శివకుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టీల్ కంచాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పుట్టిన రోజు, షష్టిపూర్తి, స్వదేశాగమనం, వర్ధంతి, శ్రద్ధాంజలి

సందర్భం ఏదైనా... మీ బంధువులకు, మిత్రులకు త్వరితగతిన సమాచారాన్ని అందించాలంటే 'ఆంధ్రజ్యోతి' లో ప్రకటన ఇవ్వండి!

9985409070

మంత్రి కామినేనికి ఘన స్వాగతం



కామినేనికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

నర్సీపట్నం:

స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి నూతన భవనాలు, పడకల ప్రారంభోత్సవానికి గురువారం వచ్చిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాసరావుకు బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె శ్రీనివాసరావు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాళ్ల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి బంగారు ఎర్రినాయుడు, గొంప సత్యనారాయణ, పాకలపాటి అరవింద్‌రాజు, చింతాడ నూకేశ్వరరావు, తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మంత్రి కామినేని శ్రీనివాసరావును పలువురు బీజేపీ నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, యువమోర్చ ప్రతినిధులు కలిశారు.

కేడీపేట బస్‌స్టేషన్‌లో ఆక్రమణల తొలగింపు



కేడీపేటలో భవనాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

కృష్ణాదేవి పేట:

ఏఎల్‌పురం బస్‌స్టేషన్ ఆవరణలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని ఎట్టకేలకు అధికారులు తొలగించారు. బస్‌స్టేషన్ స్థలాన్ని ఆక్రమించి అద్దెలకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నారని స్థానికులు మంత్రి అయ్యన్నపాత్రుడికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించి మంత్రి ఆయా శాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. ఇప్పటికే ఈ భవనాన్ని ఖాళీ చేయాలని మాజీ ఎంపీపీ బీవీ రమణకు పలుమార్లు నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. దీంతో ఆయన స్పందించకపోవడంతో ఐదు శాఖాల అధికారులు పోలీసు భద్రతతో ఆక్రమణలు తొలగించారు. ఈకార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ జేఈ ప్రసాద్, వీఆర్‌వో పడాల్, పోలీసు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

నర్సీపట్నం టౌన్:

బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కో-ఆర్డినేటర్ తిరుపతి రవి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులంతా ఉదయం 10 గంటలకల్లా తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు ఏర్పాటు చేయబోయే యూనిట్‌కు సంబంధించిన వివరాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులతో సహా విధిగా హాజరుకావాలని కోరారు.

ప్రాంతీయ ఆస్పత్రిలో 50 పడకల ప్రారంభోత్సవ దృశ్యాలు



కొప్పర్తి రామారావు దంపతులు, సీఎంఆర్ రమణలను సన్మానిస్తున్న దృశ్యం



మంత్రి కామినేని శ్రీనివాసరావును సన్మానిస్తున్న సన్యాసిపాత్రుడు, తదితరులు

నియోజకవర్గానికి 3,500 పక్కా ఇళ్లు

లబ్ధిదారులకు ఎల్‌పీసీలు పంపిణీ : రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు మంజూరు చేసిన పక్కా గృహ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్‌అండ్‌బీశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. గురువారం నాడిక్కడ నర్సీపట్నం రూరల్ మండలంలో 350 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లను(ఎల్‌పీసీ) మంత్రి అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్న మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు ప్రభుత్వం 3,500 పక్కాగృహాలు మంజూరు చేసిందని, ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 50 వేలు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన మంజూరు ధ్రువపత్రాలను పంపిణీ ప్రారంభించామన్నారు.



ఎల్‌పీసీలు అందజేస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎంపీ అవంతి శ్రీనివాస్, తదితరులు

నర్సీపట్నం మున్సిపాలిటీలో సొంత ఇళ్ల స్థలాలు గల 1400 మందికి, ఇళ్ల స్థలాలు లేని మరొక 2,400 మందికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పక్కా ఇళ్లు మంజూరు చేశామన్నారు.

ఒక్కొక్క ఇంటిని రూ.3.5లక్షల వ్యయంతో ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందన్నారు. సొంత ఇళ్ల స్థలాలు లేనివారి కోసం బలిఘట్టం, బయపురెడ్డిపాలెం ప్రాంతాల్లో 20 ఎకరాల భూమిని కేటాయించామని, అయితే నర్సీపట్నం ప్రాంతంలో భూముల విలువ గణనీయంగా పెరగడంతో ప్రభుత్వమిచ్చిన ఇళ్ల స్థల పట్టాలను కూడా లబ్ధిదారులు అమ్ముకుంటున్నారని మంత్రి అయ్యన్నపాత్రుడు ఆవేదన వ్యక్తంచేశారు. రెవెన్యూశాఖ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కౌంటర్ల వద్ద ఎల్‌పీసీలు తీసుకునేందుకు లబ్ధిదారులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ సన్యాసిపాత్రుడు, ఆర్డీవో సూర్యారావు, తహసీల్దార్ వీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

'మెప్మాతో మహిళలకు ఆర్థిక స్వావలంభన'

నర్సీపట్నం టౌన్:

మున్సిపాలిటీలో మహిళా సాధికారతకు డ్వాక్రాబజారును ప్రారంభించనున్నట్టు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్ట్ డైరెక్టర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి తెలిపారు. గురువారం పెదబొడ్డేపల్లి మార్కెట్‌లో రెండు దుకాణాల్లో ప్రారంభించారు. ఎస్‌హెచ్‌జి సభ్యులు తయారుచేసిన వస్తువులకు మార్కెట్ కల్పించేందుకు ఈ సదుపాయం కల్పించామన్నారు. రెయిన్‌కోట్లు, ఫినాయిల్, నీలిమందు, పేపర్‌ప్లేట్లు ఇకపై ప్రతీ వారం స్థానిక రైతు బజార్‌లో అమ్మకాలు చేపడతారన్నారు. అనంతరం స్వశక్తి భవనంలో జరిగిన స్లమ్‌సమాఖ్య రిసోర్స్‌పర్సన్ నెలవారీ సమీక్షా సమావేశాలు, మెప్మా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జీవనోపాధి, ఆర్థికాభివృద్ధి వైపు అందరూ అడుగులు వేయాలన్నారు. అనంతరం 50 మంది నిరుద్యోగ యువతులకు 90 రోజుల బెడ్‌సైడ్ అసిస్టెంట్ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ పి.వరలక్ష్మి, టీఈలు జి.కిశోర్‌బాబు, పి.రామకృష్ణ, డీఎంసీ సీహెచ్ రాజారామ్మోహన్‌రాయ్, సీవో రవి, డీఈవో మురళి, సీఆర్పీలు లలిత, సత్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



శిక్షణ పొందిన యువతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పీడీ ప్రసన్నవాణి

బడి బస్సులు నడపాలి

నర్సీపట్నం టౌన్:

పాఠశాలలు, కళాశాలలకు నిర్ణీత వేళల్లో బడి బస్సులు నడపాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పట్టణ కార్యదర్శి సాయి అన్నారు. బస్సు సమస్యలపై గురువారం డిపో కార్యాలయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పాఠశాలలు, కళాశాలల సమయం ప్రకారం బస్సులు లేకపోవడంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అన్ని రూట్‌లలోనూ అధిక సంఖ్యలో బస్సులు తిప్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులున్న చోట్ల బస్సులను విధిగా ఆపాలన్నారు. ఈకార్యక్రమంలో తలుపులయ్య, ప్రకాశరాజ్, ప్రసాద్, వెంకటేష్, ఉదయ్, రామరాజు. తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

హంతకులను శిక్షించాలి



రఘువర్మ ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంఘ నాయకులు

గొలుగొండ:

గిరిజనులకు రక్షణ కరువైందని జిల్లా గిరిజన సంఘ అధ్యక్షుడు కె.కృష్ణారావు అన్నారు. నర్సీపట్నంలో హత్యకు గురైన మాదాల రఘువర్మ కుటుంబాన్ని ఏటిగైరంపేటలో గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నడిరోడ్డుపై పట్టపగలు రఘువర్మను హత్య చేసిన వారిపై నేటికీ చర్యలు చేపట్టడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. వందల మంది చూస్తుండగా రఘువర్మను హత్య చేశారన్నారు. ఏటిగైరంపేటలోనూ హత్యపై పోలీసులు విచారణ చేపడితే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు. రఘువర్మ కుటుంబానికి అన్యాయం జరిగితే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి పాంగి రాజారావు, చింతపల్లి మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బొయిన సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుల జిల్లా ఫోరమ్ కార్యదర్శి ఉల్లి సత్యనారాయణ, గిరిజన నాయుకులు బుల్లిబాబు, రాజకుమార్, కె.సోమయ్య, పాము రాజుబాబు, పాము అప్పలనాయుడు పాల్గొన్నారు.

పుట్టిన రోజు, షష్టిపూర్తి, స్వదేశాగమనం, వర్ధంతి, శ్రద్ధాంజలి
సందర్భం ఏదైనా... మీ బంధువులకు, మిత్రులకు త్వరితగతిన సమాచారాన్ని అందించా లంటే 'ఆంధ్రజ్యోతి' లో ప్రకటన ఇవ్వండి!
9985409698

వసతి సమస్య తీరుస్తాం

- పంచాయతీ నిధులతో తరగతి గది నిర్మాణం
- పి.ఎల్.పురంలో గ్రామ సభలో ఈఓపీఆర్‌డీ వెంకటనారాయణ

పాయకరావుపేట : మండలంలోని పి.ఎల్. పురం గ్రామంలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న పాఠశాల అదనపు గదిని పంచాయతీ నిధులతో పూర్తి చేస్తామని ఈఓపీఆర్‌డీ పి.వెంకటనారాయణ హామీ ఇచ్చారు.గురువారం గ్రామంలో జరిగిన మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా అధికారులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదిని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో అవసరమైన తరగతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారని, అసంపూర్తిగా ఉన్న అదనపు గది నిర్మాణాన్ని పంచాయతీ నిధులతో పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.ఎ.బి.ఎల్. మూర్తి, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మాజీ, ప్రమీలదేవి, సరోజ, ప్రభాకరరావు పాల్గొన్నారు.



పాఠశాల గదిని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ వెంకటనారాయణ



నక్కపల్లి : భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈవో ప్రసాద్

కాగిత గ్రామంలో...

నక్కపల్లి : మండలంలోని కాగిత లో గురువారం మన గ్రామం-మన విశాఖ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి నాగ పద్మారావు, ఎంఈవో డీవీడీ ప్రసాద్ నేతృత్వంలోని అధికారుల బృందం గ్రామంలో పర్యటించింది. గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నించి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈవో ప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దివాణం, వెలుగు ఏపీఎం శివప్రసాద్, ఉపాధి ఏపీవో నానిబాబు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల బిల్లుల మంజూరులో జాప్యం

కోటవురట్ల : మరుగుదొడ్ల బిల్లుల మంజూరులో జాప్యంపై పీకేపల్లి గ్రామస్థులు అధికారులను నిలదీశారు. గురువారం ఆ గ్రామంలో మన గ్రామం, మన విశాఖ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత ఏడాది నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణలకు ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీప్రియ గతంలో ఇక్కడ పని చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వేరే చోటుకి బదిలీ అయ్యారని, దీనిపై తనకు అవగాహన లేదన్నారు. సిబ్బందిని వివరాలు అడిగి బిల్లులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో సర్పంచ్ రమణ, ఏపీవో నాగరాజు, పాల్గొన్నారు.



పీకేపల్లిలో సభలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీప్రియ

ఈ రోజు...

శ్రీప్రకాష్ వ్యవస్థాపక దినోత్సవం

పాయకరావుపేట : పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల 41వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శుక్రవారం నుంచి జరగనున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా విద్యా సంస్థల్లోని వివిధ తరగతుల విద్యార్థుల మధ్య గాతా రహే మేరా దిల్ అన్న ప్రోగ్రాం ద్వారా జూనియర్, సీనియర్ విభాగాల్లో పాటల పోటీ నిర్వహించనున్నట్టు విద్యా సంస్థల లైజన్ అధికారి పోలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పోటీల్లో పాయకరావుపేట తుని, పెద్దాపురం, రాజమండ్రిలోని విద్యార్థులు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. మొదటి రోజు కార్యక్రమానికి ప్రముఖ గిటార్ వాయిద్యకారుడు మహమ్మద్ పర్వేజ్, ప్రముఖ వయోలిన్ వాయిద్యకారిణి కొత్తపల్లి విజయ, వేణుగాన విద్యాంసుడు ఎ.ఎస్. జాన్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. గాతా రహే మేరా దిల్ తరువాత ఈ ముగ్గురితో జుగల్బందీ ఉంటుందన్నారు. అలాగే చివరి రోజు జరిగే ఫైనల్ పోటీలకు ప్రముఖ సినీ నేపథ్య గాయని గోపికా పూర్ణిమ న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తారన్నారు. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ ఉపాధ్యాయులు, స్పెసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ రీ కనెక్షన్ మేళా

నక్కపల్లి : ఉపమాక హైవే జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం బీఎస్ఎన్ఎల్ రీ కనెక్షన్ మేళా నిర్వహించనున్నట్టు టెలికాం శాఖ స్థానిక జేఈ దిలీప్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో బిల్లు చెల్లించకపోవడం వల్ల ల్యాండ్ లైన్ కనెక్షన్ తొలగింపబడిన వారికి వాయిదాల పద్ధతిలో కనెక్షన్లు పునరుద్ధరిస్తామని చెప్పారు. కొత్త వారికి కేవలం రూ.49 లకే ల్యాండ్ లైన్ కనెక్షన్ ఇస్తామని, రూ.249లకే బ్రాండ్‌బాండ్ కనెక్షన్ మంజూరు చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుర్గభవానీ ఆలయంలో కుంకుమ పూజలు

నక్కపల్లి : ఉపమాకలోని దుర్గాభవానీ ఆలయం వద్ద శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు జరగనున్నట్టు ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకట రమణ చెప్పారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు అమ్మవారికి మహిళా భక్తులతో ఈ పూజ జరుగుతుందన్నారు.

చెత్తశుద్ధి కేంద్రం పరిశీలన

ఎస్.రాయవరం(నక్కపల్లి):ఎస్.రాయవరంలో పంచాయతీలో నిర్వహిస్తున్న ఘన, వ్యర్థ పదార్థాల నిర్వాహణ ప్లాంట్‌ను మండల ప్రత్యేకాధికారి కె.కోటేశ్వరరావు, ఎంపీడీవో స్వరూపారాణి గురువారం సందర్శించారు. ఈమేరకు వారు ప్లాంటులో సేంద్రియ ఎరువుల తయారీతో పాటు తడి, పొడి చెత్త విభాగాలను పరిశీలించారు. ఈవోఆర్‌డీ కొండలరావు ప్లాంట్ నిర్వహణ వారికి గురించి తెలిపారు. పంచాయతీలో పాలిథిన్ కవర్ల వినియోగాన్ని కూడా నిషేధించాలని ఎంపీడీవో ఆయనకు సూచించారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవం వాయిదా

కోటవురట్ల : మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవం మళ్లీ వాయిదా పడింది. కానీ అందుకు గల కారణాలు తెలియడం లేదు. పీహెచ్‌సీగా ఉన్న ఈ ఆస్పత్రిని 1999లో వైద్య విధాన పరిషత్‌లోకి మార్పు చేశారు. అయితే అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించలేదు. దీంతో రోగులతో పాటు సిబ్బంది ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ. 3. 8 కోట్ల మంజూరు చేసింది. ఇదే సమయంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో అదనపు పడకలకు మంత్రి కామినేని శ్రీనివాసరావు శంఖుస్థాపన చేశారు.

అదే రోజు ఇక్కడి ఆస్పత్రి భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయాలని అధికారులు భావించారు. కానీ వాయిదా పడింది. దీంతో అధికారులు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఎట్టకేలకు పనులు పూర్తయ్యాయి. నర్సీపట్నం 150 పడకల ఆస్పత్రితో పాటు ఇక్కడి 30 పడకల ఆస్పత్రిని గురువారం ప్రారంభోత్సవానికి అధికారులు సిద్ధం చేశారు. కానీ ఏమైందో గాని మళ్లీ ఈ కార్యక్రమం కూడా వాయిదా పడింది. ఇందుకు గల కారణాలు తెలియడం లేదు. ప్రోటోకాల్ విషయమా లేదా ఎమ్మెల్యే అనిత నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో ఉండటమా లేక ఇద్దరు మంత్రుల మధ్య అభిప్రాయ బేధాల అన్నది అంతుపట్టడం లేదు. ఈ విషయమై అధికారులను వివరణ కోరినా... ఏమీ చెప్పడం లేదు.

ఘనంగా ఓరుగంటాలమ్మ పండుగ

పాయకరావుపేట : మండలంలోని ఆరట్లకోట గ్రామంలో గురువారం ఓరుగంటాలమ్మ అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. గ్రామ ప్రారంభంలో ఉన్న ఈ ఆలయానికి స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, కానులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. అర్ధరాత్రి తరువాత కూడా దర్శనాలు కొనసాగాయి. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంతో పాటు గ్రామంలోని ప్రధాన రహదారిని విద్యుల్ లైటింగ్‌తో అలంకరించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయ. ఎటువంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు(ఇన్‌సెట్లో) అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పశుగ్రాస క్షేత్రాలతో పశువులకు సంరక్షణ

ఎంపీపీ వినోద్‌రాజు

ఎస్.రాయవరం(నక్కపల్లి) : పశువుల సంరక్షణకే ప్రభుత్వం ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేస్తుందని ఎంపీపీ వినోద్‌రాజు చెప్పారు. గురువారం ఆయన మండలంలోని వేమగిరి గ్రామంలో మండల పశువైద్యాధికారి బి.రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశుగ్రాస క్షేత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నిరంతరం గ్రాసం వుండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఊరూరా పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. పశుగ్రాసం పెంచేందుకు భూములిచ్చిన రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్టు చెప్పారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ పోతు రంగారావు, టీడీపీ నేతలు వైవీఎన్ రాజు (సతీష్), అమలకంటి పాపారావు, పినపాత్రుని సూర్యనారాయణ, లింగరాజుపాలెం పశువైద్యశాఖ డాక్టర్ రాజేష్, సిబ్బంది రమణి, పాల్గొన్నారు.



పశుగ్రాస క్షేత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వినోద్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పెద్దలు

కోనవానిపాలెంలో కబడ్డీ పోటీలు

ఎస్.రాయవరం (నక్కపల్లి) : మండలంలోని తిమ్మాపురం పంచాయతీ కోనవానిపాలెం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన అప్పలరాజు, యాదవ సంక్షేమ సంఘం ప్రతినిధి నాగరాజు ప్రారంభించారు. పీఈటీ రాజు సమక్షంలో క్రీడాకారులను పెద్దలు పరిచయం చేసుకున్నారు.


మద్యం సీసాలు స్వాధీనం

నక్కపల్లి : స్థానిక ప్రభుత్వాసుపత్రి హైవే జంక్షన్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా బైక్‌పై మద్యంసీసాలు తరలిస్తున్న యువకుడిని పట్టుకుని అరెస్ట్ చేసినట్టు నక్కపల్లి ఎస్ఐ సింహాచలం చెప్పారు.గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు.నక్కపల్లికి చెందిన ఎ.ప్రసాద్ బైక్‌పై 20 మద్యం సీసాలు తరలిస్తుండగా వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నామని చెప్పారు. మద్యం సీసాలు, బైక్ స్వాధీనం చేసుకుని, ఆయనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

పుట్టిన రోజు, షష్టిపూర్తి, స్వదేశాగమనం, వర్ధంతి, శ్రద్ధాంజలి
సందర్భం ఏదైనా... మీ బంధువులకు, మిత్రులకు త్వరితగతిన సమాచారాన్ని అందించా లంటే 'ఆంధ్రజ్యోతి' లో ప్రకటన ఇవ్వండి!
9985410044

జోరుగా... హుషారుగా...

- ఇటీవల పడిన వర్షాలతో ఊపందుకున్న ఖరీఫ్ పనులు
- నీటితో కళకళలాడుతున్న పంట కాలువలు
- చకచకా దమ్ములు, వరి నాట్లు
- కూలీల కొరతతో రైతుల పాట్లు


పులపర్తిలో దమ్ము పెట్టిన తరువాత కాడెద్దులతో పట్టి తొలుతున్న రైతు

వరుణుడు కరుణించాడు...అన్నదాత ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యాడు. తొలకరికి ముందే పలకరించిన వర్షాలు ఆ తరువాత ముఖం చాటేయడంతో ఈ ఖరీఫ్‌లోనూ న(క)ష్టాలు తప్పవేమోనని రైతులు భయపడ్డారు. కానీ వారం రోజులుగా ఆడపా దడపా పడుతున్న చినుకులతో రైతుల్లో మళ్లీ ఆశలు రేకెత్తాయి. భారీ వర్షాలకు చెరువులు, పంట కాలువలు, పొలాలు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. ఎలమంచిలి మండలంలోని ఏటికొప్పాక, పద్మనాభరాజుపేట, బయ్యవరం, పులపర్తి, కృష్ణాపురం, గూండ్రుబిల్లి గ్రామాల్లో ప్రస్తుతం వరి నారుతీత, దమ్ములు, నాట్లు వేసే పనులు జోరుగా సాగుతున్నాయి. ఏటికొప్పాక వరహానది నుంచి పులపర్తి పంట కాలువకు పూర్తిస్థాయిలో నీరు రావడంతో రైతులంతా ఒకేసారి పనులు ప్రారంభించారు. దీంతో కూలీల కొరత ఏర్పడింది. నీరు ఒక్కసారిగా రావడంతో కొందరు రైతులు వేగవంతంగా నాట్లు వేయాలన్న ఉద్దేశంతో ముందుగా ట్రాక్టర్లతో దమ్ము పెట్టిస్తున్నారు. కానీ తరువాత నారు తీసి, నాట్లకు కూలీలు దొరక్క పోవడంతో వారే పనులు చేసుకుంటున్నారు.

- ఎలమంచిలి రూరల్


పద్మనాభరాజుపేటలో ట్రాక్టర్‌తో దమ్ము


ఏటికొప్పాకలో నారు తీస్తున్న మహిళలు


నీటితో కళకళలాడుతున్న పులపర్తిలోని పంట కాలువ


ఏటికొప్పాకలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

ఘనంగా ఎమ్మెల్యే గృహ ప్రవేశం


గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

అచ్యుతాపురం/రూరల్ : ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గృహ ప్రవేశం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. వేద పండితులు రమేష్‌బాబు దంపతులతో పూజా కార్యక్రమాలు చేయించారు. అలాగే గురువారం ఉదయం సత్యనారాయణస్వామి వ్రతం చేయించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ లాలం భవానీ, ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు, వైసీపీ నాయకులు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీలు చేకూరి శ్రీనివాసరాజు, దినబాబు, జెడ్పీటీసీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ జాతర

కశింకోట రూరల్ : తాళ్లపాలెంలో మరిడిమాంబ జాతర గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాయల మురళీధర్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, సర్పంచ్ చెవ్వేటి గోవిందమ్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

రాంబిల్లి :మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి ఇంటర్వ్యూలు జరిగాయి. రాంబిల్లి, దిమిలి ఎస్‌బీఐ అధికారులు, నారాయణపురంలోని కెనరా బ్యాంక్, ఎలమంచిలి డీసీసీబీ బ్యాంక్ అధికారులు అభ్యర్థులకు ఇంట ర్వ్యూలు నిర్వహించారు. మొదటి రోజు మూడు బ్యాంకుల పరిధిలో సుమారు 1258 మంది హాజరుకావాల్సి ఉండగా 800 మంది వచ్చారు. శుక్రవారం రాంబిల్లి, దిమిలి, పూడిమడక ఎస్‌బీఐ, గోకివాడ కెనరా బ్యాంక్‌ల అధి కారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీఓ నిర్మల తెలిపారు. అభ్య ర్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. అనిత, టీడీపీ నాయకుడు కె. తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

'మన గ్రామం-మన విశాఖ'లో ఎంపీపీ చేకూరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చేకూరి

అచ్యుతాపురం/రూరల్ : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం మన గ్రామం - మన విశాఖ కార్యక్రమాన్ని రూపొందించిందని ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు అన్నారు. గురువారం వెదురువాడలో జరిగిన మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల అధికారుల పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని, దీనికి ప్రజా సహకారం కూడా అవసరమని చెప్పారు. అనంతరం గ్రామం మధ్యలో ఉన్న చెరువులో కలుస్తున్న మురుగునీరు సమస్య పరిష్కారానికి రూ. 10 లక్షలతో కాలువలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. సర్పంచ్ గొర్లె లోవ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బలరాముడు, మండల ఇంజనీర్ సోమశేఖర్, వెలుగు ఏపీఎం పద్మ, ఎంసీఓ బీలా అప్పారావు, గొర్లి రామజోగి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

మునగపాక :ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు సూచించారు. ఒంపోలులో జరిగిన మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని అర్హులందరికీ పథకాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం అధికారుల బృందం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ డిపోను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శాంతలక్ష్మి, తహసీల్దార్ రాంబాబు, సర్పంచ్ దొడ్డి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

వైసీపీ నేత బొడ్డేడ ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

అచ్యుతాపురం : గ్రామాల్లో వైసీపీని మరింతగా బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన పూడిమడకలో కార్యకర్తలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. టీడీపీ పాలకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే పార్టీ అధినేత జగన్ ప్రకటించిననవరత్నాలపై ప్రజలకు వివరించాలని చెప్పారు. పేదలకు ఎటువంటి అన్యాయం జరిగినా.. స్థానిక నాయకులు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.పూడిమడకలో నిర్మిస్తున్న ఇళ్లను టీడీపీ నాయకులు తమ తొత్తులకు కేటాయించాలని ప్రయత్నిస్తే ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చేపల వెంకటరమణ, చోడిపల్లి అప్పారావు, మేరుగు అప్పలనాయుడు, గండిబోయిన వెంకట్, పిన్నమరాజు వాసు, నర్మాల రామకృష్ణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి శాసన సభ్యులు గౌ॥ శ్రీ పీలా గోవింద సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు

నేడు ఎమ్మెల్యే పీలా జన్మదిన వేడుకలు



అనకాపల్లి టౌన్ : ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. నూకాంబిక ఆలయం ఆవరణలోని కల్యాణ మండపంలో ఉదయం ఎనిమిది గంటలకు ఎమ్మెల్యే పీలా సతీసమేతంగా నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న అనంతరం జన్మదిన వేడుకల్లో పాల్గొంటారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా పార్టీ నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, మళ్ల సురేంద్ర తదితరులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కశింకోట మండలంలో వేడుకలకు సన్నాహాలు

కశింకోట రూరల్ : ఎమ్మెల్యే పీలా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కశింకోట మండలంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మండల టీడీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శుభాకాంక్షలు తెలుపుతూ భారీగా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు.

నెల రోజుల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

అనకాపల్లి టౌన్ : నెల రోజుల్లో అనకాపల్లి నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల (ఏపీయూడబ్ల్యూజే) యూనియన్ వార్షికోత్సవాలు గురువారం ఇక్కడ యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎం.రాంబాబు ఆధ్వర్యంలో జరిగాయి. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ దినంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో కార్యాలయం ఆవరణలోని జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పీలా, ఆర్డీవో ఎంవీ సూర్యకళ, జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పీలా

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వ్యవహరిస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.









జనహృదయనేత గా॥ శ్రీ పీలా గోవింద సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు



తాళ్లపాలెంలో ఘనంగా మరిడిమాంబ జాతర

కశింకోట రూరల్ : తాళ్లపాలెంలో మరిడిమాంబ జాతర గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళీధర్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు, సర్పంచ్ చెవ్వేటి గోవిందమ్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.


అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పీలా









కల్యాణిగిరిపై నవచండీ యాగం ప్రారంభం

కొత్తూరు : సత్యనారాయణపురంలోని కల్యాణగిరిపై వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం నవచండీ యాగం ప్రారంభమైంది. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి ధర్మాచార్యులు మాట్లాడుతూ శుక్రవారం కూడా ఈ యాగం జరగనుందన్నారు. ఆలయ వ్యవస్థాపక కార్యదర్శి బోయిన నాగేశ్వరరావు, ఆలయ చైర్మన్ మేడిశెట్టి రామసత్యనారాయణ, అధ్యక్షుడు ఎడ్ల త్రినాథ రావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.






















అందరివాడు గౌ॥ శ్రీ పీలా గోవింద సత్యనారాయణ గార్కి జన్మదిన శుభాకాంక్షలు

మాధవి విద్యా విహార్‌కు ఫ్యాన్లు బహూకరణ

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని విజయరామరాజుపేటలో ఉన్న గుడిలోవ వారి మాధవి విద్యావిహార్ పాఠశాలకు నక్కపల్లి వాసులు గురువారం పది సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. నక్కపల్లి మండలం రేబాక సర్పంచి గొట్టిముక్కల శ్రీహరిరాజు కుమారుడు రవికుమార్‌రాజు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఆయనతో పాటు అతని మిత్రులు ఇంజనీర్లు మురళీ, శ్రీకాంత్, శేఖర్, రాంబాబు, సీతారామయ్య, కృష్ణారెడ్డిల సహకారంతో కొనుగోలు చేసిన పది ఫ్యాన్లను శ్రీహరిరాజు స్కూల్ కరస్పాండెంట్ ఒరుగంటి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూకాల అప్పలరాజుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫ్యాన్లు అందిస్తున్న శ్రీహరిరాజు

నేడు అమృతవర్షిణి అరుంధతిదేవీ ఆలయం వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్ : గవరపాలెం అరుంధతినగర్‌లోని నక్షత్ర అమృతవర్షిణి అరుంధతి దేవి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం శుక్రవారం జరగనుందని అరుంధతి సంక్షేమ సేవా సంఘం తెలిపింది. సంఘ గౌరవాధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభం కానున్నట్టు వివరించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

వివిధ కార్పొరేషన్ల రుణ మేళాకు 187 మంది హాజరు

కశింకోట రూరల్ : కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ కార్పొరేషన్లకు సంబంధించి రుణ మేళా నిర్వహించారు. ఇందుకు సంబంధించి జరిగిన ఇంటర్వ్యూలను ఎంపీపీ పంచదార్ల లక్ష్మి, ఎంపీడీవో సత్యనారాయణల ఆధ్వర్యంలో బ్యాంకర్లు జరిపారు. అంతకు ముందు ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ అర్హులంతా రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, బీసీ, కాపు మైనార్టీ వర్గాలకు సంబంధించి 187 మంది ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

























సమస్యల పరిష్కారానికే 'మన ఊరు- మన విశాఖ'

అనకాపల్లి, కశింకోట మండలాల ప్రత్యేకాధికారులు సిరి, శ్రీనుబాబు

కొత్తూరు : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే మన ఊరు- మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారిణి డాక్టర్ ఎ.సిరి తెలిపారు. వెంకుపాలెం గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడారు. వృద్ధాప్య పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇరిగేషన్ కాలువలు, రెవెన్యూ సంబంధిత సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీవో బీవీ రమణ, ఈవోఆర్డీ అప్పలరాజు, ఆర్ఐ నవీన్ కుమార్, ఇరిగేషన్ ఏఈ రామకృష్ణ, ఎంఈవో దివాకర్, సర్పంచ్ ఆడారి అనురాధ, ఎంపీటీసీ రాపేటి రాము, ఐసీడీఎస్ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

బుచ్చియ్యపేటలో...

కశింకోట రూరల్ : మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో గురువారం మన గ్రామం - మన విశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనుబాబు మాటట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ధర్మారావు, ఏపీవో శ్రీనివాసరావు, ఏడీ హరికృష్ణ, సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ సాంబమూర్తి పాల్గొన్నారు.



బుచ్చియ్యపేటలో గ్రామ సభ దృశ్యం





విద్యార్థులకు తట్టు రుబెల్లా వ్యాక్సిన్



నెహ్రూచౌక్ : ప్రతి పాఠశాలలో పదిహేనేళ్లలోపు విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్నామని యూఎఫ్‌డబ్ల్యూసీ డాక్టర్ ఎంవీ రమణ తెలిపారు. గూడ్స్ రోడ్డులో గల భాష్యం స్కూల్‌లో గురువారం విద్యార్థులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషగిరిరావు, ఏఎన్ఎంలు అన్నమ్మ, లక్ష్మి, శాంతమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మంత్రి దిష్టిబొమ్మ దహనం

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని రామచంద్ర థియేటర్ జంక్షన్‌లో గురువారం మంత్రి ఆదినారాయణరెడ్డి దిష్టిబొమ్మను దళిత సంఘాలు, ప్రజా సంఘాలు సంయుక్తంగా దహనం చేశాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి దళితుల పట్ల అవమానకరంగా మాట్లాడారని నిరసిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించిన నాయకులు, అనంతరం మంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి దళితవాడలకు వచ్చినప్పుడు అపరిశుభ్రత కనపడలేదా అని వైసీపీ దళిత విభాగం నాయకుడు బోని గణేష్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎ.బాలకృష్ణ, జాజుల రమేష్, ఎన్.యామిని, ఎస్.మాణిక్యాలరావు, ఎల్.శ్రీను, తదితరులతో పాటు పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు







29న యువజనోత్సవాలు

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని వేల్పుల వీధి సీతారామ కల్యాణ మండపంలో ఈ నెల 29న డివిజన్ స్థాయి యువజనోత్సవాలు జరగనున్నాయని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న వివిధ సాంస్కృతిక పోటీలకు 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్కులు అర్హులన్నారు. జానపద నృత్యాలు, జానపద గీతాలు, వక్తృత్వ , సంప్రదాయ నృత్యం, సాంప్రదాయ గాత్రం, సాంప్రదాయ వాయిద్యాలు, మృదంగం, తబలా పోటీలు ఉంటాయన్నారు.

అర్హులందరికీ సబ్సిడీ రుణాలు

మండల సమన్వయాధికారిణి సిరి

అనకాపల్లి రూరల్ : అర్హులైన వారందరికీ ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందిస్తుందని మండల సమన్వయాధికారిణి ఎ.సిరి తెలిపారు. ఇక్కడి మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నవారికి గురువారం రెండవ విడత ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకర్లు, మండల కమిటీ సమక్షంలో నిర్వహించిన ఇంటర్వ్యూలను ఆమె పరిశీలించారు. దళారులను ఆశ్రయించి ఎవరూ మోసపోవద్దని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొణతాల వెంకటసావిత్రి, ఎంపీడీవో పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.





ఉడ్‌పేట రోడ్డు సమస్యపై ఆందోళన

అనకాపల్లి టౌన్ : తవ్వి వదిలేసిన ఉడ్‌పేట రహదారిని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు గురువారం ఆ ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. ముత్యం వారి వీధి నుంచి రామచంద్ర థియేటర్ రోడ్డులో మంచినీటి పైపులైన్ నిర్మాణం నిమిత్తం జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులు రోడ్డును తవ్వేశారని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ కొణతాల హరనాథబాబు పేర్కొన్నారు. పనులు ప్రారంభించి వారం రోజులు గడిచినా రోడ్డును యథావిధిగా నిర్మించకపోవడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వివరించారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని కోరారు. పార్టీ నాయకులు మావూరి రవికుమార్, బలిరెడ్డి రమణ, చందక సత్తిబాబు, అప్పికొండ సాయి, కె.నూక రమణబాబు తదితరులు పాల్గొన్నారు.





ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్మికుల ధర్నా

అనకాపల్లి టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గురువారం ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించినా యాజమాన్యం నేటి వరకు చొరవ చూపకపోవడం విచారకరమని యూని యన్ డిపో కార్యదర్శి కె.బిక్కుబాబు పేర్కొన్నారు. కొత్త చార్టులో అందరికీ సమాన న్యాయ జరగాలని, ప్రతి కార్మికునికి రెండు రోజులు సెలవు ఇవ్వాలని, ప్రభుత్వం సిక్ సెలవులపై జీతాలు ఇవ్వాలని, సీఐ అందుబాటులో లేనపుడు కంట్రోలర్లు సెలవు దరఖాస్తులు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



డిపో ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

